www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 27-7-2025 | పేజీలు: 14+ 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 119 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం, తిథి: తదియ రా.10.42 తదుపరి చవితి, నక్షత్రం: మఖ సా.4.23 తదుపరి పుబ్బ, వర్జ్యం: రా.12.47-2.27, దుర్ముహూర్తం: సా.5.04-5.55, అమృతఘడియలు: మ.1.55-3.33, రాహుకాలం: సా.4.30-6.00, సూర్యోదయం: 5.56, సూర్యాస్తమయం: 6.46 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



కొత్త పలుకు

మీ చేతుల్లోనే ఉంది మిలార్డ్స్!

నోట్ల కట్టలు తగులబడిన ఉదంతంలో అభిశంసనకు గురికాబోతున్న ఢిల్లీ హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ నోట్ల కట్టలు దొరికినంత మాత్రాన ఒక వ్యక్తిని నిందితుడిగా ఎలా పరిగణిస్తారని ప్రశ్నిస్తున్నారు. అంతటితో ఆగకుండా తనపై చర్య తీసుకునే అధికారం కానీ, విచారణ జరిపే అధికారం కానీ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేదంటూ సుప్రీంకోర్టులోనే పిటిషన్ వేశారు.

హైకోర్టు న్యాయమూర్తులు ఇస్తున్న కొన్ని ఆదేశాలపై దేశ సర్వోన్నత న్యాయస్థానం చేస్తున్న వ్యాఖ్యలు, వెల్లడిస్తున్న అభిప్రాయాలు సంచలనంగా ఉంటున్నాయి. కొన్ని సందర్భాలలో సుప్రీంకోర్టు వ్యాఖ్యలు కటువుగానూ ఉంటున్నాయి. ఆ వ్యాఖ్యలను పరిశీలిస్తే సుప్రీంకోర్టు ఆగ్రహానికి గురైన వారు హైకోర్టు న్యాయమూర్తులుగా ఎలా నియమితులయ్యారు? అన్న సందేహం కలగడం సహజం.

హత్య కేసులో అరెస్టై జైల్లో ఉన్న కన్నడ నటుడు దర్శన్‌కు కర్ణాటక హైకోర్టు బెయిల్ మంజూరు చేయడంపై సుప్రీంకోర్టు విస్మయం వ్యక్తంచేసింది. 'పర్వర్టడ్ ఆర్డర్' అని కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇంకొంచెం వెనక్కు వెళితే, ఆంధ్రప్రదేశ్‌లో ఐపీఎస్ అధికారి సంజయ్‌కు ముందస్తు బెయిల్ మంజూరు చేయడంపై కూడా సుప్రీంకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. బెయిల్ విచారణ దశలోనే పూర్తి స్థాయి ట్రయల్ నిర్వహించినట్టుగా 49 పేజీల ఆదేశాలు జారీ చేయడం ఏమిటి? అని సుప్రీంకోర్టు నిలదీసింది.

అక్రమ మైనింగ్ కేసులో సుదీర్ఘ విచారణ అనంతరం హైదరాబాద్‌లోని సీబీఐ కోర్టు గాలి జనార్దన్ రెడ్డిని దోషిగా నిర్ధారిస్తూ ఏడేళ్ల కారాగార శిక్ష విధించింది. దాదాపు పదమూడేళ్ల విచారణ తర్వాత సీబీఐ కోర్టు ఈ తీర్పు వెలువరించగా హైకోర్టు మాత్రం అతి తక్కువ వ్యవధిలోనే గాలి జనార్దన్ రెడ్డి పిటిషన్‌పై విచారణ చేసి బెయిల్ మంజూరు చేయడమే కాకుండా సీబీఐ కోర్టు తీర్పుపై స్టే కూడా విధించింది. ఇలాంటి సందర్భాలలో కింది స్థాయి న్యాయ వ్యవస్థలో నైతికత చచ్చిపోదా? అన్న అనుమానం కలుగుతుంది.

జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో నోట్ల కట్టలు తగలబడటాన్ని యావద్దేశం గమనించింది. అయినా ఆయనను అభిశంసించాలని పార్లమెంటును కోరే అధికారం కూడా సుప్రీంకోర్టుకు ఉండదా? తప్పు చేసిన కింది స్థాయి న్యాయాధికారులపై చర్య తీసుకునే అధికారం హైకోర్టులకు ఉంది. అదే హైకోర్టు తప్పు చేస్తే మాత్రం చర్య తీసుకోకూడదట! ఈ రక్షణ వల్లనే కదా న్యాయ వ్యవస్థలో పెడధోరణులు చోటు చేసుకుంటున్నాయి.

తప్పు చేస్తే చర్యలు ఉంటాయన్న భయం ఉంటేనే కదా ఏ వ్యవస్థ అయినా బాధ్యతగా ఉంటుంది? నేను ఏం చేసినా నన్ను విమర్శించకూడదు, నాపై ఎవరూ చర్యలు తీసుకోలేరు అనే అపరిమిత ధీమా ఏ వ్యవస్థకూ మంచిది కాదు. సుప్రీంకోర్టు తప్పు పడితే పరిస్థితి ఏమిటన్న కనీసపు వెరపు హైకోర్టులకు ఉండాలా? వద్దా? నటుడు దర్శన్ విషయంలో గానీ, ఐపీఎస్ సంజయ్ విషయంలో గానీ హైకోర్టులు అనుచితంగా బెయిల్ మంజూరు చేశాయని సుప్రీంకోర్టు భావించినప్పుడు సదరు ఆదేశాలు ఇచ్చిన వారు నిక్షేపంగా ఉండవచ్చా?

దేశంలో మిగతా వ్యవస్థలన్నీ విశ్వసనీయతను కోల్పోయాయి. ఒక్క న్యాయ వ్యవస్థ మాత్రమే అంతో ఇంతో విశ్వసనీయతను నిలుపుకొంది. నిజానికి న్యాయ వ్యవస్థ సక్రమంగా, నిజాయితీగా వ్యవహరిస్తే అన్ని వ్యవస్థలూ గాడిలోనే ఉంటాయి. న్యాయ వ్యవస్థపై ఇటు పాలకుల్లో అటు ప్రజల్లో భయం పోకూడదు.

న్యాయమూర్తులను జీతాలకు పనిచేసే మిగతా వారిలా సమాజం చూడటం లేదు. 'మిలార్డ్' అంటే నా ప్రభువా అని కోర్టుల్లో జడ్జిలను సంబోధిస్తారు. పౌరులకు న్యాయ వ్యవస్థపై విశ్వాసం పోతే మీరు ఎవరికి ప్రభువులు? అని ప్రశ్నించడానికి ఎంతో సమయం పట్టదు. న్యాయమూర్తులు సక్రమంగా ఉంటే వారి ఔన్నత్యాన్ని నాయకులూ దిగజార్చలేరు. కాబట్టి మీ వ్యవస్థ ఔన్నత్యాన్ని కాపాడుకోవడం మీ చేతుల్లోనే ఉంది మిలార్డ్స్!

అన్నీ స్విగ్గీ పాలిటిక్స్!

తమకు కావాల్సింది ఎక్కడ దొరుకుతుందనే చూస్తున్నారు

- సిద్ధాంతాల కోసం పాటుపడే నేతలు తగ్గిపోయారు
- మేనేజ్‌మెంట్ రాజకీయాలే నడుస్తున్నాయి
- ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి ప్రమాదకరం
- కార్యకర్తలు పోయి వలంటీర్ల వ్యవస్థ వస్తోంది
- ప్రస్తుత రాజకీయాలపై సీఎం రేవంత్ వ్యాఖ్యలు
- జైపాల్‌రెడ్డి పురస్కారాల ప్రదానోత్సవంలో ప్రసంగం
- పీవీ తర్వాత అంత గొప్ప రాజకీయాలు జైపాల్‌వే
- తెలంగాణ ఏర్పాటులో ఆయన పాత్ర కీలకమని వెల్లడి



జైపాల్‌రెడ్డి స్మారక అవార్డును రచయిత మోహన్ గురుస్వామికి అందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో పర్యావరణవేత్త పురుషోత్తంరెడ్డి బీజేడీ ఎంపీ సస్మిత్ పాత్ర

హైదరాబాద్/షాద్‌నగర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఒకప్పటి ఆదర్శవంతమైన రాజకీయాలు పోయి ఇప్పుడంతా స్విగ్గీ పాలిటిక్స్ వచ్చాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తమకు కావాల్సినది ఎక్కడ దొరుకుతుంది, ఎక్కడ త్వరగా డెలివరీ చేస్తారని చూస్తున్నారే తప్ప సిద్ధాంతాల కోసం పాటుపడేవారు తగ్గిపోయారని పేర్కొన్నారు. దేశ రాజకీయాల్లో ప్రజాస్వామిక విలువలు తగ్గిపోయాయని... మేనేజ్‌మెంట్ రాజకీయాలే ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని వ్యాఖ్యానించారు. ఈ తీరు ప్రజాస్వామ్య స్ఫూర్తికి అత్యంత ప్రమాదకరమని పేర్కొన్నారు. ప్రస్తుతం రాజకీయాల్లో కార్యకర్తలు పోయి వలంటీర్ వ్యవస్థ వస్తోందని... కార్యకర్తలు లేని రాజకీయాలు దేశ భవిష్యత్‌కు ప్రమాదకరమని చెప్పారు. సిద్ధాంతపరమైన రాజకీయాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. దేశ రాజకీయాల్లో ధన ప్రవాహం తగ్గించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు సహేతుక సూచనలు చేస్తే తీసుకోవడానికి తమకు ఎలాంటి ఇబ్బంది లేదని.. తాను సీఎంగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి

మిగతా 13వ పేజీలో...

క్యాబినెట్ తర్వాతే 'స్థానికం'పై స్పష్టత!

- గవర్నర్ దగ్గర ఆర్డినెన్స్
- కేంద్రానికి పంపిన బిల్లులు పెండింగ్‌లోనే..
- వీటిపై మంత్రివర్గంలో కీలక చర్చ.. ఒక నిర్ణయానికి వచ్చే అవకాశం

13

మరింత కొత్తగా సీఎంఆర్‌ఎఫ్

- దరఖాస్తుదారు వాట్సా‌ప్‌కే చెక్కు వివరాలు
- సీఎం సందేశంతో ప్రత్యేకంగా డిజైన్

ఆరోగ్యశ్రీ పరిధిలోకి కొత్తగా 30 లక్షల మంది

13

- కొత్త కార్డులతో పెరగనున్న సంఖ్య
- ఆరోగ్యశ్రీతో కార్డుల అనుసంధాన ప్రక్రియ
- ట్రస్టు కార్యాలయంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు





సికింద్రాబాద్‌లోని సృష్టి టెస్ట్‌ట్యూబ్ బేబీ సెంటర్ (ఇన్‌సెట్‌లో) డాక్టర్ నమ్రత

ఫర్టిలిటీ సెంటర్‌లో ఘరానా మోసం

ఇతరుల వీర్యంతో దంపతులకు సంతానం

- రెండేళ్ల తర్వాత వెలుగులోకి దారుణం
- బాబుకు క్యాన్సర్ రావడంతో అనుమానం
- డీఎన్‌ఏ పరీక్షల్లో బట్టబయలైన మోసం
- సికింద్రాబాద్‌లోని సృష్టి టెస్ట్‌ట్యూబ్ బేబీ సెంటర్‌పై దంపతుల ఫిర్యాదు
- పోలీసులు, వైద్యులు, అధికారుల తనిఖీలు
- లైసెన్స్ లేకుండా కొనసాగుతున్న కేంద్రం
- పోలీసుల అదుపులో డాక్టర్ నమ్రత!

సంతాన సాఫల్యం మాటున దందా

- దంపతులను మోసం చేస్తున్న కేంద్రాలు

అడ్డగుట్ట/హైదరాబాద్ సిటీ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లోని ఓ సంతాన సాఫల్య కేంద్రంలో ఘరానా మోసం వెలుగులోకి వచ్చింది. సంతానం కోసం వచ్చే దంపతుల వీర్యం, అండాలను కాకుండా.. దాతల నుంచి సేకరించిన వీర్యంతో సంతానం కలిగిస్తున్నట్లు నిర్ధారణ అయ్యింది. దీంతో.. బాధిత దంపతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ వెంటనే పోలీసులు, రెవెన్యూ అధికారులు, వైద్యాధికారులు ఆ కేంద్రంలో తనిఖీలు నిర్వహించారు. పోలీసుల కథనం ప్రకారం.. సంతానం లేని ఓ జంట రెండేళ్ల క్రితం సికింద్రాబాద్‌లోని సృష్టి టెస్ట్‌ట్యూబ్ సెంటర్‌ను ఆశ్రయించింది. వారిని పరీక్షించిన వైద్యులు.. భర్త వీర్యకణాలతో ఐవీఎఫ్ విధానం ద్వారా మహిళ గర్భం దాల్చేలా చేశారు. ఆ తర్వాత మహిళ మగబిడ్డకు జన్మనిచ్చింది. శిశువు తరచూ అనారోగ్యానికి గురవుతుండటంతో.. ఆ దంపతులు పరీక్షలు చేయించారు. ఫలితాల్లో బాబుకు క్యాన్సర్ ఉన్నట్లు తేలింది. తమ కుటుంబంలో ఎవరికీ లేని వ్యాధి బాబుకు

మిగతా 14వ పేజీలో...

ఆర్మీలో సరికొత్త దళం.. రుద్ర

- భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని 'ఆల్ ఆర్మ్ బ్రిగేడ్' ఏర్పాటు
- సరిహద్దుల్లో 'భైరవ్' పేరుతో లైట్ కమాండో బెటాలియన్ 12
- ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది వెల్లడి.. కార్గిల్ అమరులకు నివాళి

హౌసింగ్ బోర్డు అధికారులతో ఫంక్షన్ హాల్ నిర్వాహకుల గలాటా!

2

- తోపులాటలో కిందపడిన అధికారి
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

ప్రత్యేక పాఠ్యాంశంగా ఆపరేషన్ సిందూర్

- శుభాంశు శుక్లా రోదసి యాత్రపై కూడా ఎన్‌సీఈఆర్‌టీ యోచన 12

నాసాలో 4 వేల మంది ఉద్యోగులకు వీఆర్‌ఎస్!

- ప్రభుత్వ వ్యయం తగ్గింపు కోసం 12
- ట్రంప్ యంత్రాంగం చర్యల ఫలితం
- ముందస్తు రిటైర్మెంట్ కోసం ఒత్తిళ్లు
- నాసా బడ్జెట్‌లో ఇప్పటికే 24% కోత
- ఆందోళన వ్యక్తం చేస్తున్న శాస్త్రవేత్తలు

ఏఐ భామ.. బూతుల బొమ్మ!



ఏఐ స్టాండప్ కమెడియన్

- స్టాండప్ కామెడీలా అనిపించేలా బూతులు, అసభ్య వ్యాఖ్యలతో వీడియోలు
- మహిళా క్యారెక్టర్లతో మహిళలను కించపరిచే వ్యాఖ్యలు.. పురుషులపై ద్వంద్వ అర్థాల సెటైర్లు
- ఏఐ అని చెప్పినా నమ్మలేని రీతిలో రూపకల్పన
- ఫేస్‌బుక్, ఇన్‌స్టా, యూట్యూబ్‌ల్లో ఇవే ట్రెండింగ్
- కాసుల కోసం కొందరు ఐటీ నిపుణుల కక్కుర్తి
- విచ్చలవిడితనంపై పెరుగుతున్న ఆందోళన


హైదరాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఆకట్టుకునే రూపం.. అందమైన శరీర సౌష్టవం.. మత్తెక్కించే స్వరం.. కానీ అన్నీ అసభ్య, అశ్లీల, బూతు మాటలే!! ఇదేమిటి ఇంత అందంగా, బాగా చదువుకున్నవారిలా కనిపిస్తున్న అమ్మాయిలేంటి.. ఇలా చేస్తున్నారేమిటి అనే ఆశ్చర్యం కలగకమానదు. కానీ అది

మిగతా 2వ పేజీలో...

నిండుకుండలా సాగర్

ఈ నెల 29న తెరుచుకోనున్న నాగార్జునసాగర్ క్రస్ట్ గేట్లు

- జూలైలోనే గేట్లు తెరవడం 18 ఏళ్ల తర్వాత తొలిసారి
- సామర్థ్యం 590 అడుగులు.. ప్రస్తుతం 581 అడుగులకు
- ప్రాజెక్టులోకి 1.2 లక్షల క్యూసెక్కుల వరద
- భద్రాచలం వద్ద 32.5 అడుగుల ఎత్తులో గోదావరి ప్రవాహం
- రాష్ట్రంలో పలుచోట్ల వర్షాలు.. కామారెడ్డి జిల్లాలో 6.6 సెం.మీ
- దెబ్బతిన్న ఇళ్లు.. పాలమూరు జిల్లాలో ఒకరి మృతి
- రాష్ట్రంలో నేడు కూడా అక్కడక్కడా తేలికపాటి జల్లులు



నాగార్జునసాగర్ జలాశయం

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

ఆల్మట్టి నుంచి శ్రీశైలం దాకా అన్ని ప్రాజెక్టులను నిండుగా నింపిన కృష్ణమ్మ, నాగార్జునసాగర్‌కూ పూర్తి జలకళ తెచ్చేసింది. ప్రాజెక్టు దాదాపుగా నిండిపోయింది. గరిష్ఠ నీటిమట్టం 590 అడుగులకు ప్రస్తుతం 581.30 అడుగులకు నీరు చేరింది. టీఎంసీల పరంగా చూస్తే.. 312 టీఎంసీల సామర్థ్యానికి గాను ప్రస్తుతం 286.76 టీఎంసీల నీరు ఉంది. మరో రెండు రోజుల్లో ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకుంటుందని.. 29న సాగర్ క్రస్ట్ గేట్లను ఎత్తి దిగువకు నీరు విడుదల చేయనున్నట్లు ప్రాజెక్టు ఇన్‌చార్జి ఎస్ఈ మల్లికార్జునరావు శనివారం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. సాగర్ క్రస్ట్‌గేట్లను సాధారణంగా ఆగస్టు, సెప్టెంబరులో తెరుస్తారు. జూలైలో ఎత్తడం అరుదు. ఈసారి జూన్ 30 నుంచే

మిగతా 3వ పేజీలో...

వెయ్యి స్కూళ్లలో ప్రీ ప్రైమరీ తరగతులు

- ఈ ఏడాది నుంచే ప్రభుత్వ ప్రైమరీ స్కూళ్లలో
- ప్రతి బడికి ఒక ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టు
- విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, స్నాక్స్
- నిద్ర పోయేందుకు పాఠశాలలోనే ఏర్పాట్లు

హైదరాబాద్, జూలై 26 (ఆంధ్ర జ్యోతి): ప్రాథమిక విద్య, ప్రాథమిక పాఠశాలల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా పూర్వ ప్రాథమిక (ప్రీప్రైమరీ) తరగతులు ప్రారంభించనుంది. ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల ప్రాథమిక పాఠశాలల్లో అమలు చేయనుంది. ఇందుకోసం గత నెలలో 210 పాఠశాలల వివరాలు

మిగతా 13వ పేజీలో...



చేనేత, జౌళిశాఖ అధికారులతో మంత్రి తుమ్మల సమీక్ష

స్వయం సహాయక సంఘాల మహిళలకు దసరా చీర

- నాలుగైదు నెలల తర్వాత మరో చీర
- ఇందిరా క్రాంతి శక్తి పథకంలో భాగంగా పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం! 2
- ఎస్‌హెచ్‌జీల్లో 65 లక్షల మంది మహిళలు

నదీ జలాల వాటా తేల్చకుంటే మరో ఉద్యమం

- తెలంగాణకు గురుశిష్యుల ద్రోహం 2
- బనకచర్లతో గోదావరి జలాలకు ఎసరు: హరీశ్

కవితను జైలు నుంచి విడిపిస్తే బీఆర్‌ఎస్‌ను బీజేపీలో విలీనం చేస్తామన్నది మరిచావా?

- కేటీఆర్‌పై సీఎం రమేష్ సంచలన ఆరోపణలు
- న్యాయబద్ధంగానే రిత్విక్ సంస్థ కాంట్రాక్టును దక్కించుకుందని వెల్లడి 14

విలీనమా.. పస లేని ఆరోపణ

- బీఆర్‌ఎస్‌నూ ఏ పార్టీలోనూ కలపం: కేటీఆర్



టీచర్ల పదోన్నతులకు పచ్చజెండా

13

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆమోదం
- రేపు షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం
- ప్రమోషన్లు పొందనున్న 4 వేల మంది

తెలంగాణకు గురుశిష్యుల ద్రోహం

- బనకచర్లతో గోదావరి జలాలకు ఎసరు
- నదీ జలాల వాటాలు ముందుగా తేల్చండి
- లేదంటే మరో తెలంగాణ ఉద్యమం తప్పదు: హరీశ్



ఉప్పల్/మల్లాపూర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రేవంత్‌రెడ్డి పాలనలో తెలంగాణ అస్తిత్వం ప్రమాదంలో పడిందని, బనకచర్ల ప్రాజెక్టుతో గోదావరి జలాలను ఆంధ్రాకు తరలించే కుట్ర జరుగుతోందని బీఆర్‌ఎస్ నేత, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. తెలంగాణ నీళ్లు ఆంధ్రాకు, నిధులు రాహుల్‌కు వెళ్తున్నాయని విమర్శించారు. గురు శిష్యులైన చంద్రబాబు, రేవంత్‌రెడ్డి కలిసి తెలంగాణకు ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. గోదావరి జలాల్లో ఆంధ్రా, తెలంగాణ వాటాలు తేల్చిన తర్వాతే బనకచర్లపై ముందుకు సాగాలని డిమాండ్ చేశారు. లేదంటే మరో తెలంగాణ ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఉప్పల్ నియోజకవర్గంలోని మల్లాపూర్‌లో శనివారం నిర్వహించిన బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర స్థాయి సదస్సులో గోదావరి జలాలు- బనకచర్ల ప్రాజెక్టుపై ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ద్రోహులెవరన్న దానిపై చరిత్ర రాస్తే మొదటి పేరు చంద్రబాబు, రెండో పేరు రేవంత్‌రెడ్డిదే ఉంటుందని వ్యాఖ్యానించారు. నాడు తెలంగాణ ఉద్యమానికి ద్రోహం చేసిన రేవంత్‌రెడ్డి.. నేడు గోదావరి జలాలను ఆంధ్రాకు కట్టబెట్టేందుకు అండగా నిలుస్తున్నారని ఆరోపించారు. "62వేల కోట్లుగా ఉన్న రాష్ట్ర బడ్జెట్‌ను బీఆర్‌ఎస్ దిగిపోయే నాటికి 3లక్షల కోట్ల దాకా తెచ్చాం. కేంద్రాన్ని ఒప్పించి రాష్ట్రపతి ఉత్తర్వుల్లో మార్పులు చేసి 95శాతం ఉద్యోగాలు తెలంగాణ యువకులకే వచ్చేలా చేశాం. తెలంగాణ ఉద్యమంలో ముందుండి కొట్లాడిన విద్యార్థులకు.. రాజకీయ పదవులు ఇచ్చాం. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ఆంధ్రాలోని టీడీపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కలిసి తెలంగాణ హక్కులకు భంగం కలిగించే కుట్రలు పన్నుతున్నాయి. తెలంగాణ పల్లెల్లో తెలంగాణకు మరోసారి జరుగుతున్న అన్యాయాన్ని విద్యార్థులుగా మీరంతా పల్లెలకు వెళ్లి ప్రజలకు తెలియజేయాలి. గురు శిష్యులు చంద్రబాబు, రేవంత్‌లు తెలంగాణకు చేస్తున్న ద్రోహాన్ని పూసగుచ్చినట్లు చెప్పాలి." అని సూచించారు.

పాడి కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి

- పోలీసులకు ఫిర్యాదు చేసిన కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ నేతలు
- దళిత పరిరక్షకుడు సీఎం రేవంత్‌పై అడ్డగోలుగా మాట్లాడితే దళిత సమాజం ఊరుకోదు: సంపత్‌కుమార్

కడ్తాల్/శంకర్‌పల్లి/చేవెళ్ల/చౌదరిగూడ/కేశంపేట/షాద్‌నగర్/హైదరాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత, నిరాధార ఆరోపణలు చేసిన హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేశారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పకపోతే యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కేసీఆర్, కేటీఆర్ మెప్పు కోసం సీఎం ప్రతిష్ఠను దెబ్బతీసేలా వ్యవహరిస్తే ప్రజాగ్రహానికి గురికాక తప్పదన్నారు. కౌశిక్‌రెడ్డి ఏవిధంగా ప్రజలను మోసగించి, బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేసి ఎమ్మెల్యేగా గెలిచారో అందరికి తెలుసని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డిపై ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలు శనివారం హైదరాబాద్‌లో ఉద్రిక్తతలకు దారితీసింది. దాడి చేస్తామంటూ కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు హెచ్చరికలు చేయడంతో పోలీసులు కౌశిక్‌రెడ్డి ఇంటి వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ నేతలు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కౌశిక్‌రెడ్డి ఇంటికి చేరుకుని సాయంత్రం వరకు ఉండి వెళ్లిపోయారు. ఎన్‌ఎస్‌యూఐ నాయకులు కొండాపూర్‌లో కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి, కౌశిక్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాజ్యాంగ, దళిత పరిరక్షకుడు అయిన సీఎం రేవంత్‌రెడ్డిపై అడ్డగోలుగా మాట్లాడితే దళిత సమాజం ఊరుకోదని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ హెచ్చరించారు. మాజీ మంత్రి హరీశ్‌రావు మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతన్నారని మండిపడ్డారు. సాగునీటి విడుదల విషయంలో హరీశ్‌రావు డ్రామాలు మొదలెట్టారని విమర్శించారు. దళితుల భూముల విషయంతో, నేరెళ్ల ఘటనలో దళితులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన బీఆర్‌ఎస్ చరిత్రను ప్రజలు మరిచిపోలేదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ క్యాబినెట్‌లో దళితులు ఒక్కరూ లేరని, ఇప్పుడు నలుగురు మంత్రులున్నారని చెప్పారు.

స్వయం సహాయక సంఘాల

మహిళలకు దసరా చీర

- నాలుగైదు నెలల తర్వాత మరొకటి
- ఇందిరా క్రాంతి శక్తి పథకంలో భాగంగా పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం!

హైదరాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల్లో(ఎస్‌హెచ్‌జీ)ని మహిళలకు ఇందిరా క్రాంతి శక్తి పథకంలో భాగంగా దసరా పండుగకు చీరలను పంపిణీ చేయాలని, మళ్లీ నాలుగైదు నెలల తర్వాత మరో చీరను ఇవ్వాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల్లో దాదాపు 65లక్షల మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. ఒక్కొక్కరికి రెండు చీరల చొప్పున పంపిణీ చేయాలంటే 1.30కోట్ల చీరలు అవసరం. ఈ మొత్తం చీరలన్నింటినీ తెలంగాణలోని నేత కార్మికులతోనే తయారు చేయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ చీరల కోసం 4.5కోట్ల మీటర్ల మేర క్లాత్ అవసరమని అంచనా వేసింది. అలాగే చీరల డిజైన్‌ను కూడా ఖరారు చేసింది. వివాదాలకు తావు లేకుండా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని చీరలను ఒకే డిజైన్‌లో పంపిణీ చేయనున్నట్లు తెలుస్తోంది. చీరలకు రూ.636 కోట్లకు పైగా ఖర్చు చేయనున్నారు. చీరల పంపిణీ మధ్య నాలుగైదు నెలల వ్యవధి ఉంటే నేత కార్మికులపై అధిక భారం పడకుండా ఉంటుందని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా, అన్ని ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లకు అవసరమైన వస్త్రాల తయారీ బాధ్యతను కూడా రాష్ట్రంలోని నేత కార్మికులకే ఇచ్చేలా ప్రభుత్వం ఇప్పటికే చర్యలు తీసుకున్నది. అలాగే టెస్కో నుంచి కూడా వస్త్రాల ఉత్పత్తికి అవసరమైన ఆర్డర్‌లను నేత కార్మిక సంఘాలకు ఇస్తోంది. ఇలా ఏడాది పొడవునా చేనేత కార్మికులకు పని కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. రాష్ట్రంలో 32వేలకు పైగా మరమగ్గాలున్నాయి. వీటిపై సుమారు 10వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. ప్రభుత్వం పంపిణీ చేసే చీరలను నేసేందుకు అవసరమైన నూలును కూడా ప్రభుత్వం క్రెడిట్ విధానంలో అందించేలా చర్యలు తీసుకుంది. నూలు మొత్తం ఖరీదులో 10% కార్మికులు చెల్లిస్తే.. మిగిలిన 90శాతాన్ని క్రెడిట్ కింద ప్రభుత్వం అందిస్తోంది. పని పూర్తై, బిల్లులు ఇచ్చిన తరువాత వారి నుంచి ప్రభుత్వం ఇచ్చిన 90శాతాన్ని రికవరీ చేసుకుంటోంది. ఈ విధానంతో కార్మికులకు ఆర్థికంగా వెసులుబాటును కల్పిస్తోంది.

చీరల తయారీ వేగం పెంచండి: తుమ్మల

స్వయం సహాయక సంఘాల మహిళలకు అందించే చీరల డిజైన్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇప్పటికే పరిశీలించారు. చీరల ఉత్పత్తిని వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. శనివారం సచివాయలంలో చేనేత, జౌళి శాఖలపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేపట్టబోయే 'వస్త్ర ప్రదర్శన' వేడుక ఏర్పాట్లను పటిష్ఠంగా నిర్వహించాలన్నారు. చేనేత రుణమాఫీ పథకం కింద లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేసి, వారి ఖాతాలలో రుణ మాఫీ నిధులు జమ చేయాలన్నారు. ఈ సమీక్షలో జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యార్, అధికారులు పాల్గొన్నారు.

ఏఐ భామ.. బూతుల బొమ్మ!

(మొదటిపేజీ తరువాయి)

ఏఐ మాయ.. అది బూతుల బొమ్మ! కృత్రిమ మేధతో రూపొందించిన ఈ వీడియోలు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌లలో వైరల్ అవుతున్నాయి. ఎక్కడో స్టాండప్ కామెడీ తరహాలో నిలబడి జోకులు చెబుతున్నట్టుగా కనిపించేలా రూపొందిస్తున్నవి కొన్ని అయితే... కేవలం బికినీ వేసుకుని రోడ్లపై తిరుగుతూ ఇంటర్వ్యూలు చేస్తున్నట్టుగా తయారు చేస్తున్నవి మరికొన్ని. మహిళలు, యువతుల పాత్రల (క్యారెక్టర్ల)తో మహిళలను కించపర్చేలా, పురుషులపై ద్వంద అర్థాలతో సెటైర్లు వేస్తూ ఈ వీడియోలు సిద్ధం చేస్తున్నారు. వాస్తవానికి కృత్రిమ మేధను సరిగ్గా వినియోగించుకుంటే వచ్చే ప్రయోజనాలు ఎన్నో ఉన్నాయి. కానీ సరదాకో, వైరల్ కావాలనో, కాసుల కక్కుర్తితోనో ఇలాంటి అశ్లీల వీడియోలను ఏఐతో రూపొందిస్తుండటంపై ఆందోళన వ్యక్తమవుతోంది. వీటిని నియంత్రించేలా ప్రభుత్వం, సామాజిక మాధ్యమాలు దృష్టిపెట్టాలన్న డిమాండ్లు వస్తున్నాయి.

రీల్స్ మోజులో అశ్లీలం వైపు..

యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ వంటివాటిలో ఆదాయం పొందే అవకాశం ఉండటంతో చాలా మంది సృజనాత్మక వీడియోలు చేస్తున్నారు. కొందరు ప్రత్యేక నైపుణ్యాలతో లక్షలకొద్దీ సబ్‌స్క్రైబర్లను, ఫాలోవర్లను సంపాదించుకుంటున్నారు. ఇది కాస్త శ్రమ, ఖర్చుతో కూడిన వ్యవహారం కూడా. తామూ ఫేమస్ కావాలని సామాజిక మాధ్యమాల్లోకి వస్తున్న మరి కొందరు సబ్‌స్క్రైబర్లు, వ్యూస్ పెద్దగా రావడం లేదన్న నిరాశతో హద్దులు దాటుతున్నారు. ఏఐ సాయంతో స్టాండప్ కామెడీ పేరుతో బూతు వీడియోలు రూపొందిస్తున్నారు. అందంగా, ఆకట్టుకునేలా ఉండే యువతులు, మహిళల రూపాన్ని ఏఐతో సిద్ధం చేస్తున్నారు. ఎత్తు, రంగు, వస్త్రధారణ, భాష, మాట్లాడాల్సిన పదాలు, ఇతర వివరాలను పేర్కొంటే చాలు.. ఏమాత్రం అనుమానం రానంత పకడ్బందీగా కృత్రిమ వీడియోలను సిద్ధం చేసే ఏఐ వెబ్‌సైట్లు ఎన్నో అందుబాటులోకి వచ్చాయి. ఐటీ రంగంలో పనిచేస్తున్న కొందరు ఏఐ నిపుణులు, ఉద్యోగులు కాసుల కోసం ఇలాంటి ఏఐ వీడియోలు రూపొందిస్తూ జనం మీదికి వదిలేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.



నిబంధనలను పట్టించుకునేవారెవరు?

సామాజిక మాధ్యమాల్లో పెట్టే వీడియోలు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉండాలి. అసభ్యత, అశ్లీలం, బాలికలపై నేరాలు, మహిళలను కించపరిచేలా వీడియోలు రూపొందించడం కేంద్ర ఐటీ చట్టం ప్రకారం నేరం. యూట్యూబ్, ఇన్‌స్టా వంటి పెద్ద సామాజిక మాధ్యమ కంపెనీలు ఏఐ వీడియోలకు సంబంధించి ప్రత్యేక నిబంధనలు రూపొందించాయి. ముఖ్యంగా పూర్తిగా కృత్రిమ మేధ, డీప్‌ఫేక్ టెక్నాలజీతో రూపొందించిన వీడియోలకు 'ఇది ఏఐతో రూపొందించినది' అని స్పష్టంగా తెలిసేలా పేర్కొనాలి. అడల్ట్ కామెడీ అయితే.. ఆ వీడియోలపై '18+, పెద్దలకు మాత్రమే' అని పేర్కొనాలి. కానీ చాలా మంది వీటిని పాటించడం లేదు.

హౌసింగ్ బోర్డు అధికారులతో

ఫంక్షన్ హాల్ నిర్వాహకుల గలాటా!

- తోపులాటలో కిందపడిన అధికారి
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి
- 8ఏళ్లలో రూ.1.5 కోట్ల మేర బకాయిలు
- కోర్టు ఉత్తర్వులతో సీజ్ చేసేందుకు వెళ్లిన అధికారులు

కార్వాన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): అది మెహదీపట్నంలోని హౌసింగ్ బోర్డుకు చెందిన కమ్యూనిటీ హాల్! దాన్ని కొందరు లీజుకు తీసుకొని ఎంపీ గార్డెన్ పేరుతో ఫంక్షన్ హాల్‌గా నడపుతున్నారు. హౌసింగ్ బోర్డుకు చెల్లించాల్సిన పన్నులు, ఇతర బకాయిలను వారు ఎనిమిదేళ్లుగా చెల్లించడం లేదు. సుమారు రూ.1.50 కోట్ల మేర బకాయిలు పేరుకుపోయాయి. కోర్టు ఆదేశాలతో ఎంపీ గార్డెన్ ఫంక్షన్ హాల్‌ను సీజ్ చేసేందుకు వెళ్లిన తెలంగాణ హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ అధికారులపై అక్కడి నిర్వాహకులు గొడవకు దిగారు. ఇది తోపులాటకు దారితీయడంతో ఓ అధికారి మృతిచెందారు. ఆసిఫ్‌నగర్ పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. శనివారం ఉదయం హౌసింగ్ బోర్డు అధికారులు, ఎంపీ గార్డెన్ ఫంక్షన్ హాల్‌కు వెళ్లారు. అక్కడ అధికారులతో నిర్వాహకులు వాగ్వాదానికి దిగారు. అధికారులు, నిర్వాహకుల మధ్య తోపులాట జరిగింది. ఈ ఘటనలో హౌసింగ్ బోర్డు కార్పొరేషన్‌కు చెందిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ అధికారి ఆర్. జగదీశ్వర్‌రావు కింద పడ్డారు. తీవ్ర అస్వస్థతకు గురైన ఆయన్ను అధికారులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ జగదీశ్వర్ మృతిచెందారు. కోర్టు ఉత్తర్వులతో ఫంక్షన్‌హాల్‌ను సీజ్ చేసేందుకు వెళ్లిన అధికారులపై దాడికి పాల్పడి, ఓ అధికారి మృతికి కారణమైన నిర్వాహకులపై ఆసిఫ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా సరైన పోలీసు బందోబస్తు లేకపోవడం వల్లే తమపై దాడి జరిగిందని హౌసింగ్ బోర్డు అధికారులు తెలిపారు. తమను ఉద్దేశపూర్వకంగా భయభ్రాంతులకు గురిచేసేందుకు మెహిదీపట్నం ఫంక్షన్ హాల్ యాజమాన్యం దాడికి తెగబడిందని వాపోయారు. కాగా ఉద్రిక్తతల నడుమ ఆ ఫంక్షన్ హాల్‌ను హౌసింగ్ బోర్డు అధికారులు సీజ్ చేశారు. తమ అధికారి మృతికి కారణమైన నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని హౌసింగ్ బోర్డు అధికారులు డిమాండ్ చేశారు.

గోదావరి జలాలను

దూరం చేసే కుట్ర

- చంద్రబాబుకు అతి పెద్ద కోవర్టు రేవంత్
- మా కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు
- పోలీసులకు మెదడుందా? గడ్డి తింటున్నరా?
- బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర సదస్సులో కేటీఆర్ వ్యాఖ్యలు



హైదరాబాద్ సిటీ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గోదావరి జలాలను తెలంగాణకు శాశ్వతంగా దూరం చేసే కుట్ర జరుగుతోందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. 1486 టీఎంసీల నికర జలాల్లో 968 టీఎంసీలు తెలంగాణకు ఇచ్చాక, ఏపీలో ఏ ప్రాజెక్టు కట్టుకున్నా తమకు అభ్యంతరం లేదని తెలిపారు. ఈ మేరకు గోదావరి జలాల విషయంలో కేంద్రం అవార్డు పాస్ చేయాలని డిమాండ్ చేశారు. "మన మెడ మీద కత్తి పెట్టి.. నెల రోజుల గడువు పెట్టి తెలంగాణ జల హక్కులకు పిండం పెట్టే కుట్రను రేవంత్, చంద్రబాబు కలిసి అమలు చేస్తుంటే మౌనంగా ఉందామా? కేంద్రం చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నా ఊరుకుందామా?" అని ప్రశ్నించారు. ఉప్పల్ సమీపంలోని మల్లాపూర్‌లో శనివారం నిర్వహించిన బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర స్థాయి సదస్సులో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్‌పై ముప్పేట దాడి జరుగుతోందని, కేసీఆర్, గులాబీ జెండాను గెలవనీయవద్దనే కుట్రపూరిత ఎజెండా అమలవుతోందని తెలిపారు. తెలంగాణలో పనులన్నీ చంద్రబాబు కోవర్టులు చేస్తున్నారని కాంగ్రెస్‌కు చెందిన ఓ ఎమ్మెల్యేనే చెప్పారని తెలిపారు. చంద్రబాబుకు అతిపెద్ద కోవర్టు రేవంత్‌రెడ్డేనని ఆరోపించారు. తన శిష్యుడు ఏం చెప్పినా వింటాడని చంద్రబాబు అనుకుంటున్నారని, కానీ.. తెలంగాణ ప్రయోజనాలు కాపాడేందుకు కేసీఆర్ ఉన్నారన్న సంగతిని మర్చిపోతున్నారని అన్నారు. ఏ అనుమతి లేకుండా బనకచర్ల కడతాం.. కమీషన్లు పంచుకుంటామంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. అక్రమ కేసుల విషయంలో కార్యకర్తలు భయపడాల్సిన అవసరం లేదని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. "కొందరు పోలీసోళ్లు చేయాల్సిన పని చేస్తలేరు. బీఆర్‌ఎస్ పిల్లలు ఏ పోస్టు పెడ్తున్నరు. వాళ్లపై ఏ కేసులు పెట్టాలని చూస్తున్నరు. గెల్లు శ్రీనివాస్ ఇంటికి వెళ్లి ఆయన భార్య స్వప్న ఫోన్ అడిగారు. అదేంటని అడిగినందుకు ఆమెపై హత్యాయత్నం కేసు పెట్టారు. ఓ పోస్టు రీ ట్వీట్ చేసినందుకు యువకుడిని జైలులో పెట్టారు. మెడకాయ మీద తలకాయ ఉండే పని చేస్తున్నరా? పోలీసులకు మెదడు ఉందా? అన్నం తింటున్నరా? గడ్డి తింటున్నరా?"అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

బాసగూడ అడవుల్లో ఎన్‌కౌంటర్

- నలుగురు మావోయిస్టులు మృతి
- తుపాకులు, విప్లవ సాహత్య పుస్తకాలు స్వాధీనం

చర్ల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా బాసగూడ అడవుల్లో శనివారం భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఘటనలో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. వారి నుంచి ఇన్సాస్, ఎస్ఎల్ఆర్ తుపాకులను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. బీజాపూర్ జిల్లా దక్షిణ బస్తర్ అడవుల్లో మావోయిస్టులు ఉన్నట్లు సమాచారం అందడంతో కేంద్ర బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో బలగాలకు మావోయిస్టులు తారసపడటంతో ఎదురుకాల్పులు జరిగాయి. ఘటనా స్థలం నుంచి రెండు తుపాకులను, మావోయిస్టులు వాడే వస్తువులు, విప్లవ సాహిత్య పుస్తకాలను స్వాధీనం చేసుకున్నట్లు బీజాపూర్ పోలీసులు తెలిపారు. ఎదురుకాల్పులు ఇంకా కొనసాగుతున్నాయని, మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని పోలీసులు చెప్పారు. కాగా, ఈ నెల 28 నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు మావోయిస్టు పార్టీ అమరవీరుల వార్షికోత్సవాలను నిర్వహించబోతోంది. ఈ నేపథ్యంలోనే కేంద్ర బలగాలు కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. ఏ క్షణమైనా అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్లు జరిగే అవకాశం ఉందని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

‘ప్లీజ్.. మమ్మల్ని కాపాడండి’

లారీ చక్రాల కింద ఇరుక్కుపోయిన బీటెక్ విద్యార్థిని ఆర్తనాదాలు

- షాద్‌నగర్‌లో ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన ట్యాంకర్ లారీ
- తండ్రీకూతుళ్ల దుర్మరణం




మశ్చేందర్; మైత్రి (ఫైల్)



లారీ చక్రాల మధ్య ఇరుక్కుపోయిన మైత్రి

షాద్‌నగర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రీ కూతుళ్లు మరణించారు. అయితే, లారీచక్రాల మధ్య ఇరుక్కుపోయిన కూతురు(బీటెక్ విద్యార్థిని) మృత్యువుతో పోరాడుతూ.. ‘ప్లీజ్ మమ్మల్ని కాపాడండి’ అంటూ ఆర్తనాదాలు పెట్టడం అక్కడున్న వారి హృదయాలను కలచివేసింది. షాద్‌నగర్‌కు చెందిన మశ్చేందర్ (48) రియల్ ఎస్టేట్ వ్యాపారి కాగా ఆయన ఏకైక కుమార్తె మైత్రి(23) శంషాబాద్‌లోని వర్ధమాన్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతోంది. ఎప్పట్లాగే శనివారం ఉదయం కుమార్తెను బస్టాండ్‌లో దింపేందుకు మశ్చేందర్ ద్విచక్రవాహనంపై బయలుదేరగా.. షాద్‌నగర్ కూడలిలో ఆయిల్ ట్యాంకర్ లారీ ఢీ కొట్టింది. మశ్చేందర్ అక్కడికక్కడే మరణించగా.. తీవ్రంగా గాయపడిన మైత్రి లారీ వెనుక చక్రాల మధ్య ఇరుక్కుపోయింది. కొన ఊపిరితో ఉన్న మైత్రి.. ‘మమ్మల్ని కాపాడండి.. మా కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వండి’ అని అక్కడున్న వారిని వేడుకుంది. ఓ బుక్‌స్టాల్ యజమాని మైత్రి ఫోన్ తీసుకుని ఆమె కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చే యత్నంలో ఉండగా.. మైత్రి స్నేహితురాలి నుంచి ఫోన్ వచ్చింది. బుక్‌స్టాల్ యజమాని.. ఆమెకు పరిస్థితిని వివరించగా.. ఆమె మైత్రి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చింది. వారు ఘటనాస్థలికి చేరే లోపే మైత్రి కూడా ప్రాణాలు కోల్పోయింది. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా, తండ్రీకూతుళ్ల మృతిపై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, విచారం వ్యక్తం చేశారు.

తాజా మాజీ సర్పంచ్ లావణ్యకు ఇందిరమ్మ ఇల్లు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అక్కన్నపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం మైసమ్మవాగుతండా మాజీ సర్పంచ్ సందేబోయిన లావణ్య కష్టాన్ని ప్రభుత్వం గుర్తించింది. అప్పులు చేసి గ్రామంలో అభివృద్ధి పనులు నిర్వహించి బిల్లులు రాక ఉన్నదంతా కోల్పోయి మూతబడిన ప్రభుత్వ పాఠశాల భవనంలో ఆశ్రయం పొందుతున్న ఆమెకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం తెలిపారు. లావణ్య దీనస్థితిపై ‘నిలువ నీడ లేక సర్కారు బడిలోనే ఆశ్రయం’ శీర్షికతో ‘ఆంధ్రజ్యోతి’లో శనివారం ప్రచురితమైన కథనానికి మంత్రి స్పందించారు. మంత్రి ఆదేశాలతో అధికారులు లావణ్య వివరాలు తీసుకొని ఇందిరమ్మ ఇల్లు కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడం పట్ల లావణ్య ‘ఆంధ్రజ్యోతి’కి కృతజ్ఞతలు తెలిపారు.

నిండుకుండలా సాగర్

(మొదటి పేజీ తరువాయి)

ప్రాజెక్టుకు వరద మొదలైంది. 2007లో జూలైలో ప్రాజెక్టు గేట్లను ఎత్తగా 18 ఏళ్ల తర్వాత ఇప్పుడు మళ్లీ జూలైలో నీటిని దిగువకు వదలనున్నారు. సాగర్ నుంచి మొత్తం 36,033 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా, ఎగువ నుంచి 1,20,339 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది. శ్రీశైలంలోకి 1.02 లక్షల క్యూసెక్కుల నీరు వస్తోంది. 1.52 లక్షల క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. మరోవైపు.. ఎగువన మహారాష్ట్రలో వర్షాలు తగ్గడంతో కాళేశ్వరం వద్ద గోదావరి ఉధృతి తగ్గింది. అక్కడ 7.6 అడుగుల ఎత్తులో నది ప్రవహిస్తోంది. మేడిగడ్డ బ్యారేజీలోకి 3.41 లక్షల క్యూసెక్కుల వరద వస్తోంది. వచ్చిన నీటిని వచ్చినట్లుగానే దిగువకు వదిలేస్తున్నారు. భద్రాచలం వద్ద గోదావరి 32.5 అడుగుల ఎత్తులో ప్రవహిస్తోంది. శనివారం రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల వర్షాలు పడ్డాయి. కామారెడ్డి జిల్లా గాంధారిలో 6.6 సెం.మీ వర్షపాతం నమోదైంది. నిజామాబాద్ జిల్లా కోటగిరిలో 6.4, కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో 6.1, ఖమ్మం జిల్లా సింగరేణిలో 4.6, వికారాబాద్ జిల్లా దోమలో 4.5, నారాయణపేట జిల్లా మక్తల్‌లో 4.1, యాదాద్రి జిల్లా మోత్కూరులో 3.8, సిరిసిల్ల జిల్లా గంభీర్‌రావుపేటలో 3.8, ములుగు జిల్లా గోవిందరావుపేటలో 3.6, నాగర్‌కర్నూల్ జిల్లా లింగాలలో 3.6, నిర్మల్ జిల్లా ముథోల్‌లో 3.3 సెం.మీ వర్షపాతం నమోదైంది. మహబూబ్‌నగర్ జిల్లా తెలకపల్లి మండలం గౌరారానికి చెందిన జంగయ్య (60) వంగూరు మండలం రామగిరి-రఘుపతిపేట మధ్య దుందుభి నది వంతెన వద్ద నడుచుకుంటూ కాలుజారి ప్రవాహంలో కొట్టుకుపోయి మృతి చెందాడు. జగిత్యాలలో 20వ వార్డులో గుండేటి విజయ అనే మహిళకు చెందిన ఇల్లు కూలిపోయింది. పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం మల్యాలలో వరినాట్లకు వెళ్లిన కూలీలు నక్కల ఒర్రెనీటి ప్రవాహంలో చిక్కుకుపోయారు. గ్రామస్థులు తాడు సాయంతో వారిని ఒడ్డుకు చేర్చారు. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలం కోనాపూర్ శివారులో రాళ్లవాగు చెక్‌డ్యామ్ నీటి మట్టాన్ని పరిశీలించడానికి వెళ్లి.. ఏఈఈ నితిన్ గుండెపోటుతో కుప్పకూలి మృతి చెందారు. మెదక్ జిల్లా చిన్న శంకరంపేట మండలంలోని రుద్రారం, గవ్వపల్లి తండాలో ఇళ్లు దెబ్బతిన్నాయి. కామారెడ్డి జిల్లా గాంధారి మండలం నాగ్లూర్ శివారులో కాటేవాడి తండా రైతులు 30 మంది వరినాట్లు వేసేందుకు వెళ్లి తిరుగు ప్రయాణంలో వాగులో చిక్కుకుపోయారు. ఒకరినొకరు పట్టుకొని గుంపులు గుంపులుగా వాగు దాటారు. కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం అమర్లబండ వాగులో కొందరు విద్యార్థులు చిక్కుకుపోగా.. వారిని కేజీవీల్ ట్రాక్టర్‌లో సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు.



పెద్దపల్లి జిల్లా మల్యాలలో వాగులో చిక్కుకున్న మహిళా కూలీలను తాడు సాయంతో దాటిస్తున్న గ్రామస్థులు

తేలికపాటి జల్లులు

రాష్ట్రంలో భారీ వర్షాలకు బ్రేక్ పడినట్లేనని.. ఆదివారం నుంచి తేలికపాటి వానలు పడతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడా కురిసే అవకాశం ఉందని పేర్కొంది. సోమవారం కూడా రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంటుందని వెల్లడించింది. ఆదివారం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు ఈదురుగాలులతో కూడిన వర్షాలు అక్కడక్కడా కురిసే అవకాశం ఉందని తెలిపింది.

హక్కుల సంరక్షకులు న్యాయవాదులు

- ఎల్లప్పుడూ న్యాయం పక్షానే ఉండాలి: శ్రీధర్ బాబు



హైదరాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదులు కేవలం కోర్టు అధికారులు మాత్రమే కాదని, రాజ్యాంగం దేశ ప్రజలకు ప్రసాదించిన హక్కులకు సంరక్షులు అని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కొనియాడారు. ప్రపంచ యవనికపై తెలంగాణ బ్రాండ్‌ను విశ్వవ్యాప్తం చేస్తున్న హైదరాబాద్ ‘ఎమర్జింగ్ లీగల్ టెక్ హబ్’గా మారుతోందని అన్నారు. నోవాటెల్ హెచ్ఐసీసీలో లెక్స్ విట్‌నెస్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ‘ది గ్రాండ్ మాస్టర్ 2025’ హైదరాబాద్ ఎడిషన్ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. ‘ఒక న్యాయవాదిగానే నా ప్రస్థానం మొదలయ్యింది. ఆ తర్వాత అనుకోని పరిస్థితుల్లో రాజకీయాల్లోకి వచ్చాను. అప్పటికీ.. ఇప్పటికీ న్యాయ వ్యవస్థలో అనేక మార్పులొచ్చాయి. ముఖ్యంగా సాంకేతికత వినియోగం గణనీయంగా పెరిగింది. ఏఐ ఆధారిత న్యాయ పరిశోధన, వర్చువల్ కోర్టు రూమ్‌లు, రియల్ టైమ్ కేసు ట్రాకింగ్, ఈ-ఫైలింగ్ లాంటివి అందుబాటులోకొచ్చాయి. న్యాయవాద వృత్తిని కేవలం జీవనోపాధిగా మాత్రమే చూడొద్దు. సమాజం పట్ల ఒక బాధ్యతగా భావించాలి. రాజ్యాంగ పీఠిక ప్రకారం సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అందరికీ అందించేందుకు కృషి చేయాలి. ఎల్లప్పుడూ న్యాయం పక్షానే ఉండాలి’ అని ఆయన యువ న్యాయవాదులకు సూచించారు. కార్యక్రమంలో లెక్స్ విట్‌నెస్ ప్రతినిధులు అభిజిత్, శ్రీనివాస్, పలు కంపెనీల లీగల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పోలీసు శాఖలో కానిస్టేబుల్, సబ్‌ఇన్‌స్పెక్టర్ పోస్టులకు వయో పరిమితి పెంచాలని కోరుతూ నిరుద్యోగ జేఏసీ ప్రతినిధులు టీపీసీసీ ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్సీ డాక్టర్ బల్మూరి వెంకట్‌కు వినతిపత్రం సమర్పించారు. 15 వేల పైగా పోస్టులను భర్తీ చేస్తున్నందున.. వయో పరిమితి దాటిపోయిన వారికి అవకాశం కల్పించేందుకు వయో పరిమితి పెంచాలని కోరారు.

చతుర్విధ జల విధానంతో వివాదాలు పరిష్కారం

- ఈ విధానాన్ని తెలుగు రాష్ట్రాలు అనుసరించాలి
- కొడంగల్, బనచర్ల ప్రాజెక్టులపై తెలంగాణ, ఏపీ సీఎంలకు లేఖలు రాస్తా: మర్రి శశిధర్ రెడ్డి

బర్కత్‌పుర, జూలై 26 (ఆంధ్రజ్యోతి): నీటిపారుదల శాఖ విశ్రాంత చీఫ్ ఇంజనీర్ హనుమంతరావు రూపొందించిన చతుర్విధ జల విధానాన్ని అనుసరిస్తే జల వివాదాలు పరిష్కారం అవుతాయని మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి పేర్కొన్నారు. అతి తక్కువ ఖర్చుతో ప్రాజెక్టులు నిర్మించి ఏడాదికి మూడు పంటలకు సాగునీరు అందించవచ్చన్నారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ‘నదీ జలాల వివాదాలు-వాస్తవాలు’ అంశంపై ‘మీట్ ది ప్రెస్’లో శశిధర్‌రెడ్డి మాట్లాడారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏడాదికి ఒక పంటకు మాత్రమే నీరందించేలా, నికర జలాలు లేకుండా రూ.7 వేల కోట్లతో నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం నిర్మిస్తోందని, 3 వేల ఎకరాల భూ సేకరణ చేపడుతోందన్నారు. చతుర్విధ జల విధానంతో భూ సేకరణ అవసరం లేకుండా ఏడాదికి మూడు పంటలకు నీరందించేలా కేవలం రూ.150 కోట్లతో ఈ పథకం నిర్మించవచ్చని చెప్పారు. నాలుగేళ్లకు బదులు రెండేళ్లలోనే పూర్తి చేయవచ్చన్నారు. ఎకరానికి రూ.7 లక్షలు ఖర్చవుతుందని, అదే చతుర్విధ జల విధానంలో ఎకరానికి కేవలం రూ.15 వేలు సరిపోతుందన్నారు. దీనిపై సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాయనున్నట్లు తెలిపారు. ఏపీ ప్రభుత్వం చేపడుతున్న బనకచర్ల ప్రాజెక్టు వల్ల తెలంగాణ ఇబ్బందులు ఎదుర్కొంటుందన్నారు. ఈ ప్రాజెక్టుకు రూ.81,900 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసిందని, దీన్ని కూడా తగ్గించవచ్చని చెప్పారు. 30 లక్షల ఎకరాలకు నీరు అందించడానికి ఎకరానికి రూ.లక్ష ఖర్చుతో ఈ ప్రాజెక్టు నిర్మిస్తున్నారని, చతుర్విధ జల విధానంలో ఎకరానికి కేవలం రూ.4 వేలతో నిర్మించవచ్చన్నారు. దీనిపై ఏపీ సీఎం చంద్రబాబుకు లేఖ రాస్తానన్నారు. చతుర్విధ జల విధానాన్ని అనుసరించి రాజస్థాన్ రాష్ట్రం మంచి ఫలితాలు సాధించిందని, చుక్క వర్షపు నీరు కూడా వృథా కాకుండా రైతులు పంటలు పండించుకుంటున్నారని తెలిపారు. ఈ విధానాన్ని రెండు తెలుగు రాష్ట్రాలు అనుసరిస్తే రైతులకు మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు విరాహత్ అలీ, రాంనారాయణ తదితరులు పాల్గొన్నారు.



జీఐ-ఫోకస్ వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ జీఎస్ రావు

ఏటా 60 వేల ఉదర క్యాన్సర్ కేసులు

- యశోద ఆస్పత్రుల ఎండీ డాక్టర్ జీఎస్ రావు
- హైటెక్ సిటీలో ‘జీఐ-ఫోకస్’ వర్క్‌షాప్ షురూ


హైదరాబాద్ సిటీ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా ఉదర క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయని, మన దేశంలో ఏటా 60 వేల కొత్త కేసులు వస్తున్నాయని యశోద ఆస్పత్రుల ఎండీ డాక్టర్ జీఎస్ రావు తెలిపారు. హైటెక్ సిటీలోని యశోద ఆస్పత్రిలో ‘జీఐ-ఫోకస్’ పేరుతో రెండు రోజుల నేషనల్ కాన్ఫరెన్స్ లైవ్ వర్క్‌షాప్‌ను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎస్ రావు మాట్లాడారు. సీనియర్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు, రోబోటిక్ సర్జన్ డాక్టర్ విజయకుమార్ మాట్లాడుతూ.. ఈ సదస్సులో అధునాతన జీర్ణ, ఉదరకోశ శస్త్ర చికిత్సలపై నిపుణుల నేతృత్వంలో నిర్వహించే లైవ్ సెషన్లు యువ సర్జన్లకు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు.

త్వరలో జిల్లాల్లో న్యాయ సేవల క్లినిక్‌లు

- హైకోర్టు జడ్జి జస్టిస్ పి.శ్యామ్ కోషీ
- సోమాజిగూడలో న్యాయ సేవల క్లినిక్ ప్రారంభం

హైదరాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రక్షణ శాఖ, పారా మిలిటరీ సిబ్బంది, మాజీ సైనికులు, వారి కుటుంబసభ్యుల కోసం ఏర్పాటు చేస్తున్న ‘న్యాయ సేవల క్లినిక్’లను త్వరలో జిల్లాలకు విస్తరించనున్నట్టు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.శ్యామ్ కోషీ తెలిపారు. ‘నల్సా వీర్ పరివార్ సహాయతా యోజన-2025’ కింద జాతీయ న్యాయ సేవల సంస్థ(నల్సా) దేశవ్యాప్తంగా రాష్ట్ర, జిల్లా సైనిక్ వెల్ఫేర్ బోర్డులలో లీగల్ సర్వీసెస్ క్లినిక్‌లను ఏర్పాటు చేస్తోంది. ఇందులో భాగంగానే శనివారం తెలంగాణతోపాటు దేశంలోని ఇతర రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో నల్సా వీర్ పరివార్ సహాయతా యోజనను సుప్రీం కోర్టు జడ్జి, నల్సా ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ సూర్యకాంత్ వర్చువల్‌గా ప్రారంభించారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ మార్గదర్శకత్వంలో సోమాజిగూడలోని సైనిక సంక్షేమ కార్యాలయంలో న్యాయ సేవల క్లినిక్‌ను జస్టిస్ పి.శ్యామ్ కోషీ ప్రారంభించారు. ఇలాంటి క్లినిక్‌లను రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.

అప్పుల బాధతో ఇద్దరు రైతుల ఆత్మహత్య

రాములు; సంపత్‌రెడ్డి (ఫైల్)

ఖానాపూర్/మానకొండూర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): అప్పులు తెచ్చి పంటలు సాగు చేయగా.. సరైన దిగుబడి రాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఇద్దరు రైతులు శనివారం బలవన్మరణానికి పాల్పడ్డారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం సుర్జాపూర్ గ్రామానికి చెందిన సంఘ రాములు(65) పంట దిగుబడి రాక, చేసిన అప్పులు రూ. 20 లక్షల వరకు చేరుకోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. పొలంలోనే మంచె గుంజకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అలాగే కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం కొండపల్కల గ్రామానికి చెందిన కరివేద సంపత్‌రెడ్డి(49) రెండున్నర ఎకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటున్నాడు. ఇటీవల కూతురు వివాహానికి రూ. 6 లక్షల వరకు అప్పు చేశాడు. చేసిన అప్పు ఎలా తీర్చాలో తెలియక ఇంట్లోని రేకుల షెడ్డుకు టవల్‌తో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

పార్టీ గీత దాటితే చర్యలు తప్పవు

బీజేపీ.. క్రమశిక్షణకు మారుపేరు.. రేవంత్ రెడ్డీ సొంత జిల్లాకు ఏం చేశావు?

- బీసీల 42% రిజర్వేషన్ల పేరుతో మైనారిటీలకు మేలు చేసే కుట్రలు
- కేంద్రం అదనంగా ఇచ్చిన యూరియా ఏది?
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం/నారాయణపేట/కొత్తూర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ క్రమశిక్షణకు మారుపేరని, ఎంత పెద్ద నేతలైనా సరే గీత దాటితే చర్యలు తప్పవని, ఆ విషయంలో పార్టీనే సుప్రీం అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. శనివారం మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లా కేంద్రాల్లో పర్యటించిన ఆయన పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉమ్మడి పాలమూరులోని ఐదు జిల్లా పరిషత్‌లు గెలుచుకోవాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. పార్టీ బీ ఫాం ఇచ్చిన వారిని కష్టపడి గెలిపించుకోవాలని, విభేదాలు తెచ్చి ఇతరుల గెలుపునకు అవకాశం ఇస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి మాటిమాటికీ ఢిల్లీకి వెళ్లడం కాదని, సొంత జిల్లాకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. 2028లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. బీసీలకు 42% రిజర్వేషన్ల పేరుతో 10% మైనారిటీలకు కట్టబెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ప్రధాని మోదీని కన్వర్టెడ్ బీసీ అంటున్న సీఎం రేవంత్‌రెడ్డి తమ నాయకుడు రాహుల్‌గాంధీది ఏ కులమో చెప్పాలని ప్రశ్నించారు. మతాలు మారతారు కానీ కులాలు ఎవరూ మారరని ఈ విషయాన్ని సీఎం గుర్తుంచుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 9 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అడిగితే కేంద్ర ప్రభుత్వం 12 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఇచ్చిందని, అదనంగా ఇచ్చిన మూడు లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఎక్కడికి వెళ్లిందని ప్రశ్నించారు. ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ.. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పాత డిజైన్ ప్రకారం జూరాల నుంచి చేపట్టాలని, లేకపోతే ఉద్యమం చేస్తానని హెచ్చరించారు. గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లను కాంగ్రెస్ కార్యకర్తలకు కేటాయిస్తున్నారని, పేదలకు ఇళ్లు దక్కకపోతే కార్యకర్తలు ధర్నాలు చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో ఎవరికి టికెట్లు దక్కినా గెలిపించాల్సిన బాధ్యత కార్యకర్తలదేనని ఆమె అన్నారు.



తిమ్మాపూర్‌లో ఘనస్వాగతం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షునిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత రాంచందర్ రావు మొట్టమొదటి సారిగా శనివారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా కొత్తూర్ మునిసిపాలిటీలోని తిమ్మాపూర్ వద్ద ఆయనకు స్థానిక నాయకులు ఘనస్వాగతం పలికారు. రాంచందర్‌రావుతో పాటు.. ఎంపీ డీకే అరుణను గజమాలతో సత్కరించారు. అనంతరం ఆయన స్థానిక వేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



మందకృష్ణను సత్కరిస్తున్న కిషన్‌రెడ్డి, రాజేందర్, మాధవరం కాంతారావు

మందకృష్ణ పోరాటంతోనే వర్గీకరణ

- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి.. బోయినపల్లిలో మందకృష్ణకు సత్కారం

బోయినపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభివృద్ధికి మందకృష్ణ మాదిగ ఎనలేని కృషి చేశారని, ఆయన అలుపెరుగని పోరాటంతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. మిత్రమండలి నాయకుడు మాధవరం కాంతారావు ఆధ్వర్యంలో మందకృష్ణ మాదిగ పద్మశ్రీ అవార్డు అందుకున్న సందర్భంగా బోయినపల్లిలో శనివారం అలయ్‌బలయ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కిషన్ రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్, కంటోన్మెంట్ బోర్డు సివిలియన్ నామినేటెడ్ సభ్యురాలు నర్మద మల్లికార్జున్ పాల్గొని మందకృష్ణను గజమాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. మందకృష్ణ స్ఫూర్తిగా కర్ణాటక, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, తమిళనాడు తదితర అనేక ప్రాంతాలకు వర్గీకరణ ఉద్యమం విస్తరించిందన్నారు. కంటోన్మెంట్ బీజేపీ నాయకులు, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, బీజేపీ కార్యకర్తలతో పాటు మందకృష్ణ అభిమానులు, వివిధ పార్టీల కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కరీంనగర్‌లో రాజకీయాలు చేయను

- పొన్నంతో కలిసి అభివృద్ధికి కృషి చేస్తా
- కేంద్ర మంత్రి సంజయ్

హుస్నాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో రాజకీయాలు చేయబోనని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. రాజకీయాలకు అతీతంగా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. శనివారం ఆయన సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో మోదీ గిఫ్ట్ పేరిట నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా సైకిళ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ ప్లాస్టిక్ నిర్మూలనకు మంత్రి పొన్నం నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో స్టీల్ బ్యాంకులు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. తాను కూడా పేదరికంలో పుట్టానని, శిశుమందిర్‌లో చదువుకుంటున్నప్పుడు సైకిల్ కొనే స్థోమత లేక కిరాయికి తీసుకునేవాడినని గుర్తుచేసుకున్నారు. విద్యార్థులు గల్లా ఎగురేసుకునేలా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తానని చెప్పారు. అతి త్వరలో నర్సరీ నుంచి 6వ తరగతి వరకు చదివే విద్యార్థులకు మోదీ కిట్లు ఇవ్వబోతున్నామని తెలిపారు. గత యూపీఏ ప్రభుత్వం విద్యారంగానికి 2014-15 బడ్జెట్‌లో రూ.68,728 కోట్లు కేటాయిస్తే.. గడచిన 11 ఏళ్లలో మోదీ ప్రభుత్వం రూ.8 లక్షల కోట్లు కేటాయించిందని చెప్పారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు

▪ఆర్కే RK

నిజాయితీగా చెప్పుకోవాలంటే, జగన్‌రెడ్డి మినహా మరే ఇతర ముఖ్యమంత్రి కూడా మద్యం, ఇసుక నుంచి డబ్బు పిండుకొనే ప్రయత్నం చేయలేదు. అలాంటి అవకాశం ఉందన్న ఆలోచన కూడా వారెవరికీ రాలేదు. 2024 ఎన్నికల్లో జగన్ ఘోరంగా ఓడిపోవడానికి నాసిరకం మద్యం సరఫరా కూడా ఒక కారణం కాదా? ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడినందుకే దేవుడు 2019లో రాసిన స్క్రిప్ట్‌ను తిరగరాశాడు. బ్రేక్ ఫాస్ట్ నుంచి రాత్రి డిన్నర్ వరకు డబ్బును మాత్రమే నంజుకు తినాలని చూసే వారిని దేవుడు మాత్రం ఉపేక్షిస్తాడా? ఫలితాన్ని ఇప్పుడు అనుభవిస్తున్నారు. జరిగిన తంతును పరిశీలించిన ఎవరైనా జగన్ అండ్ కోకు పాపభీతి ఉందని, దైవభక్తికి కొదవ లేదని చెప్పగలరా? నాసిరకం మద్యం తాగి ప్రాణాలు కోల్పోయిన వారు, ఒళ్లు గుల్ల చేసుకున్న వారి శాపనార్థాలను కొట్టిపారేయలేం. ఎవరైనా పాప పరిహారం చెల్లించుకోవాల్సిందే! అది ఎప్పుడు అన్నదే ప్రశ్న?

మీ చేతుల్లోనే ఉంది మిలార్డ్స్!

ఇంతకూ ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆస్తికుడా? నాస్తికుడా? మాటకు ముందూ వెనుకా ఆ దేవుడు కరుణిస్తే అని ఆయన అంటూ ఉంటారు. 2019 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ 23 సీట్లకే పరిమితమై, తనకు 151 సీట్లు వచ్చినప్పుడు 'ఆ దేవుడి స్క్రిప్ట్ ఎంత గొప్పగా ఉందో' అని పొంగిపోయారు. 2024 ఎన్నికల్లో తన పార్టీ 11 సీట్లకే పరిమితమైనప్పుడు మాత్రం దేవుణ్ని తలుచుకోలేదు. అన్నిటికీ దేవుడు ఉన్నాడని ఆయన చెబుతుంటారు. దీన్నిబట్టి ఆయనకు దైవభక్తి ఎక్కువ అని ఎవరైనా నమ్మాల్సిందే. పదహారణాల క్రైస్తవుడిగా ప్రతి రోజూ ఆయన ప్రేయర్లు చేస్తుంటారు. తనకు ఆ ప్రభువే అండగా ఉన్నాడని నమ్మకంగా చెబుతుంటారు. క్రైస్తవ మతాన్ని మనసా వాచా కర్మణా ఆచరించేవారు బైబిల్ సూక్తులను ఆచరించాలి. దైవ భక్తి ఉన్నవారికి సహజంగానే పాపభీతి ఉంటుంది. అన్నట్టు ఆ మధ్య ఎవరో తమ బిడ్డకు పేరు పెట్టమని కోరగా 'దేవుడు' అని జగన్‌రెడ్డి నామకరణం చేశారు. ఆడపిల్లకు దేవుడు అనే పేరు ఎలా నప్పుతుందో తెలియదు. మొత్తానికి ఆయనను ఆస్తికుడిగానే పరిగణించాలి. అయితే ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గానీ, ఆ తర్వాత అధికారం కోల్పోయినప్పుడు గానీ ఆయన చేష్టలను పరిశీలిస్తే జగన్‌రెడ్డిలో ఏ కోశానా పాపభీతి లేదని స్పష్టమవుతుంది. దేవుడి కంటే డబ్బే తనకు ముఖ్యమని అధికారంలో ఉన్నప్పుడు ఆయన తీసుకున్న నిర్ణయాలను బట్టి ఎవరైనా భావించడంలో తప్పు లేదు. జగన్ హయాంలో అమలు చేసిన మద్యం విధానమే ఇందుకు నిదర్శనం. మద్యం వ్యవహారంలో భారీ కుంభకోణం జరిగిందని కూటమి ప్రభుత్వం ఎప్పటి నుంచో చెబుతోంది. దీనిపై ఏర్పాటు చేసిన సిట్ విచారణలో దిగ్భ్రాంతికర విషయాలు వెలుగు చూస్తున్నాయి. అయితే అవన్నీ భేతాళ కథలుగా జగన్ అండ్ కో కొట్టిపడేస్తున్నారు. మద్యం వ్యవహారంలో సిట్ అధికారులు చెబుతున్నట్టుగా 3,600 కోట్ల రూపాయల అవినీతి జరిగిందా? లేదా? అన్నది న్యాయ సమీక్షలోనే తేలుతుంది. అయితే ధన దాహంతో జగన్‌రెడ్డి ప్రవేశపెట్టిన మద్యం విధానమే అసలు సమస్య. ఉమ్మడి రాష్ట్రంలో గానీ, రాష్ట్రం విడిపోయిన తర్వాత గానీ నాణ్యమైన మద్యాన్ని మాత్రమే ఆయా ప్రభుత్వాలు సరఫరా చేసేవి. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా పేరున్న బ్రాండ్లనే కొనుగోలు చేయించారు. జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత మాత్రమే విషతుల్యమైన నాసిరకం మద్యాన్ని మార్కెట్‌లోకి ప్రవేశపెట్టారు. ఈ మద్యం తాగడం వల్ల పలువురు మరణించగా, ఎన్నో వేల మందికి కిడ్నీలు పాడైపోయాయి. ఇప్పుడు వారంతా జీవచ్ఛవాలుగా బతుకుతున్నారు. కమీషన్ల కక్కుర్తితో ఇంతటి మహా పాతకానికి ఒడిగట్టిన జగన్‌రెడ్డిలో దైవభక్తి ఉంది, పాపభీతి ఉంది అని ఎలా నమ్మడం? పాపభీతి ఉన్నవారు ఎవరూ ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి కాసుల కోసం కక్కుర్తి పడరు. నిజానికి మద్యం వ్యాపారం చేసిన వారెవరూ బాగుపడలేదు. మందు బాబుల ఇళ్లలోని ఆడవాళ్ల శాపనార్థాలు తగిలి వారి కుటుంబాలు చితికిపోయాయి. విజయ్ మాల్యా వంటి వారికి ఎలాంటి దుస్థితి దాపురించిందో చూస్తున్నాం. అలాంటిది నాసిరకం మద్యం సరఫరా చేసిన వారికి మహిళల ఉసురు తగలకుండా ఉంటుందా? నిజంగా దైవభక్తి ఉన్నవాళ్లు ఇలాంటి నీచానికి ఒడిగట్టరు. ప్రభుత్వం చెబుతున్న లిక్కర్ కుంభకోణం అంతా బోగస్ అని, గత ప్రభుత్వంలో లిక్కర్ అమ్మకాలు తగ్గి ప్రభుత్వ ఆదాయం పెరిగిందని, అలాంటప్పుడు అవినీతికి ఆస్కారం ఎక్కడ ఉంటుందని జగన్ అండ్ కో ప్రశ్నిస్తున్నారు. అయితే అలా ఎలా జరిగిందో మాత్రం వారు వివరించడం లేదు. గత ప్రభుత్వాలు నాణ్యమైన మద్యం సరఫరా చేయడం వల్ల అమ్మకాలు అధికంగా కనిపించినా లాభాలు అందుకు తగ్గట్టుగా ఉండేవి కావు. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత నాసిరకం మద్యాన్ని అధిక మార్జిన్‌తో అమ్మేవారు. దీంతో అమ్మకాలు తగ్గినట్టుగా, ప్రభుత్వ ఆదాయం పెరిగినట్టుగా కనిపించేది. ఈ లాజిక్‌ను కనిపెట్టే జగన్ అండ్ కో తమకు అనుకూలమైన పాయింట్లతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం అమ్మకాలు పెరిగాయన్నది వాస్తవం. అయితే ఇందుకు ప్రజలు విపరీతంగా తాగేయడమో, మరొకటో కారణం కాదు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి రాగానే మార్కెట్‌లోకి నాణ్యమైన బ్రాండ్స్‌ను ప్రవేశపెట్టింది. దీనివల్ల ఆదాయం సహజంగానే పెరుగుతుంది. ఎందుకంటే వాటి ధర ఎక్కువగా ఉంటుంది. జగన్ జమానాలో కమ్మని బీరు కూడా ఆంధ్రప్రదేశ్‌లో లభ్యం కావడం లేదని ఎంతో మంది వ్యాఖ్యానించడం తెలిసిందే. పది రూపాయల విలువ కూడా చేయని క్వార్టర్ బాటిల్‌ను జగన్ హయాంలో వంద రూపాయలకు అమ్మారని చెబుతారు. ఆయన అధికారంలోకి వచ్చిన రెండు మూడు నెలల్లోనే అంతకుముందు నుంచి ఉన్న డిస్టిలరీలను ఇప్పుడు లిక్కర్ కుంభకోణంలో అరెస్టయి జైల్లో ఉన్న కొందరు హస్తగతం చేసుకున్నారు. సదరు డిస్టిలరీలలో నాసిరకం మద్యం తయారుచేసి ప్రభుత్వానికి సరఫరా చేశారు. ఈ క్రమంలో జగన్ అండ్ కో నిర్ణయించిన మొత్తాన్ని ఆయన సూచించిన వారికి ముట్టజెప్పేవారు. ఉదాహరణకు, తిలక్‌నగర్ ఇండస్ట్రీస్ అనే కంపెనీ మద్యం వ్యాపారంలో రెండు మూడు తరాలుగా ఉంది. అన్ని రాష్ట్రాలు ఆ కంపెనీ నుంచి అంతో ఇంతో మద్యం కొనుగోలు చేసేవి. అలాంటి కంపెనీ నుంచి మద్యం కొనుగోలు చేయడానికి జగన్ ప్రభుత్వం నిరాకరించింది. దీంతో విధిలేని పరిస్థితుల్లో జగన్‌రెడ్డి విధించిన షరతులకు తిలక్‌నగర్ ఇండస్ట్రీస్ తలవొంచక తప్పలేదు. అంగీకరించిన విధంగా చెల్లించాల్సిన ముడుపులను పది గ్రాముల బంగారు నాణేల రూపంలో కావాలని కోరడం వల్లనే ఆ కంపెనీ వాళ్లు పద్మావతి జ్యూవెలరీస్ నుంచి 200 కోట్ల రూపాయల విలువైన బంగారం కొనుగోలు చేసి అప్పగించారు. ఇలా బంగారం కొనుగోలు చేసిన ఉదంతాలు ఆ కంపెనీ చరిత్రలో లేవు. జగన్‌రెడ్డిని సమర్థిస్తున్న వాళ్లు ఇందుకు ఏం సమాధానం చెబుతారు?

తమ్ముడు తమ్ముడే...

లిక్కర్ కుంభకోణం.. అమలు కోసం ఒక వెబ్ అంటే సాలెగూడు తరహా నెట్‌వర్క్‌ను సృష్టించారు. ఫలితంగానే ఈ వ్యవహారంలో పలువురి పేర్లు బయటికొస్తున్నాయి. లిక్కర్‌ను సొంతానికి ప్రధాన ఆదాయ వనరుగా మార్చిన ఘనత కూడా జగన్‌రెడ్డికే దక్కుతుంది. ఉమ్మడి రాష్ట్రంలో గానీ, రాష్ట్రం విడిపోయిన తర్వాత గానీ ముఖ్యమంత్రులుగా పనిచేసిన వారెవరూ లిక్కర్‌ను తమ పార్టీల ప్రధాన ఆర్థిక వనరుగా భావించలేదు. మద్యం తయారీ కంపెనీలు ఎన్నికల సమయంలో ఆయా రాజకీయ పార్టీలకు విరాళాలు ఇచ్చేవి. అంతకు మించి మద్యం కొనుగోళ్లలో ప్రభుత్వ పెద్దల జోక్యం ఉండేది కాదు. డిమాండ్‌ను బట్టి ఏ బ్రాండ్‌ను ఎంత మొత్తంలో కొనుగోలు చేయాలో అధికారుల స్థాయిలో నిర్ణయించేవారు. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత లిక్కర్ వ్యాపారాన్ని బంగారు గుడ్లు పెట్టే బాతుగా మార్చారు. నెలకు 50 నుంచి 60 కోట్ల వరకు పార్టీ ఖాతాకు సమర్పించవలసిందే అని షరతు పెట్టారు. తమకు అందే ముడుపులను బట్టి ఏ కంపెనీ నుంచి ఎంత మొత్తం కొనుగోలు చేయాలో పై స్థాయిలో నిర్ణయించేవారు. అధికారులు నిమిత్త మాత్రులు. 'ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా' అన్నట్టుగా అధికారులు తమ వాటాలు రాబట్టుకునేవారు. నిజానికి జగన్ అండ్ కో లక్ష్యంగా పెట్టుకున్న మొత్తాన్ని ఇవ్వడానికి పేరున్న బ్రాండ్లకు చెందిన కంపెనీలు అంగీకరించలేదు. ఆ కారణంగానే నాసిరకం మద్యం సరఫరా చేశారు. నిర్దేశించుకున్న మొత్తాలను కాజేశారు. ఉదాహరణకు మద్యం వ్యాపారంలో దశాబ్దాలుగా ఉన్న ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి అప్పుడు వైసీపీలోనే ఉన్నారు. తమ్ముడు తమ్ముడే పేకాట పేకాటే అన్నట్టుగా ఆయనకు కూడా జగన్ అండ్ కో టార్గెట్ విధించింది. అయితే అంత మొత్తం ఇవ్వడం సాధ్యం కాదని మాగుంట తేల్చిచెప్పడంతో ఆయన సరఫరా చేసే మెక్‌డొనాల్డ్ మద్యం కొనుగోళ్లను నిలిపివేశారు. దాని స్థానంలో చెత్త బ్రాండ్లు మార్కెట్లోకి వచ్చాయి. ఈ విషయంలో ఎవరికైనా అనుమానాలు ఉంటే మాగుంట శ్రీనివాసులురెడ్డిని అడిగి తెలుసుకోవచ్చు. ఇసుక, మద్యం ద్వారా నెలకు వంద కోట్లకు పైగా సమకూర్చుకోవాలని జగన్ అండ్ కో లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ కారణంగానే ఈ రెండు విధానాలూ వివాదాస్పదం అయ్యాయి. నిజాయితీగా చెప్పుకోవాలంటే, జగన్‌రెడ్డి మినహా మరే ఇతర ముఖ్యమంత్రి కూడా మద్యం, ఇసుక నుంచి డబ్బు పిండుకొనే ప్రయత్నం చేయలేదు. అలాంటి అవకాశం ఉందన్న ఆలోచన కూడా వారెవరికీ రాలేదు. 2024 ఎన్నికల్లో జగన్ ఘోరంగా ఓడిపోవడానికి నాసిరకం మద్యం సరఫరా కూడా ఒక కారణం కాదా? ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడినందుకే దేవుడు 2019లో రాసిన స్క్రిప్ట్‌ను తిరగరాశాడు. బ్రేక్ ఫాస్ట్ నుంచి రాత్రి డిన్నర్ వరకు డబ్బును మాత్రమే నంజుకు తినాలని చూసే వారిని దేవుడు మాత్రం ఉపేక్షిస్తాడా? ఫలితాన్ని ఇప్పుడు అనుభవిస్తున్నారు. జరిగిన తంతును పరిశీలించిన ఎవరైనా జగన్ అండ్ కోకు పాపభీతి ఉందని, దైవభక్తికి కొదవ లేదని చెప్పగలరా? పాపభీతి ఉంటే ప్రజల రక్తమాంసాలను పణంగా పెట్టి కాసులకు కక్కుర్తిపడరు. నాస్తికులు కూడా ఇలాంటి నీచానికి ఒడిగట్టరు. ఎందుకంటే వారిలో నైతికత అధికంగా ఉంటుంది. బైబిల్‌ను నిత్యం పఠించేవారు, క్రైస్తవ మతాన్ని చిత్తశుద్ధితో ఆచరించేవారు ఎవరూ కూడా పాపిష్టి డబ్బు కోసం ఆశపడరు. దీన్నిబట్టి జగన్‌రెడ్డి అటు ఆస్తికుడూ కాదు– ఇటు నాస్తికుడూ కాదని భావించాల్సి ఉంటుంది. ఆయనకు డబ్బు మాత్రమే ముఖ్యం. అధికారం కూడా డబ్బు కోసమే అనే కోణంలోనే ఆయన ఆలోచిస్తాడన్నది సుస్పష్టం. పాపభీతి, కుటుంబ సంబంధాల పట్ల అనురాగం ఉండి ఉంటే సొంత బాబాయ్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని వెనకేసుకొని రారు కదా? 2004తో పోల్చితే జగన్‌రెడ్డి వద్ద ఇప్పుడు అంతులేని సంపద ఉంది. అదే సమయంలో కుటుంబ సభ్యులు ఆయనకు దూరమయ్యారు. రక్తసంబంధం కంటే డబ్బే ముఖ్యమని భావించి సొంత చెల్లిని, తల్లిని కూడా దూరం చేసుకున్నారు. మనకు అంటూ ఎవరూ లేనప్పుడు ఈ డబ్బు ఎందుకు? తమిళనాడు ముఖ్యమంత్రిగా మరణించిన జయలలిత ఏమి తీసుకెళ్లారు? నాసిరకం మద్యం తాగి ప్రాణాలు కోల్పోయినవారు, ఒళ్లు గుల్ల చేసుకున్నవారి శాపనార్థాలను కొట్టిపారేయలేం. ఎవరైనా పాప పరిహారం చెల్లించుకోవాల్సిందే! అది ఎప్పుడు అన్నదే ప్రశ్న?

పర్వర్టెడ్ ఆర్డర్...!

ఈ విషయాన్ని అలా ఉంచితే, వివిధ రాష్ట్రాల హైకోర్టు న్యాయమూర్తులు ఇస్తున్న కొన్ని ఆదేశాలపై దేశ సర్వోన్నత న్యాయస్థానం చేస్తున్న వ్యాఖ్యలు, వెల్లడిస్తున్న అభిప్రాయాలు సంచలనంగా ఉంటున్నాయి. కొన్ని సందర్భాలలో సుప్రీంకోర్టు వ్యాఖ్యలు కటువుగానూ ఉంటున్నాయి. సదరు వ్యాఖ్యలను పరిశీలిస్తే సుప్రీంకోర్టు ఆగ్రహానికి గురైనవారు హైకోర్టు న్యాయమూర్తులుగా ఎలా నియమితులయ్యారు? అన్న సందేహం కలగడం సహజం. అయితే అలాంటి వారిని కూడా సుప్రీంకోర్టు కొలీజియమే ఎంపిక చేసినందున ఎవరిని తప్పు పట్టాలి? తాజాగా ఒక హత్య కేసులో అరెస్టై జైల్లో ఉన్న కన్నడ నటుడు దర్శన్‌కు కర్ణాటక హైకోర్టు బెయిల్ మంజూరు చేయడంపై సుప్రీంకోర్టు విస్మయం వ్యక్తంచేసింది. 'పర్వర్టెడ్ ఆర్డర్' అని కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇంకొంచెం వెనక్కు వెళితే, ఆంధ్రప్రదేశ్‌లో ఐపీఎస్ అధికారి సంజయ్‌కు ముందస్తు బెయిల్ మంజూరు చేయడంపై కూడా సుప్రీంకోర్టు విస్మయం వ్యక్తంచేసింది. బెయిల్ విచారణ దశలోనే పూర్తి స్థాయి ట్రయల్ నిర్వహించినట్టుగా 49 పేజీల ఆదేశాలు జారీ చేయడం ఏమిటి? అని సుప్రీంకోర్టు నిలదీసింది. అక్రమ మైనింగ్ కేసులో సుదీర్ఘ విచారణ అనంతరం హైదరాబాద్‌లోని సీబీఐ కోర్టు గాలి జనార్దన్‌రెడ్డిని దోషిగా నిర్ధారిస్తూ ఏడేళ్ల కారాగార శిక్ష విధించింది. దాదాపు పదమూడేళ్ల విచారణ తర్వాత సీబీఐ కోర్టు ఈ తీర్పు వెలువరించగా హైకోర్టు మాత్రం ఒకే రోజు గాలి జనార్దన్‌రెడ్డి పిటిషన్‌పై విచారణ చేసి బెయిల్ మంజూరు చేయడమే కాకుండా సీబీఐ కోర్టు తీర్పుపై స్టే కూడా విధించింది. ఇలాంటి సందర్భాలలో కింది స్థాయి న్యాయ వ్యవస్థలో నైతికత చచ్చిపోదా? అన్న అనుమానం కలుగుతుంది. ఇవన్నీ ఒక ఎత్తు కాగా, నోట్ల కట్టలు తగులబడిన ఉదంతంలో అభిశంసనకు గురికాబోతున్న ఢిల్లీ హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ నోట్ల కట్టలు దొరికినంత మాత్రాన ఒక వ్యక్తిని నిందితుడిగా ఎలా పరిగణిస్తారని ప్రశ్నిస్తున్నారు. అవినీతి కేసులలో రెడ్ హ్యాండెడ్‌గా దొరకడం అంటే నోట్ల కట్టలు అందుకోవడమే కదా? సీబీఐ, ఏసీబీ అధికారులు అలాంటి సందర్భాలలోనే కదా నిందితులను అరెస్టు చేస్తారు. ఇప్పుడు వర్మ సంధిస్తున్న ప్రశ్న ప్రకారం వారు నిందితులు కారన్న మాట! ఆయన అంతటితో ఆగకుండా తనపై చర్య తీసుకునే అధికారం కానీ, విచారణ జరిపే అధికారం కానీ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేదంటూ సుప్రీంకోర్టులోనే పిటిషన్ వేశారు. న్యాయ వ్యవస్థపై కుట్రలు జరగకుండా నిరోధించడానికి, వ్యవస్థ ఔన్నత్యం కాపాడటానికి రాజ్యాంగంలో హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు ప్రత్యేక రక్షణలు కల్పించారు. ఇప్పుడు చోటుచేసుకుంటున్న పరిణామాలను గమనిస్తే ఈ రక్షణలను కొందరు దుర్వినియోగం చేస్తున్నారని సామాన్య ప్రజలకు అనుమానం రాకుండా ఎలా ఉంటుంది? జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో నోట్ల కట్టలు తగులబడటాన్ని యావద్దేశం గమనించింది. అయినా ఆయనను అభిశంసించాలని పార్లమెంటును కోరే అధికారం కూడా సుప్రీంకోర్టుకు ఉండదా? సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసిన వారినే కదా హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా రాష్ట్రపతి ఆమోదం కోసం కేంద్రం సిఫారసు చేస్తుంది. ఏదైనా పదవిలో నియమితుడైన వ్యక్తి తప్పు చేస్తే చర్య తీసుకునే అధికారం నియామకపు అథారిటీకే మిగతా వ్యవస్థలలో ఉంటుంది. ఒక్క న్యాయ వ్యవస్థలోనే ఈ వెసులుబాటు లేదు. ఐదేళ్లకోసారి ప్రభుత్వాలను మార్చే అధికారం ఓటర్లకు ఉంటుంది. అంటే, తాము ఎన్నుకున్న ప్రభుత్వాన్ని ఐదేళ్ల తర్వాత ప్రజలు తిరస్కరించవచ్చు. అవినీతి, అనైతిక చర్యలకు పాల్పడిన న్యాయమూర్తులను తొలగించాలంటే ప్రస్తుతానికి పార్లమెంటులో అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టడం ఒక్కటే మార్గం. రాజ్యాంగ నిర్మాతలు సదుద్దేశంతో న్యాయ వ్యవస్థ ఔన్నత్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ రక్షణ ఏర్పాట్లు చేశారు. అయితే ప్రస్తుతం మన దేశంలో న్యాయ వ్యవస్థ ప్రతిష్ఠ మసకబారుతోంది. ప్రజలకు న్యాయ వ్యవస్థపై నమ్మకం సడలుతోంది. తప్పు చేసిన కింది స్థాయి న్యాయాధికారులపై చర్య తీసుకునే అధికారం హైకోర్టులకు ఉంది. అదే హైకోర్టు తప్పు చేస్తే మాత్రం చర్య తీసుకోకూడదట! ఈ రక్షణ వల్లనే కదా న్యాయ వ్యవస్థలో పెడధోరణులు చోటు చేసుకుంటున్నాయి. ఉపరాష్ట్రపతి పదవికి ఇటీవలే రాజీనామా చేసిన జగదీప్ ధన్‌ఖడ్ ఈ విషయంలో తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా వ్యక్తం చేయడం చూశాం. ఫలానా కేసులో హైకోర్టు ఆదేశాలు, తీర్పులు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయని సుప్రీంకోర్టు ఎన్నో సందర్భాలలో వ్యాఖ్యానించింది. అయితే సదరు ఆదేశాలు, తీర్పులు ఇచ్చిన న్యాయమూర్తులు మాత్రం నిక్షేపంగా ఉంటారు. న్యాయ సూత్రాలకు విరుద్ధంగా రాజ్యాంగ నిర్దేశితాలకు భిన్నంగా తీర్పులు ఇచ్చిన సందర్భాలలో సర్వోన్నత న్యాయస్థానం అయినా దాన్ని సరిదిద్దే పరిస్థితి ఉండాలి కదా? నాపై విచారణ జరపడానికి నువ్వెవరివి? అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తినే అభిశంసన తీర్మానం ఎదుర్కోబోతున్న జస్టిస్ యశ్వంత్ వర్మ ఎలా అనగలుగుతున్నారు? ఇలాంటి వారిని కట్టడి చేయడానికైనా వ్యవస్థలో కొన్ని మార్పులు అవసరం అని ప్రజలు భావించడం తప్పు కాదు కదా? తప్పు చేస్తే చర్యలు ఉంటాయన్న భయం ఉంటేనే కదా ఏ వ్యవస్థ అయినా బాధ్యతగా ఉంటుంది? నేను ఏం చేసినా నన్ను విమర్శించకూడదు, నాపై ఎవరూ చర్యలు తీసుకోలేరు అనే అపరిమిత ధీమా ఏ వ్యవస్థకూ మంచిది కాదు. సుప్రీంకోర్టు తప్పు పడితే పరిస్థితి ఏమిటి? అన్న కనీసపు వెరపు హైకోర్టులకు ఉండాలా? వద్దా? నటుడు దర్శన్ విషయంలో గానీ, ఐపీఎస్ సంజయ్ విషయంలో గానీ హైకోర్టులు అనుచితంగా బెయిల్ మంజూరు చేశాయని సుప్రీంకోర్టు భావించినప్పుడు సదరు ఆదేశాలు ఇచ్చినవారు నిక్షేపంగా ఉండవచ్చా?.. తెలియదు! అదేమంటే న్యాయమూర్తులను ఏమీ అనకూడదు అని చట్టంలో ఉందంటారు. న్యాయ వ్యవస్థ ఔన్నత్యాన్ని కాపాడాల్సిందే! అయితే న్యాయ వ్యవస్థకు మచ్చ తెస్తున్నదీ, ప్రతిష్ఠ దిగజారుస్తున్నదీ ఎవరు? ప్రజలు కాదు కదా? న్యాయ వ్యవస్థలో ఉన్నవారే కదా అందుకు బాధ్యులు? ఇవాళ ఈ దేశంలో మిగతా వ్యవస్థలన్నీ విశ్వసనీయతను కోల్పోయాయి. ఒక్క న్యాయ వ్యవస్థ మాత్రమే అంతో ఇంతో విశ్వసనీయతను నిలుపుకొంది. పలు కీలక సందర్భాలలో ఆయా న్యాయస్థానాలు వెలువరించిన కీలక తీర్పుల వల్ల న్యాయ వ్యవస్థ ఔన్నత్యం ఇనుమడించడమే కాకుండా, న్యాయ వ్యవస్థ పట్ల ప్రజల్లో నమ్మకం పెరిగిన విషయం కూడా వాస్తవం. నిజానికి న్యాయ వ్యవస్థ సక్రమంగా, నిజాయితీగా వ్యవహరిస్తే అన్ని వ్యవస్థలూ గాడిలోనే ఉంటాయి. న్యాయ వ్యవస్థపై ఇటు పాలకుల్లో అటు ప్రజల్లో భయం పోకూడదు. లేని పక్షంలో అరాచకం ప్రబలుతుంది. అంటే న్యాయ వ్యవస్థపై ఎంతటి గురుతర బాధ్యత ఉందో అర్థం చేసుకోవచ్చు. మిమ్మల్ని జీతాలకు పని చేసే మిగతావారిలా సమాజం చూడటం లేదు. 'మిలార్డ్' అంటే నా ప్రభువా అని కోర్టులలో న్యాయమూర్తులను సంబోధిస్తారు. ఈ దేశ పౌరులకు న్యాయ వ్యవస్థపై విశ్వాసం పోతే మీరు ఎవరికి ప్రభువులు? అని ప్రశ్నించడానికి ఎంతో సమయం పట్టదు. ఆ మధ్య నాగపూర్‌లో ఒక న్యాయాధికారి తప్పుడు ఆదేశాలు జారీ చేయడంతో ప్రజలు ఆయన వెంట పడ్డారు. హెల్మెట్ పెట్టుకొని పారిపోయారు. న్యాయ వ్యవస్థ గౌరవం పెంచేది.. తుంచేది న్యాయమూర్తులే. న్యాయమూర్తుల తీర్పులే. న్యాయమూర్తులు సక్రమంగా ఉంటే వారి ఔన్నత్యాన్ని రాజకీయ నాయకులు కూడా దిగజార్చలేరు. కాబట్టి మీ వ్యవస్థ ఔన్నత్యాన్ని కాపాడుకోవడం మీ చేతుల్లోనే ఉంది మిలార్డ్స్!

న్యాయ వ్యవస్థ సక్రమంగా, నిజాయితీగా వ్యవహరిస్తే అన్ని వ్యవస్థలూ గాడిలోనే ఉంటాయి. న్యాయ వ్యవస్థపై ఇటు పాలకుల్లో అటు ప్రజల్లో భయం పోకూడదు. లేని పక్షంలో అరాచకం ప్రబలుతుంది.



సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసిన వారినే హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా రాష్ట్రపతి ఆమోదం కోసం కేంద్రం సిఫారసు చేస్తుంది. ఏదైనా పదవిలో నియమితుడైన వ్యక్తి తప్పు చేస్తే చర్య తీసుకునే అధికారం నియామకపు అథారిటీకే మిగతా వ్యవస్థలలో ఉంటుంది. ఒక్క న్యాయ వ్యవస్థలోనే ఈ వెసులుబాటు లేదు. ఐదేళ్లకోసారి ప్రభుత్వాలను మార్చే అధికారం ఓటర్లకు ఉంటుంది. అంటే, తాము ఎన్నుకున్న ప్రభుత్వాన్ని ఐదేళ్ల తర్వాత ప్రజలు తిరస్కరించవచ్చు. అవినీతి, అనైతిక చర్యలకు పాల్పడిన న్యాయమూర్తులను తొలగించాలంటే ప్రస్తుతానికి పార్లమెంటులో అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టడం ఒక్కటే మార్గం. రాజ్యాంగ నిర్మాతలు సదుద్దేశంతో న్యాయ వ్యవస్థ ఔన్నత్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ రక్షణ ఏర్పాట్లు చేశారు. న్యాయ సూత్రాలకు విరుద్ధంగా రాజ్యాంగ నిర్దేశితాలకు భిన్నంగా తీర్పులు ఇచ్చిన సందర్భాలలో సర్వోన్నత న్యాయస్థానం అయినా దాన్ని సరిదిద్దే పరిస్థితి ఉండాలి కదా? నాపై విచారణ జరపడానికి నువ్వెవరివి? అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తినే అభిశంసన తీర్మానం ఎదుర్కోబోతున్న జస్టిస్ యశ్వంత్ వర్మ ఎలా అనగలుగుతున్నారు? ఇలాంటి వారిని కట్టడి చేయడానికైనా వ్యవస్థలో కొన్ని మార్పులు అవసరం అని ప్రజలు భావించడం తప్పు కాదు కదా?

తరిమెల నాగిరెడ్డిని గవర్నర్ ఆహ్వానించి ఉంటే...

జననేత తరిమెల నాగిరెడ్డి చనిపోయి అర్ధ శతాబ్ది కావస్తున్నా ఇంకా ఆయన జీవితం నుండి పొందాల్సిన స్ఫూర్తి అనంతమే! 'తాకట్టులో భారతదేశం' అనే విశ్లేషణతో ఆయన కోర్టులో ఇచ్చిన స్టేట్‌మెంటు పుస్తక రూపంలో వచ్చి అనేక భారతీయ భాషల్లోకి అనువాదమైన ఇన్నేళ్ళ తర్వాత దాని ప్రాసంగికత ఇంకా పెరిగి ఇప్పుడు 'తాకట్టు కాదు, అమ్మకానికి భారతదేశం' అనే స్థాయికి చేరిందని చాలామంది మేధావులు అభిప్రాయపడుతున్నారు. ఈ యాభై ఏళ్ల కాలంలో అనేకమంది మిత్రులు అనేక సందర్భాలలో ఆయన్ని గుర్తు చేశారు. నేనూ అనేకసార్లు వివిధ వేదికలపై ఆ పని చేయటంతో పాటు 'ప్రజాసేవలో తరిమెల నాగిరెడ్డి' పేరుతో 570 పేజీల పుస్తకాన్ని ఆయన శతజయంతి సందర్భంగా 2017లో ప్రచురించాను. యాభై రూపాయల రేటుతో ఇప్పటికి పది వేల కాపీలు జనంలోకి వెళ్లాయి. ఇప్పుడు ఎక్కువమందికి తెలియని కొత్త విషయాలు చెప్పటానికి ప్రయత్నిస్తాను.

ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో కలిసి ఉన్న ఆంధ్ర ప్రాంతాన్ని ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పరచాలన్న ఆందోళన జరుగుతున్న రోజులవి. మద్రాసులో ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశంలో నాగిరెడ్డి (మద్రాసు రాష్ట్ర శాసనసభలో ప్రతిపక్ష నాయకుడు) కమ్యూనిస్టు పార్టీ పక్షాన పాల్గొని 3 గంటల సేపు ప్రసంగించారు. ఆ సభలో ప్రేక్షకునిగా ఉన్న సుప్రసిద్ధ చరిత్రకారుడు మల్లంపల్లి సోమశేఖర శర్మ ఆయన ప్రసంగానికి ముగ్ధుడై సభానంతరం ఆయన నివాసానికి వెళ్లి "నాగిరెడ్డి గారూ నాకు కమ్యూనిస్టులంటే చాలా చులకన భావం ఉండేది. కాని మీలాంటి గొప్ప వక్త, విశ్లేషకుడూ ఆ పార్టీలో ఉన్నారని తెల్సుకుని నా అభిప్రాయం మార్చుకున్నాను" అని అభినందించారు. తర్వాత కొద్దికాలానికే పొట్టి శ్రీరాములు బలిదానంతో ఉద్యమం ఉధృతం కావటంతో ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది. టంగుటూరి ప్రకాశం ముఖ్యమంత్రిగా, కర్నూలు రాజధానిగా ఏర్పడిన ఆంధ్ర రాష్ట్ర శాసనసభలో కూడా నాగిరెడ్డి ప్రతిపక్ష నాయకుడుగా ఉన్నారు.

1953 నవంబర్‌లో ఏర్పడిన ప్రకాశం మంత్రివర్గం సంవత్సర కాలంలోనే పడిపోయింది. మెజారిటీపక్ష (41 సీట్లు) నాయకుడుగా ఉన్న నాగిరెడ్డిని మంత్రివర్గం ఏర్పాటు చేయాలని ఆహ్వానించటం రాజ్యాంగ సంప్రదాయం.

1953 నవంబర్‌లో ఏర్పడిన ప్రకాశం మంత్రివర్గం సంవత్సర కాలంలోనే పడిపోయింది. మెజారిటీపక్ష (41 సీట్లు) నాయకుడుగా ఉన్న నాగిరెడ్డిని మంత్రివర్గం ఏర్పాటు చేయాలని ఆహ్వానించటం రాజ్యాంగ సంప్రదాయం. కమ్యూనిస్టు పార్టీ అదే కోరింది. 'నాగిరెడ్డీ నిన్ను భోజనానికి పిలవగలను గానీ ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించలేను' అనే పరిస్థితి, ఒత్తిడి గవర్నర్ చందూలాల్ మాధవలాల్ త్రివేదిపై లేకపోయి ఉంటే దేశ రాజకీయాలు, కమ్యూనిస్టుల పరిస్థితి మరో రకంగా ఉండేవి.



కమ్యూనిస్టు పార్టీ అదే కోరింది. చందూలాల్ మాధవలాల్ త్రివేది అప్పటి గవర్నర్. "I can invite you for dinner Nagi Reddy, but not to form government" (నిన్ను భోజనానికి పిలవగలను నాగిరెడ్డీ, కాని ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించలేను) అనే పరిస్థితి, ఆ ఒత్తిడి ఆయనపై లేకపోయి ఉంటే దేశ రాజకీయాలు, కమ్యూనిస్టుల పరిస్థితి మరోరకంగా ఉండేవి. మెజారిటీ పక్షానికి ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం ఇవ్వకుండా నెహ్రూ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం స్వతంత్ర భారతదేశ చరిత్రలో తొలి అప్రజాస్వామిక చర్యకి పూనుకుంది. గవర్నర్‌ని కల్సిన సందర్భంలో, "How to control comunists?" అనే పుస్తకం చదివారా? అని త్రివేది అడిగితే దానిపై సమాధానంగా వచ్చిన పుస్తకం కూడా చదివానని నాగిరెడ్డి చెప్పారు.

1975 జూలై 6న ఎడ్లపాడులో జరిగిన నా పెళ్లికి నాగిరెడ్డి అధ్యక్షత వహించాలి. వస్తున్నట్లు నాకు టెలిగ్రాం ఇచ్చి ఆయన అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. టెలిగ్రాం సెన్సార్ అయి నా పెళ్లి వేదికను సుమారు పాతికమంది పోలీసులు చుట్టుముట్టారు. మీసాలు వచ్చినప్పటి నుండి ఎప్పుడూ మీసాలు పెంచని ఆయన బుర్ర మీసాలు పెంచారు. సుప్రసిద్ధ నవలా రచయిత్రి మాదిరెడ్డి సులోచన ఇంట్లో పార్టీ అద్దెకు తీసుకున్న పోర్షన్‌ని పార్టీ డెన్‌గా ఉపయోగిస్తూ ఆ ఇంట్లో నుండే వస్తూపోతూ కార్యక్రమాలు నిర్వహించారు. అక్కడ ఉండగానే నాగిరెడ్డిలో అనారోగ్య లక్షణాలు కన్పడటంతో పార్టీ కార్యకర్తలుగా ఉన్న డా. బిక్కసాని పూర్ణ, ఆయన భార్య డా. మేదరమెట్ల అరుణ (తెలంగాణ పోరాట యోధుడు మేదరమెట్ల సీతారామయ్య కూతురు. ప్రస్తుతం ఇద్దరూ అమెరికాలో స్థిరపడ్డారు) దగ్గరకు తీసుకెళ్లారు. వారి ట్రీట్‌మెంట్‌కి లొంగకపోవటంతో మాదిరెడ్డి వెంకట్రామయ్య అనే పేరుతో ఉస్మానియా ఆసుపత్రిలో చేర్చారు. అదే వార్డులో చికిత్స పొందుతున్న ప్రముఖ సాహితీవేత్త శ్రీనివాస చక్రవర్తి, జయంతి పబ్లికేషన్స్ పెరుమాళ్లు ఆయన్ని గుర్తించలేదు. 1976 నాటికి ఉస్మానియాలో వెంటిలేటర్ సదుపాయం కూడా లేదు. తుదకి జూలై 28 ఉదయాన నాగిరెడ్డి చనిపోయారు.

అప్పుడు అందుబాటులో పార్టీ నాయకులు ఎవరూ లేరు. సాయినాథ్, లాయర్ వెంకటరెడ్డి ఇద్దరూ ఏం చేయాలో తోచక ప్రముఖ లాయర్ సి. పద్మనాభరెడ్డి దగ్గరకు వెళ్ళి పక్క ఇంటిలో ఉన్న మరో ప్రముఖ న్యాయవాది బాల్‌రెడ్డిని తీసుకొని యస్.ఆర్. నగర్‌లో ఉన్న నాగిరెడ్డి చెల్లెలు రమాదేవికి నాగిరెడ్డి పార్థివదేహాన్ని అప్పగించారు. ఈలోగా ప్రతిపక్ష నాయకులు వేములపల్లి శ్రీకృష్ణ ద్వారా ఈ విషయం ముఖ్యమంత్రి వెంగళరావుకి తెలియటంతో పోలీసులు అనంతపురం జిల్లా కల్లూరు గ్రామం వద్ద నాగిరెడ్డి పార్థివదేహం ఉన్న కారును అటకాయించి శవాన్ని స్వాధీనం చేసుకొని అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తీసుకెళ్లారు. విషయం తెల్సుకున్న వేలాది ప్రజలు అక్కడకు చేరారు. నాగిరెడ్డిని చూడటానికి పోలీసులు ఎవరినీ అనుమతించలేదు. దానితో అక్కడేవున్న నాగిరెడ్డి బావ, మాజీ ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి "ఇంకా వాడంటే మీకు భయమెందుకు? జనాన్ని చూడనివ్వండి" అని కేకలేయటంతో ప్రజల్ని అనుమతించారు. పోస్టుమార్టం అనంతరం కల్లూరు నుంచి వేలాది జనం వెంటరాగా తరిమెల వరకు అంతిమ యాత్ర సాగింది. నాగిరెడ్డి అర్ధ శతాబ్ది వర్ధంతి సభలు ఈ సంవత్సరంపాటు జరిపి ఆ గొప్ప కమ్యూనిస్టు స్ఫూర్తిని నిలపాలని ఆయన సహచరులు, అనుచరులకు మనవి చేస్తున్నాను.

▪ చెరుకూరి సత్యనారాయణ
తరిమెల నాగిరెడ్డి స్మారక కమిటీ ప్రధాన కార్యదర్శి

(జూలై 28: తరిమెల నాగిరెడ్డి 50వ వర్ధంతి)

ఉపాధి కోసం ఉత్తరాది కూలీలు..
- కాటారం పొలాల్లో పశ్చిమబెంగాల్, యూపీ,ఉత్తరాఖండ్, ఎంపీ, బిహార్, జార్ఖండ్ కూలీల సందడి
- ఉదయాన్నే వంటలతో సహా పొలాలకు వెళ్లి పనులు
- పురుషులే నాట్లు వేయడం మరో ప్రత్యేకత

7





సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

ఓరుగల్లు అభివృద్ధికి ప్రాధాన్యం

- రెండో రాజధానిగా అభివృద్ధి చేస్తున్నాం..
- త్వరలోనే మామునూరు ఎయిర్‌పోర్టు పూర్తి చేస్తాం
- టెక్స్‌టైల్ పార్కులో 1,398 మంది నిర్వాసితులకు 863 ప్లాట్లు కేటాయింపు
- రూ.4,170 కోట్ల యూజీడీ పనులు చేపడుతున్నాం
- భద్రకాళి ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- నగరంలో అంతర్జాతీయ స్థాయిలో క్రికెట్ స్టేడియం
- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి
- ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై హైదరాబాద్‌లో సమీక్ష

వరంగల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వరంగల్ సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఉమ్మడి వరంగల్ ఇన్‌చార్జి, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఉమ్మడి వరంగల్ జిల్లా సమగ్రాభివృద్ధిపై మంత్రులు కొండా సురేఖ, సీతక్క, ప్రభుత్వ సలహాదారుడు వేంనరేందర్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఆయా జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా చారిత్రాత్మక వరంగల్ నగరాన్ని తెలంగాణకు రెండో రాజధానిగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా నగరాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. వరంగల్ ప్రాంత ప్రజల చిరకాల స్వప్నమైన మామునూరు ఎయిర్‌పోర్టుకు అవసరమైన భూసేకరణ యుద్ధ ప్రతిపాదికన (మిగతా 6వ పేజీలో)



పాల్గొన్న ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు

మ్యాన్‌హోల్స్ ముప్పు



నగరంలో ప్రాణ సంకటంగా మారిన వైనం

వరంగల్ కార్పొరేషన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం.. ఆపై వరదలు.. దీంతో నగర పరిధిలో పలుచోట్ల మ్యాన్‌హోల్స్ 'నోళ్లు' తెరుచుకొని నరకద్వారాలుగా మారాయి. ప్రస్తుతం విస్తారంగా వర్షాలు కురుస్తుండగా వరదనీటితో ఓపెన్ అయిన మాన్‌హోల్స్ ప్రమాదకరంగా మారాయి. 66 డివిజన్‌లలో మ్యాన్‌హోల్స్ ప్రజలకు ప్రాణసంకటంగా మారుతున్నాయి. వాటిని గుర్తించక ప్రజలు ప్రమాదాల బారిన పడే అవకాశాలున్నాయి.

పర్యవేక్షణ ఏదీ?

మ్యాన్‌హోల్స్ పర్యవేక్షించడంలో జీడబ్ల్యూఎంసీ అధికారులు ఉదాసీనత కనబరుస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాక్స్ డ్రెయినేజీలకు ఇంజనీరింగ్ అధికారులు మ్యాన్‌హోల్స్ అమర్చగా వాటి పరిరక్షణ, చెత్త తొలగింపు శానిటేషన్ విభాగం చూస్తుంది. వర్షాకాలంలో డ్రెయినేజీల్లో చెత్తతో కూడిన ప్రవాహ ఉధృతికి మ్యాన్‌హోల్స్ పైన ఉండే మూతలు పక్కకు జరిగే అవకాశం ఉంటుంది. అలాగే డ్రెయినేజీలు బ్లాక్ అయినప్పుడు జీడబ్ల్యూఎంసీ సిబ్బంది మూతలను తొలగించి చెత్తను బయటకు తీస్తారు. ఇలా మూతలు లేని మ్యాన్‌హోల్స్‌పై పర్యవేక్షణ ఉండటం లేదు. దీంతో వర్షాకాలంలో వాటిపై నుంచి వరదనీరు వెళ్లే సందర్భంలో అక్కడ మ్యాన్‌హోల్ ఉందనే విషయం తెలియక ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. కొన్నిసార్లు ప్రాణాలు సైతం కోల్పోతున్నారు. మ్యాన్‌హోల్స్ లోపల చెత్తాచెదారం నిండి బ్లాకేజ్ ఏర్పడిన తర్వాతనే అధికారులకు సమస్యలు గుర్తుకువస్తాయని జనం మండిపడుతున్నారు. ఎండాకాలంలోనే సంబంధిత ఇంజనీరింగ్, శానిటేషన్ అధికారులు నగరంలో ఎన్నిచోట్ల మ్యాన్‌హోల్స్ ఉన్నాయి? వర్షాకాలంలో ప్రమాదాల జరిగే అవకాశాలు ఎక్కడ ఉన్నాయి? అని ముందస్తుగానే పరిశీలించి ఓ అంచనాకు రావాల్సి ఉంది. కానీ జీడబ్ల్యూఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.

నగరంలో ప్రమాదాలు

వరంగల్ నగరంలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల పలు చోట్ల మ్యాన్‌హోల్స్ ప్రమాదాలు జరిగినట్టు తెలుస్తోంది. వరంగల్ చౌరస్తా, బట్టలబజార్, ఇంతేజార్‌గంజ్, రామన్నపేట, కాకతీయ కాలనీ, పెద్దమ్మగడ్డ, సెంట్రల్‌జైలు ప్రాంతం, యాదవనగర్, మంగళివాగు, ఈదుల వాగు, నయీంనగర్, కిషన్‌పుర, జేఎన్ఎస్ ప్రాంతం, అశోకా థియేటర్ వెనుక, బాపూజీనగర్, ఫాతిమానగర్, కాజీపేట చౌరస్తా ప్రాంతాల్లో మ్యాన్‌హోల్స్ తెరుచుకుని ఉండడంతో ప్రమాదాలకు నిలయంగా (మిగతా 8వ పేజీలో)

- వర్షాకాలంలో మ్యాన్‌హోల్స్‌లో చిక్కుతున్న కాల్వల్లోని వ్యర్థాలు
- ప్రవాహ ఉధృతికి తెరుచుకుంటున్న మ్యాన్‌హోల్స్
- కొన్నిచోట్ల చెత్తను క్లియర్ చేసేందుకు తొలగిస్తున్న జీడబ్ల్యూఎంసీ సిబ్బంది
- వరదనీరు ప్రవహించే సందర్భంలో గుర్తించలేకపోతున్న జనం
- పర్యవేక్షణ పట్టని జీడబ్ల్యూఎంసీ అధికారులు
- ప్రస్తుతం గ్రేటర్ సిటీ పరిధిలో 840 మ్యాన్‌హోల్స్

మ్యాన్‌హోల్స్ అంటే..

మ్యాన్‌హోల్స్ అంటే మానవ ప్రవేశానికి అనువుగా ఉండే డ్రెయినేజీ ప్రవేశ ద్వారాలు. వీటిని సాధారణంగా పల్లెలు, పట్టణాలు, నగరాల్లో మురుగు నీటి నిర్వహణ వ్యవస్థలో భాగంగా ఏర్పాటు చేస్తారు. డ్రెయినేజీలకు అనుసంధానంగా ఉండే మ్యాన్‌హోల్స్‌ను జీడబ్ల్యూఎంసీ ఇంజనీరింగ్ విభాగం డిజైన్ చేయగా, వాటి పరిరక్షణ, బ్లాకేజ్‌లను శానిటేషన్ విభాగం చూసుకుంటుంది. మ్యాన్‌హోల్స్ వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నప్పటికీ సరియైన నిర్వహణ లేక పోవడం వల్ల ప్రమాదాలు జరిగి ప్రాణాల మీదకు తెచ్చుకునే పరిస్థితులు ఉంటాయని సీనియర్ ఇంజనీర్లు చెబుతున్నారు.

అణు శాస్త్రవేత్తగా నాయిని కమల్

- బార్క్‌లో అసిస్టెంట్ సైంటిస్ట్‌గా ఎంపిక
- మధ్య తరగతి కుటుంబం నుంచి మెరిసిన రత్నం
- స్వస్థలం ఖిలావరంగల్.. స్థానికుల హర్షం
- మాతృదేశం సేవలో తరిస్తానని వెల్లడి



బార్క్ వద్ద గోల్డ్ మెడల్‌తో నాయిని కమల్

వరంగల్ సిటీ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): బాల్యం నుంచే చదువులో అద్భుతమైన ప్రతిభను కనబరుస్తూ.. నిరంతరం శ్రమించి తాను అనుకున్న లక్ష్యాన్ని సాధించాడు నగర యువకుడు. ఖిలావరంగల్‌కు చెందిన నాయిని కమల్ ముంబైలోని బాబా అటామిక్ రిసెర్చ్ సెంటర్ (బార్క్-బాబా అణు పరిశోధన కేంద్రం)లో అసిస్టెంట్ సైంటిస్ట్‌గా ఉద్యోగం సాధించారు. ఆగస్టు 1న విధుల్లో చేరనున్నారు. బార్క్‌లో న్యూక్లియర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ మెటలర్జి విభాగంలో ఒక సంవత్సరం ఓరియంటేషన్ కోర్సు పూర్తి చేసిన కమల్ తనదైన ప్రతిభతో ప్రథమ స్థానం సాధించారు.ఈ నెల 25న ముంబైలో ప్రధానమంత్రి ప్రిన్సిపల్ సెక్రెటరీ పీకే మిశ్రా చేతుల మీదుగా బంగారు పతకాన్ని అందుకొని ఓరుగల్లు కీర్తిని చాటారు. కమల్ నాన్న నాయిని కుమరస్వామి ఏనుమాముల మార్కెట్‌లో గుమస్తాగా పని చేసి ప్రస్తుతం అడ్తి దుకాణం నిర్వహిస్తున్నారు. అమ్మ రజిత గృహిణి. తమ్ముడు చక్రి బీటెక్ చదువుతున్నాడు. కమల్ ఒకటి నుంచి ఐదో తరగతి వరకు స్టాండర్డ్ (మిగతా 8వ పేజీలో)

నేడు కేటీఆర్ రాక

- భూపాలపల్లి, మొగుళ్లపల్లిలో పలు కార్యక్రమాలకు హాజరు



కృష్ణకాలనీ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) భూపాలపల్లి జిల్లాలో ఆదివారం పర్యటించనున్నారు. ఉదయం 11.30 గంటల మొగుళ్లపల్లి మండలం ఇస్సిపేట గ్రామంలో మాజీ సర్పంచ్ కొడారి కొమురయ్య విగ్రహ ఆవిష్కరణలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12 గంటలకు కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. భోజనం విరామం తర్వాత మొగుళ్లపల్లి, నవాబుపేట, జడల్‌పేట, ఒడితల, దూద్‌పల్లి, ఎస్ఎంకొత్తపల్లి, మోరంచపల్లి, చెల్పూరు మీదుగా భూపాలపల్లిలోని బీఆర్ఎస్ కార్యాలయానికి చేరుకుంటారు. మధ్యాహ్నం 2 గంటల కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ పాల్గొంటారు. కాగా, కేటీఆర్ రాక సందర్భంగా భూపాలపల్లిలో ఏర్పాటైన ఫ్లెక్సీలు వర్గపోరుకు అద్దం పట్టాయి. బీఆర్ఎస్ కార్యాలయం ఎదురుగా మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఏర్పాటు చేసిన స్వాగత ఫ్లెక్సీలో సిరికొండ మధుసూదనాచారి ఫొటో కనిపించలేదు. అయితే.. ఈ ఫ్లెక్సీ వెనుకనే మధుసూదనాచారి తనయుడు, ప్రశాంత్ ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీలో గండ్ర ఫొటో లేదు.

క్రీడా పాఠశాలకు గ్రీన్ సిగ్నల్

- మూడు నాలుగు రోజుల్లో జారీ కానున్న జీవో
- ఉనికిచర్లలో ఏర్పాటుకు మొదలైన కసరత్తు
- జేఎన్ఎస్‌లో తాత్కాలికంగా ఏర్పాటు
- వచ్చే నెల 15 నుంచి ప్రవేశాలు
- క్రీడల్లో ప్రతిభావంతులను గుర్తించి శిక్షణ

హనుమకొండ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): క్రీడా పాఠశాల ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. పాఠశాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. ఇందుకు సంబంధించిన జీవో మూడు నాలుగు రోజుల్లో జారీ కావచ్చునని తెలుస్తోంది. క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు తెలంగాణ క్రీడా ప్రాధికారిక సంస్థ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వచ్చే నెల 15 నుంచి పాఠశాల పని చేయడం ప్రారంభం అవుతుంది. ఈనెల గత 7వ తేదీన 'ఆటలు ఆడేది ఎలా?' శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంతో కదలిక వచ్చింది. గత నెల 26న క్రీడా సంఘాల ప్రతినిధులు స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కలిసి వినతి పత్రం సమర్పించారు. కడియం వెంటనే స్పందించి మిగతా ఎమ్మెల్యేలతో కలిసి మూడు రోజుల స్పోర్ట్స్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జేయేష్ రంజన్‌ను కలిసి క్రీడా పాఠశాల ఏర్పాటుకు అభ్యర్థించారు. పాఠశాల ఏర్పాటుకు అవసరమైన స్థలం ఉనికిచెర్లలో అందుబాటులో ఉందని తెలిపారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన రంజన్ పాఠశాల మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

జేఎన్ఎస్‌ను సందర్శించిన సాట్ బృందం

ధర్మసాగర్ మండలంలోని ఉనికిచెర్లలో జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న 20ఎకరాల ప్రభుత్వ స్థలంలో క్రీడా పాఠశాల ఏర్పాటుకానున్నది. అక్కడ పాఠశాలకు అన్ని హంగులతో కూడిన శాశ్వత భవనం నిర్మాణం అయ్యే వరకు స్పోర్ట్స్ స్కూల్‌ను హనుమకొండ జేఎన్ఎస్ స్టేడియంలో నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు తెలంగాణ క్రీడాప్రాధికార సంస్థ (సాట్) ఉన్నతాధికారుల బృందం గురువారం జేఎన్ఎస్ స్టేడియాన్ని సందర్శించింది. తరగతుల నిర్వహణ, విద్యార్థులకు బసకు అందుబాటులో ఉన్న భవనాలను, అలాగే సింథటిక్ ట్రాక్‌ను, కోర్టులను పరిశీలించింది. కోచ్‌లతో చర్చించింది. వారి అభిప్రాయాలను కూడా అడిగి తెలుసుకున్నది. ఈ మేరకు నివేదికను తయారుచేసి సాట్‌కు సమర్పించింది. ఉనికిచెర్లలో క్రీడా పాఠశాల భవనం నిర్మాణం అయ్యే వరకు రెండేళ్ల పాటు పాఠశాలనను ఇక్కడే నిర్వహిస్తారు.



జెఎన్ఎస్ స్టేడియంలో క్రీడా పాఠశాల ఏర్పాటుకు అందుబాటులో ఉన్న వసతులను పరిశీలిస్తున్న కలెక్టర్ స్నేహ శబరీష్

వెయిటింగ్ లిస్టులో ఉన్నవారితో..

రాష్ట్రంలోని మూడు చోట్ల ఉన్న క్రీడా పాఠశాలలో ప్రవేశాలు ఇప్పటికే పూర్తయ్యాయి. కనుక హనుమకొండలో కొత్తగా ఏర్పాటయ్యే క్రీడా పాఠశాలలో ప్రవేశానికి కొత్తగా ఎంపికలు ఉండవు. హకీంపేట క్రీడా పాఠశాలలో ఎంపికై వెయిటింగ్ లిస్టులో ఉన్నవారికే ఇక్కడ ప్రవేశాలు కల్పిస్తారు. ఇక్కడ ఎంపికలు వచ్చే సంవత్సరం నుంచి ఉంటాయి. క్రీడా పాఠశాలను జేఎన్ఎస్‌లో తాత్కాలికంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. పాఠశాల తరగతులను స్టేడియంలోని ప్రస్తుత బాలుర హాస్టల్ భవనంలో రెండు గదుల్లో నిర్వహిస్తారు. ఇందులోని మిగతా గదుల్లో బాలికలకు వసతి కల్పిస్తారు.

క్రీడా పాఠశాలలో..

ఉనికిచెర్లలో కొత్తగా ఏర్పాటయ్యే క్రీడా పాఠశాలలో ఔట్‌డోర్ స్టేడియం మల్టీపర్పస్, ఇండోర్ స్టేడియం, స్పోర్ట్స్ హాస్టల్, హెల్త్ సెంటర్, తరగతి గదులు, జిమ్ సెంటర్, జిమ్నాస్టిక్ హాల్, వివిధ కోర్టులు, సింథటిక్ ట్రాక్ ఇతరత్రా సౌకర్యాలు ఉంటాయి. యేటా 80 మందికి ప్రవేశాలు ఉంటాయి. 4వ తరగతి నుంచి ఇంటర్‌మీడియట్ వరకు ఇందులో క్రీడల్లో శిక్షణ ఇస్తారు. బాలురు, బాలికలకు విడివిడిగా బాకులు, కోచ్‌లకు స్టాఫ్ క్వార్టర్లు, ఆధునాతనమైన కిచెన్, విశాలమైన డైనింగ్ హాల్, క్రీడల్లో మెళకువలు తెలుసుకునేందుకు ఆడియో లైబ్రరీ, జాతీయ, అంతర్జాతీయ క్రీడా నిపుణులతో ఆన్‌లైన్ క్లాసుల నిర్వహణకు డిజిటల్ తరగతులు ఉంటాయి. క్రీడా పాఠశాలలో చేరిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ, వారిలోని క్రీడా నైపుణ్యాలను ఎప్పటికప్పుడు గుర్తించే ట్రాక్ రికార్డుల నిర్వహణ వ్యవస్థ ఉంటుంది. మోటివేషన్‌పై ప్రధానంగా దృష్టి సారిస్తారు.

శరవేగంగా ఏటీసీల ఏర్పాటు
- చురుకుగా షెడ్ల నిర్మాణ పనులు
- తొలి విడత తొమ్మిది ఐటీఐలలో ఏటీసీల ఏర్పాటు
- ఆరు చోట్ల 90 శాతం పనులు పూర్తి
- ఐటీఐలకు చేరుకున్న ఏటీసీ పరికరాలు

7

హక్కుల సాధనకు బీసీలు సంఘటితం కావాలి

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు వినయభాస్కర్

హనుమకొండ టౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): బీసీలందరు సంఘటితమై హక్కులను సాధిద్దామని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద తెలంగాణ బీసీ మహాసేన కన్వీనర్ క్రాంతికుమార్ ఆధ్వర్యంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని కోరుతూ ఒక రోజు దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ హాజరై మాట్లాడారు. మొదట ఛత్రపతి సాహూ మహరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కామారెడ్డి డిక్లరేషన్ అమలుకు కలిసి కొట్లాడుదామని పిలుపునిచ్చారు. బీసీల రిజర్వేషన్ల సాధన కోసం స్వరాష్ట్ర ఉద్యమ తరహా పోరాటాలు చేద్దామన్నారు. అన్ని రంగాలకు చెందిన 42 మంది బీసీ ప్రముఖులతో రిజర్వేషన్‌డే రోజున బీసీల 42 శాతం రిజర్వేషన్ కోసం దీక్ష చేయడం బీసీ ఉద్యమంలో ఒక మైలురాయి అన్నారు. బీసీ రిజర్వేషన్ల ఉద్యమాన్ని, దాని అవశ్యకతను బీసీ సమాజానికి వివరించి ఉద్యమాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఛత్రపతి సాహూ మహరాజ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న దాస్యం వినయభాస్కర్

తెలుగు కథకు జేజేలు

నేడు ఉత్తమ కథారచయితలకు బహుమతుల ప్రదానోత్సవం

భీమదేవరపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయంగా తెలుగు కథకు పట్టం కట్టేందుకు ముల్కనూర్ సాహితీ పీఠం ఆధ్వర్యంలో చేస్తున్న కృషి సాహితీవేత్తల ప్రశంసలు అందుకుంటోంది. గత ఆరేళ్లుగా వీరు జాతీయ స్థాయిలో కథల పోటీలను నిర్వహిస్తున్నారు. అమెరికా, ఆఫ్రికా దేశాల నుంచి సైతం కథలు పోటీలకు వస్తున్నాయి. ఇప్పటి వరకు నాలుగు వేల కథలు పోటీకి వచ్చాయి. యేటా 75 కథలను ప్రోత్సహిస్తూ నగదు బహుమతులు అందజేస్తున్నారు. ప్రథమ బహుమతి పొందిన కథకు రూ.50వేల నగదు పురస్కారాన్ని అందజేస్తున్నారు. ఈ ఏడాది ఉత్తమ కథారచయితలుగా ఎంపికైన వారికి బహుమతుల ప్రదానోత్సవం ఆదివారం ముల్కనూర్ ప్రజాగ్రంథాలయంలో జరగనుంది. మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు, పలువురు ప్రముఖులు హాజరు కానున్నారు. ప్రథమ బహుమతి రూ.50వేల నగదు, ఇద్దరికి రూ.25వేల చొప్పున, ఐదుగురికి 10వేల చొప్పున, 10మందికి రూ.5వేల చొప్పున, 20మందికి రూ.3వేల చొప్పున నగదుతో పాటు ప్రోత్సాహక బహుమతులను అందజేయనున్నారు.

ఇరిగేషన్‌లో పదోన్నతుల్లో అక్రమాలు

ఈఎన్‌సీకి ఫిర్యాదు చేస్తామన్న ఉద్యోగ సంఘాల నాయకులు

హనుమకొండ టౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ చింతగట్టులోని నీటిపారుదల శాఖలో పనిచేస్తున్న ఓ ఉన్నతాధికారి వారంలో రిటైర్‌మెంటుకు సిద్ధమవుతుండగా, ప్రమోషన్ల ప్రక్రియతోపాటు, పనుల టెండర్ల విషయంలో ఆయనపై అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. ముఖ్యంగా ఉద్యోగుల పదోన్నతుల విషయంలో అన్యాయంగా వ్యవహరించారని, లక్షలాది రూపాయలు లంచంగా తీసుకున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అర్హతలున్న వారిని పక్కన పెట్టి అనుచరులను ఎత్తిపోసినట్లు ఉద్యోగ సంఘాల నాయకులు మండిపడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పదోన్నతులు చేపట్టారంటూ ఆరోపణలు చేస్తున్నారు. సంబంధిత దస్తావేజులను సేకరించి, అవినీతి నిరూపించే ఆధారాలతో హైదరాబాద్‌లోని ఈఎన్‌సీకి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తెలిపారు.

3న జిల్లా స్థాయి చెస్ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్, జూలై 26(ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 3న హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో జిల్లా స్థాయి చెస్ ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు క్రీడా పోటీల నిర్వాహణ కార్యదర్శి కన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి ఓపెన్ టు ఆల్ బాలబాలికల విభాగంలో నిర్వహించనున్న చెస్ టోర్నీలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు నగదు పురస్కారంతో పాటు ప్రశంసాపత్రం అందచేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9059522986 సెల్ నెంబర్‌లో సంప్రదించాలని కన్న సూచించారు.

ఓరుగల్లు అభివృద్ధికి ప్రాధాన్యత

(5వ పేజీ తరువాయి)

చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భూసేకరణకు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేవని, ఇప్పటికే రూ.205కోట్లు విడుదల చేశామన్నారు.

కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో రాజీవ్‌గాంధీ టౌన్‌షిప్‌లో ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీ కింద 1,398మంది నిర్వాసితులను గుర్తించి 863 ప్లాట్లు కేటాయించినట్లు తెలిపారు. ఈ కాలనీకి సంబంధించి సెప్టెంబరు నెలఖారునాటికి మౌలిక సదుపాయాలు కల్పన పూర్తికావాలని అధికారులను ఆదేశించారు. అలాగే వెటర్నరీ ఆస్పత్రి, ప్రాథమిక పాఠశాల, గ్రామ పంచాయతీ భవనం నిర్మాణం చేయాలన్నారు. టెక్స్‌టైల్ పార్కులో స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని సూచించారు. నగరంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం కోసం రూ.4,170కోట్లు కేటాయించామన్నారు. వీటినంత త్వరగా పనులు ప్రారంభించేలా పనులను ఆయాశాఖల వారిగా విభజన చేసుకోవాలని కోరారు.

భద్రకాళి ఆలయ మాడవీధులతో పాటు కల్యాణమండపం, తదితర వాటిని దసరానాటికి అందుబాటులోకి తెచ్చేలా ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. భద్రకాళి ఆలయ అభివృద్ధి పనులను పర్యవేక్షణకు తానే స్వయంగా వస్తానని, రోప్‌వే, గ్లాస్ బ్రిడ్జితో సహా అన్ని పనులు వచ్చే డిసెంబర్ వరకు పూర్తి చేయాలన్నారు. భద్రకాళి చెరువులో ఇప్పటివరకు 3.5లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తరలించామని, రూ.2.06కోట్ల మట్టిని విక్రయించామని అధికారులు వివరించారు. వర్షాకాలం పూర్తి కాగానే, మట్టి తరలించే పనులు చేపట్టాలన్నారు. ఆలయంలో యంత్రాల సాయంతో భోజన తయారీ కార్యక్రమాన్ని చేపడుతామని, దీనికి తగ్గట్టుగా నిర్మాణాలు చేపట్టాలన్నారు. వరంగల్‌లో క్రికెట్ స్టేడియం ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా ఉన్నారని తెలిపారు. స్టేడియానికి అవసరమైన స్థలాన్ని చూడాలని మంత్రి సూచించారు. హాస్టల్, ఆస్పత్రుల్లో మెరుగైన సేవలు అందించేందుకు మండలానికో ప్రత్యేక అధికారిని నియమించాలని పొంగులేటి సూచించారు.

మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరాలని, ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలలను జిల్లా కలెక్టర్లు వారంలో ఒకటిరెండు సార్లు సందర్శించాలని కోరారు. ఎయిర్‌పోర్టుకు అవసరమైన పనులపై అధికారులు దృష్టి పెట్టాలని కోరారు. వర్షాకాలంలో పశువులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. వరంగల్ అభివృద్ధికి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన డీపీఆర్, టెండర్లు, పనులు ప్రారంభించడానికి, పూర్తి చేయడానికి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని మంత్రి కొండా సురేఖ సూచించారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్‌రెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్.నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు, ఎంపీ బలరామ్‌నాయక్, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బస్వరాజు సారయ్య, అంజిరెడ్డి, మేయర్ గుండు సుధారాణితో పాటు ఆయా జిల్లాల కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్ - కాజీపేట అదనపు రైల్వేలైన్‌ల సర్వే పూర్తి

● రూ 2.837 కోట్లతో నిర్మాణం అంచనా

కాజీపేట, జూలై 26 (ఆంధ్రజోతి): నిత్యం ట్రాఫిక్‌తో రద్దీగా ఉండే సికింద్రాబాద్- కాజీపేట రైల్వే ట్రాక్‌లపై భారం పడకుండా నూతనంగా మరో రెండు అదనపు ట్రాక్‌లను నిర్మించేందుకు రైల్వే శాఖ చర్యలు ప్రారంభించింది. నూతనంగా మరో రెండుట్రాక్‌ల నిర్మాణానికి రూ.2,837 కోట్ల అంచనా వేస్తోంది. ఇందుకోసం రైల్వే శాఖ సర్వే పూర్తి చేసి డీపీఆర్‌ను సైతం రైల్వే బోర్డుకు పంపినట్లు రైల్వే అధికారులు తెలిపారు. రైల్వే బోర్డు అనుమతులు లభిస్తే పనులు ప్రారంభించడమే తరువాయి అని అంటున్నారు. సికింద్రాబాద్ నుంచి బల్లార్షా, న్యూఢిల్లీ వైపు, వరంగల్ మీదుగా విజయవాడ, విశాఖపట్నం, చెన్నై మార్గాలకు కాజీపేట జంక్షన్ మీదుగానే రైళ్ల రాకపోకలు సాగించే ప్రధాన రైల్వే స్టేషన్ కాజీపేటకు మూడు, నాలుగో రైల్వేలైన్ ట్రాక్‌లు లేకపోవడంతో ప్రస్తుతం ఉన్న ట్రాక్‌లపై భారం ఎక్కువవుతోంది. దీంతో పాటు గూడ్స్ రైళ్ల రాకపోకలు అదనం. సికింద్రాబాద్- కాజీపేట మూడు, నాలుగు రైల్వే ట్రాక్‌లు నిర్మిస్తే ట్రాక్‌లపై అదనపు భారం తగ్గడంతోపాటు, ప్రయాణికుల రాకపోకలకు సమయం ఆదా అవుతుందని రైల్వే కార్మిక సంఘాల నాయకులు అంటున్నారు.

సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన యువకుడు

● రూ.64 వేలను పోగొట్టుకున్న వైనం

చెన్నారావుపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల చేతిలో ఓ యువకుడు మోసపోయి డబ్బులు పోగొట్టుకున్న సంఘటన మండలంలోని గురిజాలలో శనివారం వెలుగులోనికి వచ్చింది. ఎస్సై రాజేశ్ రెడ్డి కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ఇదే గ్రామానికి చెందిన ముచ్చిపుల అజయ్ ప్రైవేటుగా ఉద్యోగం చేసుకుంటున్నాడు. తనకు ఉన్న స్మార్ట్ ఫోన్‌లో టెలిగ్రామ్ యాప్ చూస్తున్నాడు. ఈ క్రమంలోనే మధ్యలో ఓ యాడ్ వచ్చింది. ఆ యాడ్‌లో మీరు పెట్టిన రూపాయలకు అదనంగా తిరిగి రూపాయలను కల్పిస్తామన్నారు. ఆ విషయాన్ని నమ్మిన యువకుడు మే 5న రూ.10 వేలను ఆ యాప్‌లో పెట్టుబడి పెట్టాడు. తిరిగి యాప్ నిర్వహకులు మరుసటి రోజు రూ.13 వేలను ఇచ్చారు. జూన్ 3న రూ.10 వేలను, జూన్ 4న రూ.15 వేలను. జూన్ 5న రూ 13 వేలను, జూన్ 6న రూ 26 వేలను యాప్‌లో పెట్టుబడి పెట్టాడు. తన అకౌంట్‌కు డబ్బులు జమ అవుతాయని చూసి చూసి తాను సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయినని గుర్తించి పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

భూ కబ్జాలు.. ఆర్థిక మోసాలు.. వేధింపులు

- ఏసీపీ కార్యాలయానికి వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు
- సీరియస్‌గా తీసుకున్న ఏఎస్పీ శుభం ప్రకాశ్
- పోలీస్‌స్టేషన్ల వారీగా జాబితా తయారీ

మట్టెవాడ(వరంగల్) జూలై 26 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఏసీపీ కార్యాలయానికి గత రెండు వారాలుగా బాధితులు తమ గోడు చెప్పుకునేందుకు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. వరంగల్ ఏఎస్పీగా శుభం ప్రకాశ్ బాధ్యతలు చేపట్టడంతో దీర్ఘకాలంగా మిల్స్‌కాలనీ, ఇంతేజార్‌గంజ్, మట్టెవాడ పోలీస్ స్టేషన్లలో తమ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో బాధితులు ఏసీపీ కార్యాలయానికి వచ్చి విన్నవించుకుంటున్నారు. ఏఎస్పీ బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి సమస్యలు విని, విచారణ చేసి న్యాయం చేయాలని సంబంధిత పోలీస్ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలను ఆదేశిస్తున్నారు. ప్రతి ఫిర్యాదుపై, పాత కేసులపై విచారణ నివేదిక ఇవ్వాలని సంబంధిత ఇన్‌స్పెక్టర్లను ఆదేశించినట్లు తెలిసింది.

ప్రధానంగా వరంగల్ పోలీసు సబ్ డివిజన్‌లో భూ కబ్జాలు, వివిధ పరపతి సంఘాలు, సొసైటీలలో ఆర్థిక మోసాలు, అక్రమ కేసుల బనాయింపు, కొంత మంది పోలీసు సిబ్బందిపై ఫిర్యాదులు వస్తున్నాయి. వీటిపై క్షుణ్ణంగా పరిశీలిస్తున్న ఏ ఎస్పీ శుభం ప్రకాశ్ సమగ్ర విచారణ నివేదికను తయారు చేయాలని ఆదేశిస్తున్నారు. ఇప్పటికే పోలీస్ స్టేషన్ల వారీగా భూ కబ్జాదారులు, ఆర్థిక మోసాలకు పాల్పడుతున్న వ్యక్తుల జాబితాలను పోలీసులు తయారు చేసినట్లుగా తెలిసింది. స్పెషల్ బ్రాంచ్, ఇంటెలిజెన్స్ సిబ్బంది క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించినట్లు సమాచారం.

పోలీసు సిబ్బందిపై ఫిర్యాదులు

వరంగల్ పోలీసు సబ్ డివిజన్‌లో కొంత మంది పోలీసు కానిస్టేబుళ్లు, ముగ్గురు హెడ్ కానిస్టేబుళ్లు, ముగ్గురు రైటర్స్, ఒక హోంగార్డు, ఒక సీఐ గన్‌మెన్, ఒక ఎస్‌ఐ, గతంలో వరంగల్ సబ్ డివిజన్‌లో పనిచేసిన ఒకరిద్దరు సీఐలపై బాధితులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. తమ పై అక్రమంగా తప్పుడు కేసులు పెట్టారని కొంత మంది పోలీసు సిబ్బంది భూ కబ్జాదారులతో, ఆర్థిక మోసాలకు పాల్పడే వ్యక్తులతో కుమ్మక్కై నట్లు, భార్యభర్తల పంచాయితీలు, కుటుంబ పం చాయితీల్లో తల దూర్చి డబ్బులు ఇవ్వాలని బెదిరించారని ఆ ఫిర్యాదుల్లో పేర్కొన్నట్లు తెలిసింది.

పోలీసు సిబ్బందిపై వచ్చిన ఫిర్యాదులపై సీరియస్‌గా తీసుకొన్న వరంగల్ ఏఎస్పీ శుభం ప్రకాశ్ బాధితుల నుంచి వివరాలు, ఆధారాలు సేకరించాలని ఆదేశించినట్లు తెలిసింది. అలాగే తప్పుడు కేసులపై వచ్చిన ఫిర్యాదులపై సమగ్రంగా విచారించి నివేదికను ఇవ్వాలని సంబంధిత ఇన్‌స్పెక్టర్లను ఆదేశించినట్లు తెలిసింది.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్

జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ కల్చరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఉన్నత చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా విద్యార్థులకు సూచించారు. జనగామ మండలం పెంబర్తి మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలను శనివారం తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల హాజరును, కిచెన్‌లో వంట సరుకులను పరిశీలించారు. టెన్త్ విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థులకు మరింత ఎక్కువ సమయం కేటాయించాలని, సబ్జెక్టులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ప్రిన్సిపాల్ లలితను ఆదేశించారు. కార్యక్రమంలో డీఈవో డి.భోజన్న, పాఠశాల డీసీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతిబాపూలే పాఠశాలలో వంటగదిని పరిశీలిస్తున్న కలెక్టర్

నిండుకుండలా పాకాల సరస్సు

24.5 ఫీట్లకు చేరిన నీటిమట్టం

నర్సంపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఐదురోజులుగా వరుసగా కురుస్తున్న వర్షపు జల్లులతో వరంగల్ జిల్లా నర్సంపేట డివిజన్ పరిధిలోని ఖానాపురం మండలంలోని పాకాల సరస్సు జలకళతో ఉట్టిపడుతూ నిండుకుండలా మారింది. సరస్సులో నీటిమట్టం శనివారం సాయంత్రం వరకు 24.5 ఫీట్లకు చేరింది. రాత్రి వరకు వరదనీటి కారణంగా 25 ఫీట్లనీటిమట్టానికి సరస్సు చేరుకునే వీలుంది. మరో 5 ఫీట్లు చేరితే మత్తడి పోయనుంది. 30 ఫీట్లఫీట్ల నీటి సామర్థ్యం ఉన్న సరస్సులోకి ఐదురోజులుగా కురుస్తున్న వర్షాలతో నీటి మట్టం రోజురోజుకు పెరుగుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కొంత మంది రైతులు వర్షపు జల్లుల మధ్య నాటు వేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. నర్సంపేట మండలం మాదన్నపేట చెరువులో 17 అడుగులకు గాను 14.5 అడుగులకు నీటిమట్టం చేరింది. మరో 2 ఫీట్లన్నర నీరు చేరితే మత్తడి పోసే అవకాశాలున్నాయి.



జలకళ ఉట్టిపడుతున్న పాకాలసరస్సు

ఆగస్టు 22 నుంచి కేయూ దూరవిద్య డిగ్రీ పరీక్షలు

కేయూ క్యాంపస్ జూలై 26, (ఆంధ్రజ్యోతి): కేయూ దూరవిద్య కేంద్రం బీఏ, బీకామ్, బీఎస్సీ, బీబీఏ ఇతర కోర్సుల రెగ్యులర్, ఎక్స్ అభ్యర్థుల మొదటి, రెండో, మూడో ఏడాది పరీక్షలు ఆగస్టు 22 నుంచి నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ జి.పద్మజలు శనివారం షెడ్యూల్ వెలువరించారు. ఆగస్టు 22న డిగ్రీ ఫైనల్ ఇయర్ రెగ్యులర్ అభ్యర్థులు, ఎక్స్ అభ్యర్థులకు, ఆగస్టు 23న రెండో ఏడాది రెగ్యులర్, ఎక్స్ అభ్యర్థులకు, ఆగస్టు 25న మొదటి ఏడాది రెగ్యులర్, ఎక్స్ అభ్యర్థులకు పరీక్షలు ప్రారంభమవుతాయని షెడ్యూల్‌లో పేర్కొన్నారు. ఎంపిక చేసిన పరీక్షల కేంద్రాల్లో పరీక్షలు 1, 2, 3 ఏడాది అభ్యర్థులందరికీ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని స్పష్టం చేశారు.

అలాగే డీఐపీ ఇన్ కంప్యూటర్ అప్లికేషన్స్ (డీసీఏ) ఎక్స్ అభ్యర్థులకు పరీక్షలు ఆగస్టు 6 నుంచి నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారులు తెలిపారు. డీసీఏ ప్రాక్టికల్స్ పరీక్షలు ఆగస్టు 21 నుంచి జరుగుతాయని వెల్లడించారు. కేయూ దూరవిద్య కేంద్రం పీజీడీసీఏ రెండో సెమిస్టర్ పరీక్షలు ఆగస్టు 7 నుంచి జరుగుతాయని, అలాగే ప్రాక్టికల్ పరీక్షలు ఆగస్టు 20 నిర్వహిస్తామని అధికారులు పేర్కొన్నారు. ఆగస్టు 6 నుంచి పీజీడీసీఏ మొదటి సెమిస్టర్ పరీక్షలను నిర్వహిస్తామని, అలాగే ఆగస్టు 21 నుంచి ప్రాక్టికల్స్ పరీక్షలను నిర్వహిస్తామని అధికారులు వెల్లడించారు.

ఆగస్టు 6 తేదీ నుంచి దూరవిద్య కేంద్రం అందిస్తున్న డిప్లొమా ఇన్ యోగా పరీక్షలు నిర్వహిస్తామని కేయూ పరీక్షల అధికారులు తెలిపారు. కాగా, ఆగస్టు 6 నుంచి లైబ్రరీ సైన్స్ ఇయర్ వైజ్ ఎక్స్ అభ్యర్థులకు పరీక్షలు జరుగుతాయని కేయూ పరీక్షల నియంత్రణాధికారులు శనివారం షెడ్యూల్ విడుదల చేశారు. అన్ని కోర్సుల అభ్యర్థులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని స్పష్టం చేశారు. ఇతర వివరాలకు కేయూ దూరవిద్య కేంద్రం, కేయూ వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు.

కేయూలో నలుగురికి డిప్యూటీ రిజిస్ట్రార్లుగా పదోన్నతులు

కేయూ క్యాంపస్ జూలై 26, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో అసిస్టెంట్ రిజిస్ట్రార్లుగా పనిచేస్తున్న నలుగురికి డిప్యూటీ రిజిస్ట్రార్‌లుగా పదోన్నతి ఉత్తర్వులను కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం వెలువరించారు. పదోన్నతి పొందిన వారిలో టీచింగ్ విభాగంలో పనిచేస్తున్న పంజాల శ్రీధర్, యూజీసీలో పనిచేస్తున్న హబీబుద్దీన్, అడిట్‌లో పనిచేస్తున్న ఎల్.రాము, పరీక్షలు విభాగంలో పనిచేస్తున్న డాక్టర్ ఎం.నరసింహరావులకు పదోన్నతి లభించింది. ఈ మేరకు పదోన్నతి పొందిన డీఆర్‌లకు కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలు పరిపాలన భవనంలో ఉత్తర్వులను అందచేసి అభినందించారు

కేడీసీలో ప్రాజెక్టు అసిస్టెంట్‌కు దరఖాస్తుల ఆహ్వానం


కేయూ క్యాంపస్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ కేడీసీలో రాజనీతిశాస్త్ర విభాగం ఐసీఎస్ఎస్ఆర్ న్యూఢిల్లీ సహకారంతో చేపట్టే ప్రాజెక్టులో రీసెర్చ్ అసిస్టెంట్‌గా పనిచేసేందుకు అర్హత, ఆసక్తి కలిగిన పరిశోధకులు, డాక్టరేట్ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జి.శ్రీనివాస్, ప్రాజెక్టు డైరెక్టర్ బి.కవితలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు రాజనీతిశాస్త్ర విభాగంలో 55 శాతం మార్కులతో పీజీ, నెట్, ఎంఫిల్, పీహెచ్‌డీతో పాటు రీసెర్చ్ అనుభవం కల్గి ఉన్నవారికి ఎంపికల్లో ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. జూలై 29 వరకు దరఖాస్తులను కేడీసీలో ఇవ్వాలని, 30న ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 99488-57326 నెంబర్‌లో సంప్రదించాలని వారు కోరారు.

ఎంజీఎంలో లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రారంభం

వరంగల్ మెడికల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని పేదలు, వెనుకబడినవర్గాలకు చట్టపరమైన సహాయాన్ని అందించడానికి లీగల్ ఎయిడ్ క్లినిక్‌లు ఉన్నాయని వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీబీ నిర్మలా గీతాంబ అన్నారు. శనివారం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలోని డీఅడిక్షన్ సెంటర్ ఓపీ విభాగంలో లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ప్రారంభించారు. న్యాయ సలహా, ప్రత్యుత్తరాలు, దరఖాస్తులు, పిటిషన్‌లను రూపొందించడంలో సహాయం చేయడం ఈ క్లినిక్ బాధ్యత అని తెలిపారు. ఈ క్లినిక్ ప్రతీ శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.సాయి కుమార్, ఎంజీఎం సూపరింటెండెంట్ కిశోర్, సైకియాట్రీ హెచ్‌వోడీ శ్రీనివాస్, ఆర్ఎంవో అశ్విన్, సైకియాట్రీ ఫ్యాకల్టీ మురళీ క్రిష్ణ, చిన్ని క్రిష్ణ, పారాలీగల్ వలంటీర్ వై.సింధూజ, సిబ్బంది పాల్గొన్నారు.

రాంరెడ్డి నిబద్ధత కలిగిన వ్యాపారి

క్రెడాయి వరంగల్ అధ్యక్షుడు అమరేందర్ రెడ్డి



క్రెడాయి ప్రతినిధుల సమావేశంలో ఐఏఎస్ అధికారి ఆశ్రిత్‌ను సత్కరిస్తున్న దృశ్యం

హనుమకొండ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గుమ్మ రాంరెడ్డి క్రెడాయ్ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నిక కావడం యావత్ తెలంగాణ బిల్డర్స్ సమాజానికి గర్వకారణమని క్రెడాయి వరంగల్ అధ్యక్షుడు నాయిని అమరేందర్ రెడ్డి అన్నారు. రాంరెడ్డి క్రెడాయి జాతీయ అధ్యక్షుడిగా (2025-27) ఎన్నికైన సందర్భంగా శనివారం క్రెడాయ్ వరంగల్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అమరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. రాంరెడ్డి వ్యాపారం పట్ల నిబద్ధతతో పాటు ఆర్కే ఫౌండేషన్ ద్వారా క్రీడాకారులు, సివిల్ సర్వీసెస్ అభ్యర్థులకు ఆర్థిక సహాయం చేసి వారిని ప్రోత్సహించారన్నారు. క్రెడాయి జాతీయ అధ్యక్షుడు రామ్‌రెడ్డి మాట్లాడుతూ.. బిల్డర్‌గా లాభాలకే పరిమితం కాకుండా కొనుగోలుదారుడికి న్యాయమైన ఇల్లు నిర్మించి ఇవ్వడం అత్యంత ఆనందాన్ని ఇస్తుందన్నారు.

కార్యక్రమంలో క్రెడాయి వరంగల్ ప్రధాన కార్యదర్శి శాఖమూరి అమర్ కుమారుడు ఐఏఎస్ అధికారి శ్రీసాయి ఆశ్రిత్ పాల్గొన్న సందర్భంగా ఆయనను ప్రత్యేకంగా సత్కరించారు. కార్యక్రమంలో క్రెడాయి తెలంగాణ అధ్యక్షుడు ప్రేమ్‌సాగర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, ట్రెజరర్ జగన్‌మోహన్, వరంగల్ చైర్మన్ ఎ.తిరుపతి రెడ్డి, అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ రవీందర్ రెడ్డి, రజనీకాంత్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

రెండు ఇళ్లలో చోరీ

ఆరున్నర తులాల బంగారం, లక్ష నగదు అపహరణ

వరంగల్ క్రైం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రెడ్డికాలనీ, యాదవనగర్ క్రాస్‌లోని శ్రీలక్ష్మీకాలనీలో తాళాలు వేసి ఉన్న రెండు ఇళ్లకు గుర్తుతెలియని వ్యక్తులు కన్నం వేసి ఆరున్నర తులాల బంగారంతోపాటు లక్ష నగదును ఎత్తుకెళ్లినట్లు ఎస్సై పరుశురాములు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రెడ్డికాలనీలోని జీవన్ ఆస్పత్రి సమీపంలో నివాసం ఉండే పురోహితుడు శేషాచారి.. అమెరికాలోని తన కుమార్తె ఇంటికి వెళ్లగా శనివారం తెల్లవారుజామున మాస్కులు, గ్లౌజులు ధరించిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగలగొట్టి నాలుగున్నర తులాల బంగారం, లక్ష నగదు ఎత్తుకెళ్లారు. అనంతరం అక్కడే వేరే ఇంట్లో చోరీకి ప్రయత్నించి ఏమీ దొరకకపోవడంతో వెనుతిరిగారు. ఆపై కాలినడకన యాదవనగర్ క్రాస్‌లోని పెట్రోల్ పంపు వెనుకాల ఉన్న శ్రీలక్ష్మీకాలనీకి చేరుకున్నారు. కాలనీలో నివాసం ఉంటున్న ఆర్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ రమేశ్ బంధువుల ఆరోగ్యం బాగలేకపోవడంతో కుటుంబసభ్యులతో కలిసి రెండు రోజులు కిందట ఊరికి వెళ్లగా ఆయన ఇంట్లోకి చొరబడి రెండు తులాల బంగారం చోరీ చేశారు.

పక్కనే ఉన్న మరో ఇంట్లో చోరీ యత్నించి ఏమీ దొరకకపోవడంతో అక్కడి నుంచి పారిపోయారని ఎస్సై వెల్లడించారు. పురోహితుడి ఇంట్లో ఫోన్‌కు ఏర్పాటు చేసుకున్న సీసీ ఫుటేజీ లింకు ఆధారంగా చోరీ జరిగిందని గుర్తించగా, హెడ్‌కానిస్టేబుల్ రమేశ్ ఇంట్లో కిరాయి ఉండే కుటుంబం ఉదయం ఇంటి తలుపులు తీసి ఉండటాన్ని గుర్తించి ఇంటి యాజమానికి సమాచారం ఇచ్చారన్నారు. కాగా, బాధితుల ఫిర్యాదు మేరకు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుల కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు.



ఉల్లెపల్లిలో చెక్‌డ్యామ్ మరమ్మతు పనులకు శంకుస్థాపన చేస్తున్న డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

డిప్యూటీ స్పీకర్ రాంచంద్రునాయక్

మరిపెడ రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని డోర్నకల్ ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ జాటోతు రాంచంద్రునాయక్ అన్నారు. శనివారం మరిపెడ మండలంలోని ఉల్లెపల్లిలో ఆకేరు వాగు చెక్‌డ్యామ్ మరమ్మతులకు రూ.44.45 లక్షలతో, పురుషోత్తమాయగూడెం చెక్‌డ్యామ్ కల్వర్టు మరమ్మతులకు రూ.49.30, రూప్‌సింగ్ ఎస్డీఎఫ్ నిధులతో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాంచంద్రునాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 19 నెలలు కావస్తోందని, సీఎం రేవంత్‌రెడ్డి అనేక సంక్షేమ, అభివృద్ధి పనులు చేశాడన్నారు. గత పదేళ్ల పరిపాలన చేసిన బీఆర్ఎస్ పార్టీ రేషన్‌కార్డులే ఇవ్వలేదని దుయ్యబట్టారు. రాష్ట్రం మొత్తం ఇందిరమ్మ గృహాలతో నిరుపేదలు సంతోషాన్ని వ్యక్తపరుస్తున్నారన్నారు. అంతేకాక సన్న బియంతో కడుపు నిండా తింటున్నారన్నారు. ఆయా కార్యక్రమాల్లో నూకల అభినవ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి, షేక్ అఫ్జల్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోతు రవినాయక్, యూత్ మండల అధ్యక్షుడు నరేశ్‌నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు పెండ్లి రఘువీరారెడ్డి, విసారపు శ్రీపాల్‌రెడ్డి, మెంచు అశోక్‌గౌడ్, అలువాల ఉపేందర్ ప్రజాపతి, మాలోతు బీకునాయక్ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా కొనసాగుతున్న బ్యాడ్మింటన్ టోర్నీ

- సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో ఫైనల్స్‌కు చేరుకున్న షట్లర్లు
- నేటితో ముగియనున్న రాష్ట్ర స్థాయి టోర్నీ



సెమీ ఫైనల్స్ డబుల్స్ విభాగంలో తలపడుతున్న క్రీడాకారులు

వరంగల్ స్పోర్ట్స్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : యోనెక్స్ సన్‌రైజ్ సహకారంతో మహబూబాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ సుబేదారిలోని ఆఫీసర్స్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన 11వ తెలంగాణ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ అండర్-17 బాలబాలికల బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు క్రీడాకారుల మధ్య హోరాహోరీగా కొనసాగుతున్నాయి. క్రీడా పోటీల్లో భాగంగా రెండో రోజు శనివారం ఆఫీసర్స్ క్లబ్, ఎర్రగట్టు గుట్ట సమీపంలోని కిట్స్ కళాశాల వేదికగా ఏర్పాటు చేసిన పోటీల్లో పలు జిల్లాలకు చెందిన షట్లర్లు క్వార్టర్, సెమీ ఫైనల్స్‌లో సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో పాల్గొన్నారని మహబూబాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మూల జితేందర్‌రెడ్డి, డాక్టర్ కొమ్ము రాజేందర్‌లు తెలిపారు. క్వార్టర్, సెమీ ఫైనల్స్‌తో గెలుపే లక్ష్యంగా క్రీడాకారులు పోటీపడుతూ విజయం వైపు దూసుకుపోతూ ఫైనల్స్‌కు అర్హత సాధించారన్నారు. మూడు రోజుల క్రీడా పోటీల నిర్వహణలో భాగంగా ఆదివారం ఆఫీసర్స్ క్లబ్‌లో క్రీడా పోటీల ముగింపు సమావేశం నిర్వహిస్తామన్నారు. ఈ ముగింపు వేడుకలకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో పాటు ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్, అంతర్జాతీయస్థాయి పూర్వపు బ్యాడ్మింటన్ క్రీడాకారులు సీఎం శశిధర్ ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులును ప్రదానం చేయనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పింగిలి రమేష్‌రెడ్డి, కోశాధికారి నాగ కిషన్, టోర్నమెంట్ అబ్జర్వర్లు యూవీఎస్. బాబు, రెఫరీ కె.హనుమంతరావు, మ్యాచ్ కంట్రోల్ చంద్రశేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఫైనల్స్‌కు చేరిన జట్లు

- **అండర్-17 బాలుర సింగిల్స్ విభాగంలో :** శశాంక్ వనమాల (నల్లండ), గిరివాసన్ శరవన్‌కుమార్ (రంగారెడ్డి)పై 10-15, 16-14, 15-8 తేడాతో గెలుపొంది ఫైనల్స్‌కు అర్హత సాధించాడు. యువసూర్య (హైదరాబాద్), తన్మయ్‌నిహల్ ఉత్తం (కరీంనగర్)పై 15-12, 10-15, 15-09 తేడాతో విజయం సాధించాడు.
- **బాలికల సింగిల్స్‌లో.. :** ప్రాంజల నిసర్గ (రంగారెడ్డి), అవిని విక్రమ్ గోవింద్ (రంగారెడ్డి)పై 15-9, 15-11 తేడాతో గెలుపొంది ఫైనల్స్‌కు చేరుకున్నారు. ఆదే విధంగా సరయు సూర్యనేని (హైదరాబాద్), హంసిని చదరం (రంగారెడ్డి)పై 15-12, 10-15, 21-19 తో విజయం సాధించింది.
- **బాలికల డబుల్స్‌లో.. :** ఆరాధ్యరెడ్డి హన్మంతయ్యగారి, అవినిరెడ్డి హన్మంతయ్యగారి (రంగారెడ్డి), హన్సిక ఆవుల, హన్సిక మధురాజన్ (రంగారెడ్డి)పై 15-3, 15-8తో గెలుపొంది ఫైనల్స్‌కు చేరుకున్నారు. శ్రీదేవికాదిశ్య, శృతి (సంగారెడ్డి), జస్మిత్ పెన్నేరు, శ్రీదిత్య (సంగారెడ్డి)పై 15-9, 15-13తో విజయం సాధించి బాలికల డబుల్స్ ఫైనల్స్‌లో తలపడనున్నారు.

శరవేగంగా ఏటీసీల ఏర్పాటు

- చురుకుగా షెడ్ల నిర్మాణ పనులు
- తొలి విడత తొమ్మిది ఐటీఐలలో ఏటీసీల ఏర్పాటు
- ఆరు చోట్ల 90 శాతం పనులు పూర్తి
- మూడు చోట్ల మొదలుకాని పనులు
- ఒక్కొక్క దాని వ్యయం రూ.40 కోట్లు
- ఐటీఐలకు చేరుకున్న ఏటీసీ పరికరాలు





ములుగు రోడ్డులోని ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న ఏటీసీ షెడ్డు

హనుమకొండ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఏడు పారిశ్రామిక శిక్షణా సంస్థల(ఐటీఐ)లో అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్ల(ఏటీసీ) షెడ్ల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడతగా 65 ఐటీఐలలో ఏటీసీ షెడ్ల నిర్మాణ పనులను ప్రభుత్వం చేపట్టింది. రెండో విడత కింద మరో 44 ఐటీఐలలో ఏటీసీలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 10 ఏటీసీలు మంజూరయ్యాయి. వీటిల్లో వరంగల్, హనుమకొండ, కాజీపేట భూపాలపల్లి, ఏటూరునాగారం, వాజేడు, మహబూబాబాద్ ఐటీలలో ఏటీసీ షెడ్ల పనులు దాదాపు 90 శాతం పూర్తయ్యాయి. వరంగల్, హనుమకొండ, కాజీపేట ఏటీసీ షెడ్లు ములుగు రోడ్డులోని ఐటీఐ ప్రాంగణంలోనే నిర్మిస్తున్నారు. ఆగస్టు నెలాఖరు నాటికి పనులు పూర్తయి వీటిలో సెప్టెంబరులో తరగతులు ప్రారంభం కావచ్చునని తెలుస్తోంది. కాగా, జనగామ, పరకాల, వర్ధన్నపేట ఏటీసీలకు స్థలం అందుబాటులో లేకపోవడంతో ఇక్కడ ఏటీసీల పనులు ఇంకా మొదలు కాలేదు. షెడ్ల నిర్మాణం పూర్తయితే ఆ వెంటనే వాటిలో పరికరాలను అమర్చుతారు. పరికరాలు కూడా అప్పుడే వచ్చేశాయి.

ఐటీఐల ఆధునీకరణ

ఐటీలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించుకుంది. ఈ మేరకు టాటా టెక్నాలజీ లిమిటెడ్‌తో(టీటీఎల్) ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. టీటీఎల్ ఒక్కొక్క ఏటీసీని రూ.40 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేస్తోంది. ఇందుకోసం టీటీఎల్ మొత్తం రూ.2,324 కోట్లను వెచ్చిస్తోంది. ఐటీఐ సర్కిల్ డెవలప్‌మెంట్ అప్‌గ్రేడేషన్ ప్రాజెక్టులో భాగంగా ఆధునిక పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు వీటిలో శిక్షణ ఇస్తారు. ఇందుకోసం అధునాతన సామగ్రిని, సాంకేతికతను ఏర్పాటు చేస్తారు. ప్రత్యేక నిపుణులతో ఇందులో విద్యార్థులకు శిక్షణ ఇస్తారు.

ఏటీసీల్లో ఆరు కొత్త కోర్సులు

చేరుకున్న పరికరాలు

ఒకపక్క భవన నిర్మాణ పనులు జరుగుతుండగానే టీటీఎల్ ఏటీసీలో అమర్చాల్సి ఉన్న యంత్ర పరికాలను ఆయా ఐటీఐలకు పంపడం మొదలు పెట్టింది. ఇండస్ట్రియల్ రోబోటిక్స్, అండ్ డిజిటల్ మాన్యుఫాక్చరింగ్, మాన్యుఫాక్టరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమిషన్, మెకానిక్ ఎలక్ట్రికల్ వెహికిల్స్, ఆర్టిషియిన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైర్(మెకానిక్)కు సంబంధించిన రోబోటిక్స్ మిషిన్స్, డిజిటల్ కటింగ్స్ తదితర పరికరాలు వీటిలో ఉన్నాయి. వీటితో పాటు ఏటీసీలో ఒక అధునాతన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో కూడిన కంప్యూటర్ ల్యాబ్‌ను కూడా ఏర్పాటు చేస్తారు. ఇందులో 20 సిస్టమ్స్ ఉంటాయి. ఆటోమొబైల్‌కు కోర్సుకు సంబంధించి బ్యాటరీ చార్జెస్ వెహికిల్ కూడా రానున్నది.



ములుగు రోడ్డులోని ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న ఏటీసీ షెడ్డు

ఐటీఐ విద్యార్థులు పోటీ ప్రపంచంలో ఎదురయ్యే సవాళ్లను తట్టుకొని ఉపాధి అవకాశాలు పొందగలిగేలా వారిలో వృత్తిపరమైన నైపుణ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో ప్రభుత్వం ఐటీఐ సర్కిల్ డెవలప్‌మెంట్ అప్‌గ్రేడేషన్ ప్రాజెక్టును చేపట్టింది. ఇందులో భాగంగా టీటీఎల్ ప్రస్తుత పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా ముఖ్యంగా తమ కంపెనీకి సరిపడే వృత్తి నిపుణులను తయారుచేయడానికి ఆరు అధునాతన ట్రేడ్‌లను ఈ ఏసీటీల్లో ప్రవేశపెట్టనుంది. ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుఫాక్చరింగ్, మాన్యుఫాక్టరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమిషన్, మెకానిక్ ఎలక్ట్రికల్‌వెహికిల్స్, ఆర్టిషియిన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైర్(మెకానిక్) వీటిలో ఉన్నాయి. ఇండస్ట్రియల్ రొబొటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుఫాక్చరింగ్, మాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమిషన్‌లో ఒక్కొక్క దానిలో 40 సీట్లు, మిగతా కోర్సుల్లో 48 సీట్ల చొప్పున ఉంటాయి. ఏటీసీల ఏర్పాటుకు అవసరమైన భవనాలను ఒక్కొక్క దానిని రూ.4.50కోట్ల వ్యయంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తుండగా రూ.35కోట్లతో ఏటీసీల్లో అధునాతన బోధనా పరికరాలను సమకూరుస్తున్నది.

ఆలస్యంగా కాజీపేట ఐటీఐ ఏటీసీ పనులు

కాజీపేటలోని ఐటీఐకి సంబంధించిన ఏటీసీ పనులు 30 శాతం వరకే అయ్యాయి. ఈ ఐటీఐ ఆవరణలో తగినంత స్థలం లేకపోవడంతో మొదట్లో సమీపంలోని సోమిడిలో ఏర్పాటు చేయాలని భావించారు. ఇక్కడ నాలుగైదు చోట్ల ప్రభుత్వ స్థలాల ను పరిశీలించారు. కానీ, అనువైన స్థలం అందుబాటులో లేకపోవడంతో చివరికి దీనిని కూడా ములుగు రోడ్డులోని ఐటీఐ ఆవరణలోనే నిర్మించాలని నిర్ణయించారు. స్థలం ఎంపికలో జరిగిన జాప్యం వల్ల ఏటీసీ పనులు ఆలస్యంగా మొదలయ్యాయి.

సర్వేయర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- నేటి నుంచి మూడు రోజుల పాటు నిర్వహణ
- 302 మంది అభ్యర్థులు హాజరు
- నేడు జీపీవోల పరీక్ష కూడా..
- హాజరుకానున్న 37 మంది అభ్యర్థులు

హనుమకొండ, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : లైసెన్స్‌డు సర్వేయర్ల పరీక్షలు ఆదివారం నుంచి మొదలవుతున్నాయి. ఈ పరీక్షలు మూడు రోజుల పాటు జరుగుతాయి. వీటితో పాటు గ్రామ పంచాయతీ అధికారుల(జీపీవో) పరీక్ష కూడా ఆదివారం జరుగనుంది. తెలంగాణ భూ భారతి చట్టం అమలులో భాగంగా గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికి లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది తెలిసిందే. ఇందులో భాగంగా బీటెక్, ఐటీఐ, సివిల్, పాలిటెక్నిక్ కోర్సులు అభ్యసించిన అభ్యర్థులకు అవకాశం కల్పించింది. జిల్లాలో 313 మంది దరఖాస్తులు చేసుకోగా, వీరిలో 302 మందిని అర్హులుగా గుర్తించారు. వీరికి గత మే 26 నుంచి జూలై 26 వరకు హసన్‌పర్తిలోని సంస్కృతి విహార్‌లో శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఆది, సోమ, మంగళ మూడు రోజులు పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందులో ఉత్తీర్ణులైన వారు లైసెన్స్‌డు సర్వేయర్లుగా ధృవీకరణ పొందిన వారుగా గ్రామాల్లో సర్వే విధులు నిర్వర్తించవచ్చు. ఈ విధానం వల్ల నిరుద్యోగులకు ఉపాధి అవకాశం కల్పించినట్లు అవుతోందని ప్రభుత్వం భావిస్తోంది.

మూడు రకాల పరీక్షలు

అభ్యర్థులకు హాల్ టికెట్లు జారీ చేయడం పూర్తయిందని, హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ సీహెచ్.శ్రీనివాసులు తెలిపారు. పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుంది. మొదటి రోజు ఉదయం థియరీ, మధ్యాహ్నం ప్లాటింగ్ పరీక్ష ఉంటుంది. రెండో, మూడో రోజు కూడా ఉదయం, మధ్యాహ్నం రెండేసి చొప్పున ప్రాక్టికల్ పరీక్షలు ఉంటాయి. పరీక్షా కేంద్రం వద్ద భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. పరీక్షా కేంద్రంలో సీటింగ్ ఏర్పాట్లు కూడా పూర్తయ్యాయి. పరీక్షల నిర్వహణకు మొత్తం 13 గదులను కేటాయిచారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పరీక్షల కోసం 13 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చీఫ్ సూపరింటెండెంట్‌గా వ్యవహరిస్తారు. ఆగస్టు 1 నుంచి 10వ తేదీ వరకు జవాబు పత్రాల మూల్యాంకనం చేసి ఫలితాలను వెల్లడించనున్నారు. ఉత్తీర్ణులైన వారు మండల కేంద్రాల్లో 45 రోజులు అప్రెంటిస్‌షిప్ చేయాల్సి ఉంటుంది. అప్రెంటిస్‌షిప్ తర్వాతే లైసెన్స్‌డ్ సర్వేయర్లుగా ధృవీకరణ పత్రాలు ఇస్తారా? లేక పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వెంటనే ఇస్తారా? అనేది కూడా స్పష్టం కావాల్సి ఉంది.

నేడు గ్రామ పాలనాధికారుల పరీక్ష

గ్రామ పాలనాధికారుల పరీక్ష(జీపీవో) కూడా ఆదివారం ఇదే ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌లో జరుగనుంది. ఇందుకోసం కూడా అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లా నుంచి ఈ పరీక్షకు 37 మంది హాజరుకానున్నారు. వారికి కూడా హాల్‌టికెట్లు జారీ చేయడం పూర్తయింది. వీరి పరీక్ష కూడా ఉదయం 10 గంటల నుంచి మొదలవుతుంది. భూ భారతి చట్టం అమలులో భాగంగా ప్రతీ రెవెన్యూ గ్రామానికి ఒక గ్రామ పాలనాధికారిని నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఏప్రిల్‌లో పూర్వ వీఆర్‌వో, వీఆర్ఏల నుంచి దరఖాస్తులను స్వీకరించిన విషయం తెలిసిందే. వీరికి మే 25న అర్హత పరీక్ష నిర్వహించి జూన్ 2 నుంచి సేవలు మొదలు పెట్టింది. మిగతా ఖాళీలకు నేరుగా ఉద్యోగ ప్రకటన జారీ చేసి భర్తీ చేసే ప్రక్రియలో భాగంగా దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు ఆదివారం పరీక్ష నిర్వహిస్తున్నారు.

కూరల్లో రారాజు



- సాటిలేని అడవి బోడకాకరకాయ
- ఔషధ గుణాలు అధికం
- వ్యాధి నిరోధక శక్తి పెంపు
- కిలో రూ.200ల పైమాటే..
- నెల రోజులు మాత్రమే దిగుబడి
- విరివిగా కొంటున్న వినియోగదారులు

వరంగల్ వ్యవసాయం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : సంవత్సరంలో నెల రోజుల పాటు మాత్రమే అందుబాటులో ఉండే అడవి బోడ కాకరకాయ వచ్చేసింది. అత్యంత రుచిగా ఉండడంతో పాటు ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుండడంతో అందరూ ఇష్టంగా తింటారు. అందుకే దీనికి డిమాండ్ ఎక్కువ. ధర ఎక్కువ అయినప్పటికీ వినియోగదారులు కొనుగోలు చేస్తారు. ప్రస్తుతం మార్కెట్‌లో దీని ధర కిలో రూ.200ల పైనే పలుకుతోంది. ఇవి అటవీ ప్రాంతంలో మాత్రమే లభిస్తాయి. వర్షాకాలంలో మొదలయ్యే దగ్గు, దమ్ము, తుమ్ముల బారి నుంచి రక్షిస్తాయి.

ఔషధ గుణాలు పుష్కలం..

బోడకాకర కాయలో ఔషధ గుణాలు పుష్కలంగా ఉన్నాయి. ఆరోగ్యానికి ఎంతో మేలు. వీటివల్ల ప్రయోజనాలేంటో చూద్దాం.

జీర్ణ వ్యవస్థకు మేలు: బోడ కాకరకాయలో ఫైబర్ అధికంగా ఉండడంతో జీర్ణక్రియ మెరుగవుతుంది. అజీర్తి, గ్యాస్, మలబద్ధకం వంటి సమస్యలను తగ్గిస్తుంది.

రక్తపోటు నియంత్రణ: ఇందులో ఉన్న పొటాషియం, మెగ్నీషియం వంటి ఖనిజాల వల్ల రక్తపోటును స్థిరంగా ఉంచుతుంది. ముఖ్యంగా హై బీపీ ఉన్న వారు ఈ కూరను వారానికి 2-3 సార్లు తీసుకోవచ్చు.

చెక్కర స్థాయిని తగ్గిస్తాయి: మధుమేహ వ్యాధిని నియంత్రించడంలో బోడకాకర కాయలు సహాయ పడుతాయి.

యాంటీ ఆక్సిడెంట్ గుణాలు: ఇందులో ఉండే ప్లావనాయిడ్లు, టానిన్లు శరీరంలో ఉన్న విష పదార్థాలను తొలగించడంలో సహాయ పడుతాయి. క్యాన్సర్ లాంటి వ్యాధులను నిరోధించడంలోనూ సహాయ పడుతాయి.

ఇమ్యూనిటీ పెంపు: ఇందులో ఉండే విటమిన్-సీ, ఐరన్, జింక్ లాంటి పోషకాలు శరీరంలో రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తాయి.

చర్మానికి మేలు: చర్మంపై ఉండే ఫంగల్ లేదా బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్లను తగ్గించడంలో సహాయ పడుతాయి. అలర్జీలు, రాషెస్ వంటి సమస్యల నుంచి విముక్తి లభిస్తుంది.

తక్కువ కాలరీలు: బరువు తగ్గాలనుకునే వారికి మంచి ఆహారం. తక్కువ కొవ్వు, తక్కువ కాలరీలు ఉండడం వల్ల డైట్‌లో చేర్చుకోవచ్చు.

సీజన్‌లో మంచి డిమాండ్ ఉంటుంది..

– వినోద్, వ్యాపారి



వర్షాకాలం వచ్చిదంటే అడవి బోడకాకరకాయ గురించి చాలా మంది ఎదురు చూస్తుంటారు. ఒక్క మాటలో చెప్పాలంటే బోడకాకరకాయ తింటే మాంసం తిన్నంత బరాబర్ అని అంటారు. నెల.. నెల పదిహేను రోజులు మాత్రమే దొరుకుతుంది. సత్తుపల్లి నుంచి దిగుమతి చేసుకుని కిలోపై రూ.20 నుంచి 50 లాభం చూసుకుని విక్రయిస్తాం. ఒక్కోరోజు క్వింటా బోడ కాకరకాయ అమ్ముతాం.

వరి పొలాల్లో శ్రమైక సౌందర్యం

- ఉపాధి బాటలో పశ్చిమబెంగాల్, యూపీ, ఉత్తరాఖండ్, ఎంపీ, బిహార్, జార్ఖండ్ కూలీలు
- కాటారం డివిజన్‌కు వందలాది మైళ్ల దూరం నుంచి వరినాట్ల కోసం రాక
- ఉదయాన్నే వంటలతో సహా పొలాలకు వెళ్లి పనులు
- పురుషులే వేగంగా నాట్లు వేయడం మరో ప్రత్యేకత

కాటారం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : కాటారం డివిజన్ వరి పొలాల్లో భిన్నత్వంలో ఏకత్వంలా 'మినీ భారత్'ను చూస్తున్నారనే దానిలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఉత్తర, మధ్య, తూర్పు భారత దేశ రాష్ట్రాలకు చెందిన వారు ఉపాధి కోసం వందలాది మైళ్ల దూరం కుటుంబాలతో సహా కొందరు, భార్య పిల్లలను వదిలి మరికొందరు తరలిరావడం కనిపిస్తోంది. ఉన్న ఊరు వదిలి.. ఉపాధి కోసం కదిలి.. సీజనల్ ఉపాధి అవకాశాల కోసం కాటారం, మల్హర్ తదితర మండలాల్లోని పల్లెలకు వందలాది మంది పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, బిహార్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, ఒడిశా తదితర రాష్ట్రాల కూలీలు పొలాల బాట పట్టడం విశేషం. కోల్‌కత్తా, నైనిటాల్, నలంద, ఉద్ధంసింగ్‌నగర్, సాత్నా తదితర ప్రాంతాల నుంచి వారు రైళ్లలో వందలాది కిలోమీటర్లు ప్రయాణించి నాట్లు వేసే ఉపాధి బాట పట్టారు. ఆడ, మగ అనే తేడా లేకుండా అందరు నాట్లు వేయడంలో సిద్ధహస్తులు. బ్యాచ్‌లవారీగా వచ్చిన వారిలో పురుషులు 95 శాతం ఉండగా, వరి నాట్లు వేగంగా, కొలతలు తీసినట్లు వేయడం మరో ప్రత్యేకత.

ఉత్తర, మధ్య, తూర్పు భారత్ రాష్ట్రాల నుంచి రాక..

కాటారం డివిజన్‌లోని పలు మండలాల్లో వరి నాట్లు వేయడానికి పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని ఉత్తర, దక్షిణ 24 పరగణాల జిల్లాలు, ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని ఉద్ధంసింగ్‌నగర్, నైనిటాల్, బిహార్ రాష్ట్రంలోని నలంద, గయ, మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని సాత్నా, జార్ఖండ్ రాష్ట్రంలోని చోటా నాగపూర్ తదితర ప్రాంతాల నుంచి బృందాలుగా పలువురు కూలీలు వచ్చారు. సుమారు 1000-1400 కిలోమీటర్ల దూరం నుంచి వచ్చి అలుపు సొలుపు లేకుండా పనులు చేస్తున్నారు. స్థానికులు కొందరు మధ్యవర్తుల సాయంతో కూలీలను రప్పించారు. బ్యాచ్‌ల వారీగా పలువురు కూలీలు వచ్చి వరినాట్లు వేస్తున్నారు. ఒక్కో బృందంలో 14-18 మంది ఉండగా అందులో చాలా మంది పురుషులే కావడం విశేషం. అధిక బృందాల్లో మగ కూలీలే ఉన్నారు. మగ కూలీలు కొలతలు తీసి తాళ్లు కట్టి అత్యంత వేగంగా నాట్లు వేయడం గమనార్హం. తెలంగాణ రాష్ట్రంలో అధిక శాతం మహిళలు నాట్లు వేస్తే పురుషులు నారును మోసి మడుల్లో వేస్తున్నారు. పలు రాష్ట్రాలకు చెందిన మగ కూలీలు మాత్రం మడిలో నారును తీసిన సమయంలోనే ఎవరికి వారే కుచ్చెలుగా చేసుకుని వాటికి రబ్బరు బ్యాండ్లు, నార, గడ్డి తాళ్లు కట్టి వారే తెచ్చుకుని నాట్లు వేస్తుండడం ప్రత్యేకత.





వరినారు తీసి కుచ్చెలు కడుతున్న పశ్చిమబెంగాల్ కూలీలు

ఉదయాన్నే రంగంలోకి..

స్థానికంగా గ్రామాల్లో ఉండే కూలీలు ఉదయం 9-10 గంటల మధ్య నాట్లు వేయడానికి ఇళ్ల నుంచి బయలుదేరుతుంటారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలు మాత్రం ఉదయం 6 గంటలకే పొలాలకు చేరుకుంటున్నారు. వేప పుల్లలు, బ్రష్‌లతో పళ్లు తోముకుని వచ్చి ఒక్కో బిస్కెట్ ప్యాకెట్ తిని పనిలోకి 6.30 గంటలకు దిగుతున్నారు. తాము బస చేసిన చోట తెల్లవారుజామునే లేచిన కూలీలు కాలకృత్యాలు తీర్చుకుని భారీ వంట పాత్రల్లో అన్నం, కూరలు వండుకుని వంటలతో సహా కొందరు నాట్లు వేయడానికి వస్తుండగా, చాలా మంది కూలీలు ఉదయాన్నే పొలాల్లో దిగుతుండగా బస వద్ద ఉన్న వంట మనిషి వంట చేసుకుని భోజనాన్ని నాట్లు వేసే చోటికి తేవడం కనిపిస్తోంది. అందరు కలిసి నారు మడిలో నారు తీసిన వెంటనే కట్టలు కట్టి సంచుల్లో మడుల వద్దకు తీసుకెళ్లి నాట్లు వేస్తున్నారు. భోజన విరామం తప్ప అలుపన్నదే లేకుండా సాయంత్రం 5 గంటల వరకు పనులు చేస్తున్నారు. కాగా, కూలీలను రప్పించిన మధ్యవర్తులు వరినాట్లు వేయించే పొలాల యజమానులతో మాట్లాడి కూలీలను తమ ఆటోల్లో పొలాల వద్ద దింపేసి వెళ్తున్నారు. కూలీల బృందాలకు వంట సామగ్రి, నిత్యావసరాలు అందిస్తున్న వారు ఎకరానికి కొంత కమీషన్ తీసుకుంటూ మిగతా డబ్బులు కూలీలకు చెల్లిస్తున్నట్లు సమాచారం. కాగా తాము వేసిన నాట్లకు సంబంధించిన కూలీ డబ్బు లెక్కలు రెండు మూడు రోజులకోసారి చేయడం జరుగుతుందని కూలీల బృందాల నాయకులు తెలిపారు.



పొలంలో తాళ్లు కట్టి నాటు వేస్తున్న ఉత్తరాఖండ్ పురుషులు

ఐదెకరాల నాటుకు 10-12 మంది కూలీలే..

స్థానికంగా కూలీలు వరి నాట్లు వేయడంలో ఎకరాకు ఐదుగురు, ఆరుగురు అవసరం పడుతుంటారు. కానీ, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన మగ కూలీలు ఎకరాకు ఇద్దరు, ముగ్గురు చొప్పున నాట్లు వేస్తున్నారు. ఐదెకరాల పొలంలో నాట్లు 10 నుంచి 12 మంది కూలీలే వేయడం గమనార్హం. కాగా, ఈ కూలీలు మడుల్లో తాళ్లు కట్టి లైన్ కొద్దీ నాట్లు వేస్తున్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు చెప్పినట్లుగా తూర్పు, పడమర దిక్కుల్లో కాలి బాటలు వదిలి నాట్లు వేయడం జరుగుతోంది. ఒక్కో బృందం 8-9 ఫీట్ల పొడవు, 8-9 ఫీట్ల వెడల్పు స్థలంలో 144-156 కుదుళ్ల వచ్చేలా నాట్లు వేస్తున్నారు. పొలాల యజమానులు వెంట ఉండి తమకు నచ్చిన రీతిలో నాట్లు వేయించడం జరుగుతోంది.

నెలలో రూ.40వేల వరకు వస్తాయి..



కోల్‌కత్తా సమీపంలోని గ్రామం నుంచి నాట్లు వేయడానికి వచ్చాం. ఈ ప్రాంతానికి గతేడాది నుంచి వస్తున్నాం. నెలలో నాట్లు వేస్తే కూలీ డబ్బులు రూ.30వేల నుంచి రూ.40వేలు వస్తాయి. డబ్బులను ఫోన్ పే ద్వారా ఇళ్లకు పంపిస్తాం.

– గోవింద్‌రాయ్, కూలీ, దక్షిణ 24 పరగణాల జిల్లా, పశ్చిమబెంగాల్

1,400 కి.మీ. దూరం నుంచి వచ్చాం..



ఉపాధి బాటలో నాట్లు వేయడానికి 1,400 కిలోమీటర్ల దూరం నుంచి రైళ్లలో 26 గంటలు ప్రయాణం చేసి వచ్చాం. నాట్లు వేగంగా, ఖచ్చితమైన కొలతలతో వేస్తాం. బ్యాచ్‌లో 14 మంది ఉండగా 13 మంది నాట్లు వేస్తే, ఒక మనిషి వంట చేయడానికి ఉంటాడు. ఉదయం 6గంటలకే పొలం వద్దకు వచ్చి పనులు మొదలెడతాం.

– నిశికాంత్ దాలీ, ఉద్ధంసింగ్‌నగర్ జిల్లా, ఉత్తరాఖండ్

ఓపెన్ స్కూల్ వరప్రదాయిని

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : అనివార్య కారణాలతో మధ్యలోనే స్కూల్ మానేసిన వారికి ఓపెన్ స్కూల్ వరప్రదాయిని అని టీచర్స్ ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. శనివారం వరంగల్ డీఈవో కార్యాలయం ఎదుట ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ సదానందం, డీఈవో జ్ఞానేశ్వర్ తదితరులతో కలిసి ఓపెన్ స్కూల్ అడ్మిషన్ క్యాలెండర్‌ను శ్రీపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓపెన్ స్కూల్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవీందర్‌రెడ్డి మహేందర్‌రెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు తిరుపతిరెడ్డి, శ్రీహరి, ఏఎంవో సుజన్‌తేజ తదితరులు పాల్గొన్నారు.



ఓపెన్ స్కూల్ అడ్మిషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

కేయూ రిజిస్ట్రార్‌కు సన్మానం

కేయూ క్యాంపస్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెంలోని డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ యూనివర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా నియమితులైన కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం సేవలు అమోఘమని దూరవిద్య కేంద్రం ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొట్టే భాస్కర్ కొనియాడారు. ఈ మేరకు శనివారం వల్లూరి రామచంద్రంను కలిసి పుష్పగుచ్ఛం, శాలువా అందచేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎంహెచ్‌ఆర్‌ఎం బీవోఎస్ చైర్మన్ చీకటి శ్రీను, వడ్డెపల్లి మోహన్, బి.ఉమాశంకర్, నాగరాజుపటేల్, సూత్రాపు అనిల్ తదితరులు పాల్గొన్నారు.



రిజిస్ట్రార్‌ను సన్మానిస్తున్న భాస్కర్

ఐటీఐలో ఉచిత హెల్త్ క్యాంపు

కాజీపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కాజీపేట ప్రభుత్వ ఐటీఐలో శనివారం ఉచిత హెల్త్‌క్యాంపు జరిగింది. ఈ హెల్త్ క్యాంపులో ఐటీఐ విద్యార్థులకు, స్థానికులు 150 మందికి ఉచితంగా పరీక్షలు చేశారు. మందులు పంపిణీ చేశారు. అనంతరం నిర్మాన్ ఆర్గనైజేషన్ సంస్థ విద్యార్థులకు వృత్తిపరమైన ఉద్యోగ అవకాశాలు గురించి వివరించారు. కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వరరావు, ఐటీఐ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సరిపడా అందుబాటులో యూరియా : ఏవో

హసన్‌పర్తి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు ఆందోళన పడవద్దని ఏవో అడ్లూరి అనురాధ అన్నారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో యూరియా కృత్రిమ కొరత సృష్టించే విధంగా ప్రచారం జరుగుతున్న విషయంపై ఆమె స్పందించారు. మండలంలోని ఐదు (హసన్‌పర్తి, వంగపహాడ్, మల్లారెడ్డిపల్లి, వంగపహాడ్, ముచ్చర్ల, పెగడపల్లి) సొసైటీల ద్వారా రైతులకు ఈ సీజన్‌కు సరిపడా యూరియాను అందిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే సొసైటీల ద్వారా 450 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంచామని చెప్పారు.

పింగళి కళాశాల కార్యశాల పోస్టర్ ఆవిష్కరణ

కేయూ క్యాంపస్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఆగస్టు 13, 14 తేదీల్లో వడ్డెపల్లిలోని పింగళి మహిళ డిగ్రీ, పీజీ కళాశాలలో నిర్వహించనున్న రెండు రోజుల కార్యశాల పోస్టర్‌ను శనివారం కేయూ పరిపాలన భవనంలో వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం చేతుల మీదుగా ఆవిష్కరిచారు. కాకతీయాస్ టెంపుల్స్- ఆర్ట్స్ అండ్ ఆర్కిటెక్చర్ అనే అంశంపై జరిగే కార్యశాల పోస్టర ఆవిష్కరణ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి. చంద్రమౌళి, కె.శ్రీనివాస్, రామకృష్ణారెడ్డి, సుహసిని, సురేశ్‌పాటు, కట్ల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇళ్లు

హనుమకొండ చౌరస్తా, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు హనుమకొండ 9వ డివిజన్‌లోని రాయపుర మైసమ్మ దేవాలయం ఎదురుగా నివాసం ఉంటున్న అన్నదమ్ములు ఆకుల ప్రవీణ్, సుధాకర్, అశోక్‌లకు చెందిన ఇళ్లు శనివారం తెల్లవారుజామున కూలిపోయాయి. నిరుపేద కుటుంబానికి చెందిన ముగ్గురు అన్నదమ్ములు వారి పిల్లలతో కొన్ని ఏళ్లుగా ఒకే ఇంట్లో ఒక్కే గదిలో నివాసం ఉంటున్నారు. ఇళ్లు కూలిపోయిన సమయంలో ఆ గదిలో ఎవ్వరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం నుంచి బయటపడ్డామని వారు చెప్పారు. వర్షం కారణంగా ఇళ్లు నేలమట్టం కావడంతో అందులో ఉన్న సామాన్లు పూర్తిగా ధ్వంసమైనట్లు కటుంబసభ్యులు కన్నీళ్ల పర్యంతమయ్యారు. రెక్కాడితే గాని డొక్కాడని తమ కుటుంబాన్ని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ప్రభుత్వం ఆదుకోని సహాయం అందించాలని వారు వేడుకుంటున్నారు.



హనుమకొండ 9వ డివిజన్ రాయపురలో వర్షానికి కూలిన ఇళ్లు

మత్తు పదార్థాల నివారణపై అవగాహన

కాజీపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కాజీపేట ప్రభుత్వ పాఠశాలలో శనివారం మత్తు పదార్థాల నివారణ, ఆన్‌లైన్ బెట్టింగ్‌పై జాగృతి పోలీస్ కళాబృందం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శివ మాట్లాడారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్, గుట్కా, ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్స్‌కు దూరంగా ఉండాలని, సైబర్ మోసాల బారిన పడొద్దని చెప్పారు. సైబర్ మోసాలకు గురైతే 1903 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని చెప్పారు. అనంతరం పోలీస్ కళాబృందాలు పాడిన పాటలు పలువురిని ఆలోచింపచేశాయి. విద్యార్థులతో మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పోలీసులు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్‌మాస్టర్ బి.నర్సయ్య, అధ్యాపక బృందం నాగరాజు, వెంకటరమణ, ఎస్సైలు శ్రీధర్, జోయల్, సుధాకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌సీసీ స్టూడెంట్స్ కార్గిల్ విజయ దివస్

కేయూ క్యాంపస్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కేయూ పాత అడ్మిషన్ల డైరెక్టరేట్ ఆవరణలో శనివారం 10వ తెలంగాణ బెటాలియన్, ఎన్‌సీసీ వరంగల్ గ్రూప్ నేతృత్వంలో కార్గిల్ విజయదివాస్‌ను నిర్వహించారు. కేయూలో 10 రోజుల పాటు నిర్వహించిన ఎన్‌సీసీ క్యాంప్‌లో భాగంగా శనివారం కార్గిల్ విజయ దివాస్‌ను నిర్వహించారు. ఆర్మీ ధైర్య సాహసాలతో 1999 జూలై 26న టైగర్‌హిల్స్‌పై భారత జాతీయ జెండాను రెపరెపలాడించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు రామదురై రవి సునారే, సతీశ్, సదానందం, జైరామ్‌సింగ్, రవీందర్, సౌరస్య, అజిత్, సందీప్, గణేశ్, రాధాకృష్ణ, రాజమాణిక్యం, జీవన్, సంధ్య, కల్యాణి, అరుణ, కుమాస్వామి, సతీశ్, నిక్లేశ్ పాల్గొన్నారు.

వృద్ధాప్యం ఎవరికీ శాపం కారాదు

- జిల్లా జడ్జి డాక్టర్ కె.పట్టాభిరామారావు
- సహృదయ వృద్ధాశ్రమంలో ఆత్మీయ స్పర్శ కార్యక్రమం
- సీనియర్ సిటిజన్స్ చట్టంపై అవగాహన

హనుమకొండ, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : వృద్ధాప్యం ఎవరికీ శాపంగా మారకూడదని జిల్లా జడ్జి డాక్టర్ కె.పట్టాభిరామారావు అన్నారు. శనివారం కాజీపేటలోని సహృదయ వృద్ధాశ్రమంలో సీనియర్ సిటిజన్స్ చట్టంపై అవగాహన, ఆత్మీయ స్పర్శ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన జడ్జి డాక్టర్ పట్టాభిరామారావు మాట్లాడుతూ.. వయోవృద్ధులను వేధిస్తే కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. ట్రిబ్యునల్ బెంచ్ సీనియర్ సిటిజన్స్‌కు ఒకవరం లాంటిదన్నారు. సీనియర్ సిటిజన్స్‌కు ఏ సమస్యలు వచ్చినా ట్రిబ్యునల్ బెంచ్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. తల్లిదండ్రుల బాధ్యత కచ్చితంగా పిల్లలదేనని, విస్మరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. జడ్జి ఆత్మీయంగా అందరిని పలకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గౌరవ అతిథిగా హాజరైన జిల్లా లీగల్ సెల్ అథారిటీ జడ్జి క్షమా దేశ్‌పాండే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అవసరార్థులకు ఉచిత న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. వయోవృద్ధులకు చట్టం, ట్రిబ్యునల్ గురించి అవగాహన కల్పించారు.

సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ సభ్యురాలు డాక్టర్ అనితారెడ్డి మాట్లాడుతూ.. వయో వృద్ధుల చట్టం, ట్రిబ్యునల్ బెంచ్ పట్ల గ్రామ స్థాయి నుంచి ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. సీనియర్ సిటిజన్లు తమ హక్కుల గురించి తెలుసుకోవాలన్నారు. సహృదయ వృద్ధాశ్రమ నిర్వాహకులు చోటే, యాకూబ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



సహృద వృద్ధాశ్రమంలో సీనియర్ సిటిజన్స్ చట్టాలపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా జడ్జీలు

మడికొండలో అనుమతి లేని క్లినిక్ సీజ్

వరంగల్ మెడికల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మడికొండలో ప్రథమ చికిత్స పేరుతో దవాఖాన, ల్యాబోరేటరీ నిర్వహిస్తున్న సాయిశ్రీ క్లినిక్‌ను జిల్లా వైద్యాధికారి డాక్టర్ అప్పయ్య తనిఖీ చేసి సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్లినిక్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం ప్రకారం లోబడి పని చేయాలని తెలిపారు. ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే అందించాలని అన్నారు. ఈ తనిఖీల్లో స్టాటిస్టికల్ ఆఫీసర్ ప్రసన్న, విప్లవ్‌కుమార్, ఓంప్రకాశ్ పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత అలవర్చుకోవాలి

మడికొండ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): వర్షాకాల సీజన్‌లో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు వారి వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య సూచించారు. మడికొండలోని మండల ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న స్కూల్ హెల్త్ క్యాంపును శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అప్పయ్య మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులకు సంబంధించి, వ్యక్తిగత పరిశుభ్రతను విద్యార్థులకు వివరించినట్లయితే అది వారి కుటుంబ సభ్యుల వరకు చేరుతుందన్నారు. అలాగే రోడ్డుపై ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా విక్రయిస్తున్న ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలని తెలిపారు. అనంతరం స్థానిక ఆయుష్మాన్ మందిర్‌ను సందర్శించి వారు అందిస్తున్న సేవలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. వైద్య సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి తగిన సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లారెడ్డి, డాక్టర్ ఓంప్రకాష్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్‌ను సందర్శించిన డీడబ్ల్యూవో

న్యూశాయంపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ హంటర్ రోడ్డులోని మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలను శనివారం జిల్లా మైనారిటీల సంక్షేమఅధికారి (డీడబ్ల్యూవో) గౌస్‌హైదర్ సందర్శించారు. ఈ సందర్భంగా స్కూల్‌లోని వంట గదిని పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కొద్దిసేపు బాలికలతో మాట్లాడి అన్ని సౌకర్యాలున్నాయా అని తెలుసుకున్నారు. విద్యార్థినీలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నీరజ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



వంట గదిని పరిశీలిస్తున్న డీడబ్ల్యూవో గౌస్‌హైదర్

ఆదివాసీ ఎరుకల అభివృద్ధికి కృషి చేయాలి

వడ్డెపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): సమాజానికి దూరంగా ఆర్థిక అసమానతలతో వెనుకబడిపోయి జీవిస్తున్న ఆదివాసి ఎరుకల అభివృద్ధికి పాలక మండలిని ఏర్పాటు చేసి, రూ.500 కోట్ల బడ్జెట్ కేటాయించాలని ఎరుకల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరాయ సాయిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. ఏకలవ్య కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి తమ కులస్థులకే కేటాయించాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో మొదటి ప్రాధాన్యత ఎరుకల కులస్తులకు ఇవ్వాలని కోరారు. మైదాన ప్రాంతంలోని ఆదివాసీ ఎరుకల కులస్థులకు సంక్షేమ పథకాలు అందని ద్రాక్షగా మారాయని అన్నారు. ఆగస్టు 3న ఉదయం 10 గంటలకు హైదరాబాద్ బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే ఎరుకల హక్కుల పోరాట సమితి 29వ ఆవిర్భావ దినోత్సవంలో రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి ఎరుకల కులస్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని దేవరాయ సాయిలు పిలుపు నిచ్చారు. సమావేశంలో ఎరుకల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రతినిధి పులిశేరి నరేందర్, జిల్లా నాయకులు మానుపాటి సదయ్య, కేతిరి రమేష్, రాయపురం సురేష్, కూరాకుల సమ్మయ్య, మానుపాటి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

మడికొండ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని కాజీపేట ఎంఈవో బండారు మనోజ్‌కుమార్ అన్నారు. కాజీపేట మండలం కడిపికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థి నేతల ఎన్నిక నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయుడు, ఎంఈవో మనోజ్ కుమార్ వెల్లడించారు. బాలుర విభాగంలో నలుగురు పోటీపడగా ఎల్.సందీప్ కుమార్, బాలికల విభాగంలో నలుగురు పోటీ పడగా బి.ప్రతిషా ఎన్నికయ్యారని తెలిపారు. అలాగే స్కూల్ కేబినెట్ సభ్యులుగా ఎన్నికైన విద్యార్థులతో ప్రమాణస్వీకారం చేయించినట్లు తెలిపారు.కార్యక్రమంలో విద్యాశాఖ కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ బద్దం సుదర్శన్‌రెడ్డి, వాసవీ క్లబ్ గవర్నమెంట్ బాడీ మెంబర్స్ సాంబమూర్తి, సంపత్‌కుమార్, ఉపాధ్యాయులు బీవీ.రాజగోపాల్, స్టాఫ్ సెక్రటరీ ఎ.శ్రీనివాస్, మాధవీలత, సురేందర్, నవీన్‌కుమార్, సదానందం, అనిత, రాజశ్రీ, వాణిశ్రీ, రేణుకాదేవి, రిజ్వాన, వీరభద్రయ్య, ప్రశాంతి, శ్వేత పాల్గొన్నారు.

మత్తడి పోస్తున్న సోమిడి చెరువు

కాజీపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో కాజీపేట సమీపంలోని సోమిడి చెరువుకు మత్తడి పోస్తోంది. ఈ మత్తడిలో చేపలు పట్టేందుకు జాలరులు చెరువు మత్తడి వద్దకు వచ్చి చేపలు పడుతున్నారు. మత్తడి చూసేందుకు స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల వారు అక్కడు చేరుకుని ఫొటోలు తీసుకుంటున్నారు. నీటి ఉధృతి పెరిగితే పర్యాటకులు అటుగా వెళ్లకుండా ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్‌రెడ్డి బృందం మత్తడి చెరువును సందర్శించి చర్యలు తీసుకుంటున్నారు.



కాజీపేట సమీపంలో మత్తడి పోస్తున్న సోమిడి చెరువు

ధర్మాన్ని ఆచరించాలి

- వేయిస్తంభాల ఆలయంలో మండలేశ్వర స్వామి ఉద్బోధ

హనుమకొండ కల్చరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): సకల శుభాలనిచ్చే శ్రావణమాస వేళ చారిత్రక ప్రసిద్ధిచెందిన వేయిస్తంభాల రుద్రేశ్వరుడి సన్నిధిలో గడపడం ఆనందంగా ఉందని సమాజంలో ప్రతీఒక్కరు ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని విధిగా ధర్మాన్ని ఆచరించాలని చిత్రకూటేశ్వర్ సంస్థాన్ పీఠాధిపతులు, పరివ్రాజక ఆచార్య మండలేశ్వరస్వామి అన్నారు. శనివారం రాత్రి ఆయన ప్రదోషకాల సమయంలో వేయిస్తంభాల ఆలయాన్ని సందర్శించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ, ఇతర అర్చకులు ఆలయ మర్యాదలతో అపూర్వంగా స్వాగతించారు. రుద్రేశ్వరుడి సన్నిధిలో స్వామి ప్రత్యేకంగా రుద్రార్చన స్వయంగా నిర్వహించుకోవడం విశేషం. అనంతరం ఆలయ నాట్యమండపంలో భక్తునుద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. సృష్టిలో కోట్లాది ప్రాణులున్నా ఏ ప్రాణికి లేని ఉన్నతమైన గుణాలు కేలం సార్థకమైన మానవజన్మకే ఉన్నాయన్నారు. మానవ జీవన ప్రగతికి ధర్మ, మానవ సేవమే మాధవ సేవగా నిష్కలంగా మనసుతో ప్రేమతో చేసే సేవే పరమార్థమని పేర్కొన్నారు. ప్రతీ మనిషి మహిమాన్వితుడిగా ఇతరులకు ఆదర్శంగా ఉంటే సృష్టి అంతా సకల సుఖ ఐశ్వర్యాలతో గుభాలిస్తుందని చెప్పారు. ప్రస్తుత సమాజం ఆధునిక దృశ్య మాధ్యమాల వలలో చిక్కుకొని విశృంఖలంగా ప్రవర్తిస్తున్న తీరు ముఖ్యంగా యువతకు అనుసరణీయం కాదన్నారు. ఆయన వెంట షిరిడీ సాయి ట్రస్ట్ చైర్మన్ గోపాలకృష్ణ చైతన్యదాస్ ఉన్నారు.



స్వామిజీని సత్కరిస్తున్న గంగు ఉపేంద్రశర్మ

అణుశాస్త్రవేత్తగా నాయిని కమల్

(5వ పేజీ తరువాయి)

పబ్లిక్ స్కూల్, ఐదు నుంచి పదో తరగతి వరకు గ్రీన్ వుడ్ స్కూల్ (ఆల్ ఇండియా 49వ ర్యాంక్, డిస్ట్రిక్ట్ టాపర్), ఇంటర్ హైదరాబాద్, బీటెక్ ఐఐటీ భువనేశ్వర్‌లో పూర్తి చేశారు. కేంద్ర మంత్రి దేవేంద్ర ప్రధాన్ చేతుల మీదుగా ఇనిస్టిట్యూషన్ సిల్వర్‌మెడల్ అందుకున్నారు.

బీ.టెక్ పూర్తి కాగానే స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ నుంచి ఆఫర్ వచ్చినా, కమల్ కొన్ని కారణాల వల్ల వెళ్లలేదు. తర్వాత ముంబైలో ఉన్న కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన బార్క్‌లో న్యూక్లియర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో ఓరియెంటేషన్ కోర్సు చేసి ప్రథమ స్థానంలో నిలిచి హోమీబాబా మెడల్ అదుకున్నారు. ఈ క్రమంలోనే ఆయన బార్క్‌లో కార్బన్ మెటీరియల్ ల్యాబ్ అసిస్టెంట్ సైంటిస్ట్‌గా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కమల్‌ను పలకరించగా.. 'విదేశాల నుంచి ఆఫర్లు వస్తున్నాయి... కానీ, వెళ్లాలనుకోవడం లేదు.. నా దేశం కోసం పని చేయాలనుకుంటున్న... తల్లిదండ్రులు, మాతృభూమి రుణం తీర్చుకుంటా..' అని తెలిపారు. గుమస్తా కుటుంబం నుంచి వచ్చి సైంటిస్ట్‌గా ఎదిగిన కమల్‌ను పలువురు ప్రశంసిస్తున్నారు.

ఒక్క సీసీ కెమెరా వంద మందితో సమానం

వరంగల్ క్రైం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఒక్క సీసీ కెమెరా వంద మందితో సమానమని హనుమకొండ ఏసీపీ నరసింహారావు అన్నా రు. రెడ్డికాలనీలోని సమ్మక్క సెంటర్‌లో కాలనీవాసులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఏసీపీ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను అరికట్టవచ్చన్నారు. నేరస్థులను గుర్తించడంలో సీసీ కెమెరాలు కీలకంగా పనిచేస్తాయన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు కాలనీవాసులు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ ఎం.శివకుమార్, ఏఎస్సై రఘునారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే సీసీ కెమెరాల ఏర్పాటుకు కాలనీవాసులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని హనుమకొండ సీఐ మచ్చ శివకుమార్ కోరారు. కమ్యూనిటీ పోలీసు కార్యక్రమంలో భాగంగా శనివారం 54వ డివిజన్‌లోని శ్రీనగర్‌కాలనీలో ప్రజలతో సమావేశంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలు జరగకుండా కట్టడి చేయవచ్చన్నారు. ప్రతీ కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ప్రజలను కోరారు.



మాట్లాడుతున్న సీఐ శివకుమార్

మహితాపురం జలపాతం వద్ద చిక్కుకున్న విద్యార్థులు

వెంకటాపురం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహితాపురం జలపాతాన్ని తలకించేందుకు వచ్చిన విద్యార్థులు అడవిలో తప్పిపోయిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. వరంగల్ నిట్ కాలేజీకి చెందిన ఏడుగురు ఇంజనీరింగ్ విద్యార్థులు మహితాపురం జలపాతం సందర్శనకు వచ్చారు. గూగుల్ మ్యాప్ సహాయంతో అక్కడికి వెళ్లారు. ఈ క్రమంలో తిరిగి వచ్చేటప్పుడు చీకటి పడటంతో అడవిలో తప్పిపోయారు. దీంతో డయల్ 100కు ఫోన్ చేయటంతో అప్రమత్తమైన వెంకటాపురం పోలీసులు అటవీ శాఖ సిబ్బందికి సమాచారం అందించారు. తప్పిపోయిన విద్యార్థుల కోసం పోలీసులు, అటవీశాఖ సిబ్బంది మహితాపురంఅడవిలో జోరు వర్షంలోనూ గాలించారు. చివరకు వారి ఆచూకీ లభించడంతో ఊపిరి పీల్చుకున్నారు. విద్యార్థులను సురక్షితంగా అడవి నుంచి బయటకు తీసుకొచ్చారు.

విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి

న్యూశాయంపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు విద్యార్థి దశనుంచే క్రమ శిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని నోవార్టీస్ హెల్త్ కేర్ గ్లోబల్ హెడ్ శ్రీనివాస్ తక్కల్ అన్నారు. ములుగు రోడ్డులోని ఎల్‌బీ కళాశాలలో శనివారం ప్రిన్సిపాల్, అధ్యాపకులు శ్రీనివాస్ తక్కల్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఎల్‌బీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆరుణడీహెచ్‌రావు, కళాశాల సెక్రటరీ ఎన్.వినయ్‌కుమార్, కోశాధికారి ఎన్.రమేష్, ఎగ్జిబిషన్ సొసైటీ మెంబర్ రాజశేఖర్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.రాజేందర్‌రెడ్డి, అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తుల పట్టివేత

మడికొండ, జూలై 26(ఆంధ్రజ్యోతి): మడికొండలోని కిరాణా షాప్‌లో ప్రభుత్వం నిషేధించిన పొగాకు ఉత్పత్తులను పట్టుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ తెలిపారు. స్థానిక నెహ్రూనగర్‌కు చెందిన వ్యాపారి రాజేశ్వర్‌రావు కిరాణా షాపులో నిషేధిత పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు శనివారం పోలీసులు వెళ్లి తనిఖీ చేశారు. రూ.7వేల విలువ గల అంబర్, గుట్కా ప్యాకెట్లు లభించాయని తెలిపారు. వాటిని స్వాధీనం చేసుకొని రాజేశ్వర్‌రావుపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

సైబర్ క్రైంపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

న్యూశాయంపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైబర్ క్రైంపై అప్రమత్తంగా ఉండాలని సుబేదారి ఎస్సై మహేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండ హంటర్ రోడ్డులోని మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో శనివారం డిజిటల్ లిటరసీ అండ్ సైబర్ సెక్యూరిటీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు సైబర్ క్రైం నేరాలపై అవగాహన కలిగి ఉండాలని, క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మిషన్ కో ఆర్డినేటర్ కల్యాణి, కళాశాల ప్రిన్సిపాల్ శిరీష, మహిళా సాధికారత కేంద్ర సిబ్బంది స్వర్ణలత, మానస, బోధన సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తకు బియ్యం పంపిణీ

కాజీపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న కాజీపేట 47వ డివిజన్ బాపూజీనగర్‌కు చెందిన కాంగ్రెస్ కార్యకర్త నీలం భానుచందర్‌కు శనివారం కాంగ్రెస్ నాయకులు 25 కిలోల బియ్యం పంపిణీ చేశారు. పసునూరి మనోహర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పంపిణీలో నాయకులు సిరిల్ లారెన్స్, ఇప్ప శ్రీకాంత్, సిలువేరు విజయ్ భాస్కర్, దొంగల కుమార్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే నాయిని గెలుపుకోసం భానుచందర్ కృషి చేశారన్నారు.

మ్యాన్‌హోల్స్ ముప్పు

(5వ పేజీ తరువాయి)

మారాయి. చాలాచోట్ల వృద్ధులు, స్కూల్ పిల్లలు చూడకుండా మ్యాన్‌హోల్స్‌లో పడిపోయి ప్రమాదాలకు గురైనట్టు తెలిసింది. కొందరు ద్విచక్ర వాహనదారులు కూడా గుర్తించకుండా మ్యాన్‌హోల్స్‌లో పడిపోయి ఆస్పత్రుల పాలైనట్టు తెలిసింది. ఇంతెజార్‌గంజ్ పీఎస్ సమీపంలో తెరుచుకున్న మ్యాన్‌హోల్‌లో ఇటీవల ఓ స్కూల్ చిన్నారి పడిపోవడంతో పక్కనే ఉన్న పాన్‌షాప్ యజమాని వెంటనే స్పందించి రక్షించాడు. కాకాజీకాలనీలో ఆస్పత్రికి వచ్చిన దంపతులు మ్యాన్‌హోల్‌లో పడి గాయాలపాలయ్యారు.

అధికారుల సూచనలు..

జీడబ్ల్యూఎంసీ పరిధిలో నివసించే ప్రజలు వర్షాకాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలండాలని ఇంజనీరింగ్ అధికారులు సూచిస్తున్నారు. వర్షాకాలంలో రోడ్డుపై నడిచే సమయంలో ముందు చూసి నడవాలి... రోడ్లపై నిలిచిన నీటిలో ఎట్టి పరిస్థితిలో ప్రయాణాలు చేయకూడదు... రాత్రి సమయాల్లో ప్రయాణించే సమయంలో టార్చిలైట్లు, మొబైల్ ఫోన్ లైట్ల సహాయంతో జాగ్రత్తగా వెళ్లాలి... ప్రధానంగా బస్‌స్టేషన్లు, రైల్వే స్టేషన్లు, ఆసుపత్రులు, స్కూల్‌జోన్లు, ప్రధాన రహదారి వెంబడి మ్యాన్‌హోల్స్ తెలిచి ఉన్నాయా? లేవా..? అని పరీక్షించిన తర్వాతనే ప్రయాణించాలి.. అని ఇంజనీరింగ్ అధికారులు సూచిస్తున్నారు. వర్షాకాలంలో పిల్లలు రోడ్లపైకి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.. నీటితో నిండిన ప్రాంతాల్లో రోడ్లపై నడక నిషేధించాలి... ద్విచక్ర వాహనదారులు భారీగా నీరు నిలిచిన ప్రాంతాల్లో వాహనం నడపరాదు... ఎక్కడైనా మ్యాన్‌హోల్ తెరుచుకుని ఉంటే సంబంధిత మునిసిపల్ అధికారులకు గానీ జీడబ్ల్యూఎసీ టోల్ ఫ్రీ నెంబర్ 1800 4251 980, 9701999645, 9701999676కు సమాచారం ఇవ్వాలి.. అని ఇంజనీరింగ్ అధికారులు సూచిస్తున్నారు.

నగర పరిస్థితి..

- జీడబ్ల్యూఎంసీలో మ్యాన్‌హోల్స్ - 840
- మహానగర పాలక సంస్థ జనాభా - 14లక్షల పైచిలుకు
- కాలనీలు - 1980
- నగర విస్తీర్ణం 407.8 చదరపు కిలోమీటర్లు
- ట్రైసిటీ నుంచి ప్రతీ రోజు వెలువడే వర్షపు, మురుగు నీరు - 300 ఎంఎల్‌డీలు
- మురుగు కాల్వలు- 3500 కిలో మీటర్లు
- నివాస గృహాలు - 3.16 లక్షలు






భలే భలే బుగాడి!

బుగాడి అనేది సంప్రదాయ చెవి ఆభరణం. తెలుగు రాష్ట్రాలతోపాటు దేశంలోని చాలా ప్రాంతాల్లో సాంస్కృతికంగా, ఆధ్యాత్మికంగా ఈ బుగాడికి ఎంతో ప్రాధాన్యం ఉంది. ముఖ్యంగా దీన్ని స్త్రీత్వానికి, సౌందర్యానికి ప్రతీకగా భావిస్తుంటారు. రవివర్మ చిత్రాల్లో కూడా మహిళలు బుగాడిని అలంకరించుకుని ఉండడం కనిపిస్తుంది. ఇలా ఒకప్పుడు స్త్రీలు సంప్రదాయంగా ధరించిన బుగాడి నేడు సరికొత్త హంగులతో ట్రెండింగ్‌లోకి వచ్చేసింది.



బుగాడి ప్రత్యేకత: చెవి పైన వెలుపలి భాగంలో అంచుకు పెట్టుకునే ఆభరణమే బుగాడి. ఇలా రెండు చెవులకూ పెట్టుకుంటారు. కొన్ని వర్గాలవారు అయిదారు బుగాడిలు అలంకరించుకుంటూ ఉంటారు. బుగాడిలు పెట్టుకోవడానికి వీలుగా చెవుల అంచుల మీద సన్నని తీగతో గుచ్చి రంధ్రాలు చేస్తారు. ఇలా చెవులు కుట్టడం వల్ల ముఖ్యమైన ఆక్యుపంక్చర్ పాయింట్లు ఉత్తేజితమై పలు అనారోగ్య సమస్యలను దూరం చేస్తాయని అప్పటివారు నమ్మేవారు. అంతేకాదు బుగాడి.. ప్రతికూల శక్తులనుంచి కాపాడుతుందని మహిళలు విశ్వసించేవారు. బుగాడిని సాధారణంగా బంగారం లేదా వెండితో తయారు చేస్తారు. సన్నని బంగారు తీగలకు చిన్న ముత్యాలు లేదా ఎర్రని రాళ్ల ఎక్కించి చిన్న రింగుల మాదిరి చుట్టేవారు. కెంపులు, పచ్చలు లాంటి రత్నాలు పొదిగి చిన్న దిద్దుల లాంటివి కూడా తయారు చేసేవారు. మెరిసే రాయి, చిన్న స్క్రూతో ముక్కుపుడకలా ఉండే బుగాడిలను మహిళలు ఎక్కువగా ధరించేవారు. క్రమంగా ఇవి రూపాంతరం చెంది సరికొత్త డిజైన్లలో విభిన్న రూపాల్లో అందుబాటులోకి వచ్చేశాయి.

అందమైన బుగాడిలు

లవంగ బుగాడి: ఇది ఎక్కువగా తమిళనాడు ప్రాంతాల్లో కనిపిస్తుంది. దీనికి లవంగం మాదిరి పుల్ల, మొగ్గ ఉంటాయి. మొగ్గ స్థానంలో అందమైన దిద్దులను జతచేస్తారు. వీటిమీద ముత్యాలు, రాళ్ల, రంగుల పూసలు, బంగారు గుళ్ల పొదుగుతారు. పుల్ల చివరలో చిన్న స్క్రూని ఏర్పాటు చేస్తారు.

కష్టీ బుగాడి: బంగారం లేదా వెండి తీగను చిన్న రింగులా చుట్టి దానికి చిన్న లాకెట్‌ను జతచేస్తారు. ఈ లాకెట్ మీద కుందనాలు, సీజెడ్‌లు, కెంపులు, పచ్చలు పొదుగుతారు. దీనికి చిన్న ముత్యాలను వేలాడదీస్తారు. ఈ రకం బుగాడి చూడడానికి గ్రాండ్‌గా కనిపిస్తుంది.

కలాషిన్ బుగాడి: దీనికి రెండు చివర్లలో అందమైన కలశం ఆకృతులు ఉంటాయి. వీటిని స్క్రూ పద్ధతి ద్వారా అమరుస్తారు. ఈ కలశాల మీద చక్కని డిజైన్లు రూపొందించి వాటి మధ్యలో ముత్యాలు, రత్నాలు పొదుగుతారు.

మోతీ బుగాడి: ఇది పూర్తిగా ముత్యాలతో నిండి ఉంటుంది. వివాహితలు, నాట్య కళాకారిణులు ఎక్కువగా ఈ రకం బుగాడిలను ధరిస్తుంటారు.

జుమ్కీ బుగాడి: దీనికి చివరన అందమైన జుమ్కీ లేదా డాంగ్లర్ వేలాడుతూ తళుక్కుమని మెరుస్తూ ఉంటుంది. మువ్వలతో కూడిన బుట్టలు, చాంద్‌బాలీలను కూడా జతచేస్తూ ఉంటారు.

డిస్క్ బుగాడి: దీనికి చివరలో గుండ్రని బిళ్ల ఉంటుంది. ఈ బిళ్ల మీద పువ్వులు, లతలు, హంసలు, నెమళ్లు, లక్ష్మీదేవి బొమ్మలు చెక్కుతారు. దీనిని ఎక్కువగా బ్లాక్ మెటల్‌తో తయారు చేస్తుంటారు.

ట్రెండింగ్‌లో ఇలా: ప్రస్తుతం బుగాడి.. సంప్రదాయ సరిహద్దులు దాటి ఫ్యాషన్ ప్రపంచంలోకి అడుగు పెట్టింది. వారసత్వ విలువలను కాపాడుకుంటూనే యువతులు దీన్ని యాక్సెసరీగా ధరించడం మొదలు పెట్టారు. ఇప్పుడు బుగాడి ధరించాలంటే చెవులు కుట్టించుకోనక్కర్లేదు. క్లిప్ ఆన్, స్క్రూ బ్యాక్, కఫ్ స్టయిల్ రకాలు అందుబాటులోకి వచ్చేశాయి. దీంతో సందర్భానికి తగ్గట్టు రకరకాల బుగాడిలు పెట్టుకోవడానికి సౌలభ్యం ఏర్పడింది. చీరలు, లెహంగాలు లాంటి సంప్రదాయ దుస్తులతోపాటు జీన్స్, స్కర్ట్ లాంటి ఇండో వెస్ట్రన్ ఫ్యాషన్ వేర్ మీద కూడా బుగాడిలు పెళ్లికూతురి అలంకరణలో కూడా బుగాడి ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. ముక్కుపుడక, పాపిడి బిళ్ల, జుంకీలకు మ్యాచ్ అయ్యేలా వీటిని ఎంపిక చేసుకుంటున్నారు.

• ఖ్యాతి,
ఖ్యాతి డిజైనర్ స్టూడియో
హైదరాబాద్, 6300386749



శిల్పా శిరోద్కర్... ఈ పేరు జ్ఞాపకం వచ్చిందా? ఒకప్పటి బాలీవుడ్ హీరోయిన్‌గా కన్నా.. హీరో మహేష్ బాబు భార్య నమ్రతకు చెల్లెలుగానే తెలుగువారికి ఎక్కువగా తెలుసు. తెలుగులో మోహన్‌బాబుతో 'బ్రహ్మ' సినిమాలో కూడా నటించారు సుమారు రెండు దశాబ్దాల క్రితం వివాహం చేసుకొని విదేశాలకు వెళ్లిన శిల్ప... మళ్లీ స్వదేశానికి తిరిగి వచ్చేశారు. 'బిగ్ బాస్ హిందీ- సీజన్ 18'లో పాల్గొన్నారు. ఇప్పటివరకు మీడియాకు దూరంగా ఉన్న శిల్ప ఇటీవల ఒక ఆంగ్ల మ్యాగజైన్‌కు ఇంటర్వ్యూ ఇచ్చారు. దానిలో తన జీవితానికి సంబంధించిన అనేక ఆసక్తికరమైన విశేషాలను వెల్లడించారు.

సినిమా కోసం నన్ను చంపేశారు!

ఎంతో తేడా...

"నేను 10వ తరగతి ఫెయిల్ అయ్యా. నా భర్త అపరేష్ రంజిత్ డబుల్ ఎంబీఏ. అయితే మా మధ్య చదువు విషయం ఏ రోజూ చర్చకు రాలేదు. ఆయన నన్ను ఎప్పుడూ చిన్నచూపు చూడలేదు. ఆయన నా వృత్తిని గౌరవిస్తారు. నేను ఆయన వృత్తిని గౌరవిస్తా. మా తల్లిదండ్రులు చనిపోయాక నా జీవితంలో ఒక శూన్యం ఏర్పడింది. ఏదో వెలితిగా ఉండేది. భారత్‌కు వచ్చేయాలని బలంగా అనిపించింది. నేను వచ్చేద్దామనుకొనే సమయానికి రంజిత్ కెరీర్ చాలా బావుంది. తను దాన్ని వదులుకొని రాలేని పరిస్థితి ఉంది. కానీ ఆయన నన్ను అర్థం చేసుకొన్నారు. నేను కొన్నేళ్లు నా సోదరి నమ్రత దగ్గర ఉంటే మానసికంగా బావుంటుందను కున్నాం. నేను భారత్ వచ్చేశా. వచ్చిన తర్వాత 'బిగ్ బాస్ హిందీ- సీజన్ 18'లో పాల్గొన్నా. ఈ సమయంలోనే నేను మినిమలిస్టిక్ లైఫ్ స్టైల్‌ను (పూర్తి నిడారంబరమైన జీవన విధానాన్ని) అనుసరించటం ప్రారంభించా. ఇంట్లో కూడా అతి తక్కువ వస్తువులు ఉండేవి. ఇంట్లోనే కాదు... వంటింట్లో కూడా అత్యవసరమైన మూడు పదార్థాలే ఉంచేదాన్ని. ఒకసారి రంజిత్ ముంబాయిలోని మా ఇంటికి వచ్చారు. నేను ఆ సమయంలో వేరే చోట ఉన్నా. ఆయనకు ఎందుకో సరదాగా వంట చేయాలని అనిపించింది. వంటింట్లోకి వెళ్లి చూశారు. గరం మసాలాతో సహా వంటకు అవసరమైన పదార్థాలేవీ లేవు. నాకు ఫోన్ చేసి... "ఇంట్లో ఏవీ లేవు. గరం మసాలా కూడా లేదు" అన్నారు. "నేను ఈ మధ్య వేటినీ వాడటం లేదు" అని సమాధానమిచ్చా. ఆయన "నీకు పిచ్చి పట్టింది" అన్నారు.



తమాషా సంఘటనలు అనేకం


నా వృత్తి జీవితంలో అనేక తమాషా సంఘటనలు ఉన్నాయి. 1995లో 'రఘువీర్' అనే సినిమా చేశాను. ఆ సినిమా షూటింగ్ కోసం కులుమనాలీ వెళ్లాం. ఈ లోపులో ముంబాయిలోని ఒక పత్రికలో నేను చనిపోయానని వార్త వచ్చిందిట. నేను ఆ వార్త చదవలేదు. నేను చనిపోయాననే వార్త చదివిన వారు... లొకేషన్‌లో నన్ను చూసి కంగారు పడ్డారు. నేను ఆ విషయాన్ని పెద్దగా పట్టించుకోలేదు. ఆ వార్తను ముంబాయిలో అమ్మానాన్న చదివి చాలా ఆందోళన చెందారు. షూటింగ్ నుంచి హోటల్‌కు వెళ్లేసరికి వారి నుంచి 25 మిస్డ్ కాల్స్ ఉన్నాయి. అప్పుడు వాళ్లకు ఫోన్ చేసి... నేను క్షేమంగానే ఉన్నానని చెప్పాను. అయితే ఇక్కడ ఇంకో విషయాన్ని చెప్పాలి. ఈ పుకారును వ్యాప్తి చేసింది... నేను నటిస్తున్న సినిమా నిర్మాత గుల్షన్ కుమారే! సినిమా మీద ప్రేక్షకులకు ఆసక్తి రేకెత్తించటం కోసం ఈ పుకారు పుట్టించారు."



ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా ఓటీటీల్లో విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌లు...

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
గ్లాస్‌హార్ట్	వెబ్‌సిరీస్	జూలై 31
తమ్ముడు	తెలుగు చిత్రం	ఆగస్టు 01
జియో హాట్‌స్టార్		
క్యుంకీ సాస్ భీ కభీ బహు థీ 2	హిందీ సిరీస్	జూలై 29
పతీ పత్నీ ఔర్ పంగా	హిందీ సిరీస్	ఆగస్టు 02
ఆపిల్ టీవీ ప్లస్		
చీఫ్ ఆఫ్ వార్	వెబ్‌సిరీస్	ఆగస్టు 01






పురాతన ఆలయాల కోసం రెండు దేశాలు యుద్ధానికి దిగటం చరిత్రలో చాలా అరుదుగా జరుగుతుంది. థాయ్‌లాండ్, కంబోడియా శుక్రవారం పురాతన శివాలయాల కోసం దాడులకు తెగబడ్డాయి. ఈ శివాలయాలపై విస్తృతమైన పరిశోధనలు చేసిన **లిడియా లక్ష్మీ** ఈ దాడుల సమయంలో ఆ సమీప ప్రాంతంలోనే ఉన్నారు. ఉక్రెయిన్‌లో సైనికురాలిగా పని చేసి, ఆ తర్వాత ఆధ్యాత్మికవేత్తగా మారిన లిడియా మన దేశంలోని వివిధ ప్రాంతాలతో పాటు... థాయ్‌లాండ్, కంబోడియా, వియత్నాంలలో బ్రహ్మసూత్ర శివలింగాలపై పరిశోధనలు చేస్తున్నారు. ఆ శివాలయాల విశిష్టతను ఆమె 'నవ్య'కు వివరించారు.

వారు ఆలయాలను ఆస్తిగా భావిస్తారు

శివాలయాల కోసం రెండు దేశాలు యుద్ధానికి దిగే పరిస్థితులు ఏర్పడటం అరుదుగా జరుగుతుంది. దీని వెనుక నేపథ్యమేమిటి?

ఈ ఆలయాలు థాయ్‌లాండ్‌లోని సురిన్ రాష్ట్రంలో ఉన్నాయి. ఈ రాష్ట్రం కంబోడియా-థాయ్‌లాండ్ సరిహద్దుల్లో ఉంటుంది. రెండు దేశాలకు చెందిన ప్రజలు ఈ ఆలయాలను తమ ఆస్తిగా భావిస్తారు. పరిరక్షించటానికి ప్రయత్నిస్తూ ఉంటారు. ఈ ఆలయాల గురించి గతంలో కూడా ఈ రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు ఏర్పడ్డాయి, చల్లారాయి. ఈ మధ్యనే పరిశోధనలు చేయటానికి నేను ఈ ఆలయాలకు వెళ్లాను. ఈ మూడు ఆలయాలు శైవ తంత్ర విద్యను అభ్యసించేవారికి చాలా ముఖ్యమైనవి. ఇక్కడ ఒక విషయాన్ని అందరికీ స్పష్టంగా చెప్పాలి. ఈ ఆధునిక యుగంలో 'తంత్ర' అంటే చాలా రకాల అపోహలు ఉన్నాయి. కానీ ఒకప్పుడు మన సంస్కృతిలో తంత్రశాస్త్రానికి చాలా ప్రాముఖ్యత ఉంది. ఇదే విధంగా ఇప్పుడు భౌగోళిక విభజనల తర్వాత థాయ్‌లాండ్, కంబోడియా వేర్వేరు దేశాలుగా ఏర్పడ్డాయి కానీ ఒకప్పుడు ఈ ప్రాంతమంతా ఖమేర్ సామ్రాజ్యంలో భాగమే! ఒక విశేషమేమిటంటే - ఈ శాస్త్రాలన్నిటికీ పుట్టినిల్లు మన భారతదేశమే! ఇక్కడి నుంచి ఇతర దేశాలకు ఈ శాస్త్రాలను మన పూర్వీకులు తీసుకువెళ్లారు. అందుకే వీటన్నిటినీ కూడా మన సంస్కృతిలో భాగంగానే చూడాలి.



ఈ ఆలయాల ఆధ్యాత్మిక విశిష్టతను మరింతగా వివరిస్తారా?

ఈ మూడు ఆలయాలు ఆధ్యాత్మికంగా చాలా విశిష్టమైనవి. నేను వాటిని క్షుణ్ణంగా పరిశీలించాను. అక్కడ ధ్యానం చేశాను. ఈ ఆలయాలలో గొప్ప శక్తి ప్రసారం జరుగుతూ ఉంటుంది. ప్రస్తుతం వీటిని కేవలం సరిహద్దుల వద్ద సైనికుల చెక్‌పోస్టులుగా కొందరు భావిస్తూ ఉండచ్చు. కానీ వీటి నిర్మాణం వెనుక నిగూఢమైన ఉద్దేశాలు ఉన్నాయి. ఉదాహరణకు... ప్రసాత్ టా మ్యుయెన్ థోమ్ దేవాలయాన్నే తీసుకుందాం. ఈ ఆలయ నిర్మాణం కౌల తంత్ర సంప్రదాయాల ప్రకారం జరిగింది. దీనిని కొండల మధ్య కొన్ని ప్రత్యేకమైన క్రతువుల నిర్వహణ కోసం ఉద్దేశించారు. సాధారణంగా అఘోర, భైరవ శక్తులు ఈ కొండలు, అడవులు ఉన్న చోట ఎక్కువగా ఉంటాయి. అందుకే ఈ తరహా ఆలయాలు కొండల అంచుల్లో, ఎక్కువ మంది చేరుకోవటానికి వీలు కాని అడవుల్లో ఉంటాయి. ఇలాంటి ఇంకో ఆలయం ప్రసాత్ తా క్రబే. ఇది స్వయంభూ శివాలయం. కుబ్జిక తంత్ర, రుద్ర యమాల, మహానిర్వాణ తంత్ర అభ్యాసకులకు చాలా కీలకమైనది. ఒకప్పుడు ఈ ఆలయంలోకి అందరికీ ప్రవేశం ఉండేది కాదు. ఖమేర్ రాజపురోహితులు దీనిలో పూజలు నిర్వహించేవారు. ఇలా ఈ ఆలయాల గురించి అనేక విశేషాలు చెప్పవచ్చు.

మీరు ఈ ఆలయాలలోని శాసనాలను పరిశీలించారా? ఆ శాసనాలు ఏమి చెబుతున్నాయి?

సాధారణంగా శాసనాలలో దాతల గురించి, నిర్మాణం వెనుక ఉన్న ఉద్దేశం గురించి, నిర్మాణానికి అయిన ఖర్చు గురించి పేర్కొంటారు. కానీ ఖమేర్ శాసనాలలో వీటితో పాటుగా ఆలయానికి సంబంధించిన ఆధ్యాత్మిక విశేషాలు కూడా ఉంటాయి.
ఈ ఆలయాలలో అలాంటి కొన్ని శాసనాలు ఉన్నాయి. ఇవన్నీ ఖమేర్ భాషలో ఉన్నాయి. ఈ శాసనాలను పరిష్కరించేవారు కూడా చాలా తక్కువ మంది ఉన్నారు. వీటిని పరిష్కరించగలిగితే మనకు అనేక విషయాలు తెలుస్తాయి.

మీరు ఈ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు కదా... స్థానిక ప్రజల భావనలు ఎలా ఉన్నాయి?

ప్రపంచంలో ఎక్కడైనా ప్రజలు శాంతిని కోరుకుంటారు. ఇప్పుడు భౌగోళికంగా ఈ ప్రాంతం వేర్వేరు దేశాలలో ఉండవచ్చు. కానీ ఈ ప్రాంత సంస్కృతి, సంప్రదాయాలు ఒకటే! ఆచార, వ్యవహారాలు ఒకటే! ఈ ప్రాంతంలో ప్రజలకు ఈ దేవాలయాలంటే విపరీతమైన భక్తి శ్రద్ధలున్నాయి. వారు యుద్ధ వాతావరణాన్ని ఇష్టపడటం లేదు.



• సీవీఎల్ఎన్ ప్రసాద్

నోటి దుర్వాసన పోవాలంటే..

కొందరికి ఎప్పుడూ నోరు దుర్వాసన వస్తూ ఉంటుంది. దంతాలు, చిగుళ్ల సమస్యలు, సరిగ్గా బ్రష్ చేయకపోవడం, కొన్ని రకాల ఆహార పదార్థాలు తినడం.. వంటి కారణాలు కూడా దుర్వాసనకు కారణం. దీనివలన నలుగురిలో మాట్లాడడం చాలా ఇబ్బందికరంగా మారుతుంది. మరి ఈ దుర్వాసనను ఎలా తగ్గించుకోవచ్చో తెలుసుకుందాం..



- దంతాల మధ్యలో ఇరుక్కున్న ఆహార పదార్థాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి.
- భోజనం తరువాత మర్చిపోకుండా నోటిని నీరుతో పుక్కిలించాలి. అలాగే రోజూ రెండుసార్లు పళ్ల తోముకోవాలి.
- నోటి దుర్వాసనకు ప్రధాన కారణం బ్యాక్టీరియా. ఉప్పు నీటితో నోటిని పుక్కిలిస్తే ఆ బ్యాక్టీరియాను నిర్మూలించవచ్చు.
- కొత్తిమీర, పుదీనా నమిలినా నోటి దుర్వాసన సమస్య తగ్గుతుంది.
- బేకింగ్‌సోడాలో యాంటీ బ్యాక్టీరియా లక్షణాలు ఉన్నాయి. దీనిని మౌత్‌వాష్‌గా ఉపయోగించినా మంచి ఫలితాలు ఉంటాయి.
- యాపిల్, క్యారెట్, పుచ్చకాయ, పైనాపిల్ వంటి పళ్ల నోటి దుర్వాసన తగ్గించడంలో బాగా సహాయపడతాయి.
- నోరు పొడిబారడం కూడా దుర్వాసనకు కారణం. కాబట్టి తరచూ నీరు తాగుతూ నోరు ఆరిపోకుండా చూసుకోవాలి.




ఆ పూల అందాల వెనుక...

హైదరాబాద్, తిరుపతి, విశాఖపట్నం... ఇలా ఏ నగరాన్నయినా తీసుకోండి. అక్కడ మార్కెట్లో మల్లెపూలు, కనకాంబరాలు కళకళలాడుతూ ఉంటాయి. ప్రతి రోజూ ఇళ్లలో పూజలు, శుభకార్యాల కోసం, అలాగే అందమైన జడల్లోకి అలంకరణల కోసం ఆ పూలు ఎక్కడి నుంచి వస్తున్నాయో, ఆ పూల సాగు వెనక ఎంత కష్టం ఉంటుందో ఎప్పుడైనా ఆలోచించారా? ఒకప్పుడు ఎక్కడ పండిన పూలు ఆ ప్రాంతంలోనే లభించేవి. కానీ రవాణా వ్యవస్థ మెరుగుపడిన తర్వాత పూల సువాసనకు సరిహద్దులు చెరిగిపోయాయి. ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లాలో... కొన్ని వందల ఎకరాల్లో మల్లె, కనకాంబరం పూలు సాగవుతున్నాయి. వాటి కథేమిటంటే...

మొక్క నుంచి కోసిన తర్వాత చల్లటి వాతావరణంలో ఉంచితే- మల్లె మొగ్గలు మూడు నుంచి నాలుగు రోజుల వరకు తాజాగా ఉంటాయి. కనకాంబరాలు అయితే ఒక రోజు మాత్రమే నిల్వ ఉంటాయి. కోసిన తర్వాత మల్లెపూలను మార్కెట్‌కు చేరుస్తారు. అక్కడి నుంచి అన్ని నగరాలకు చేరుకుంటాయి.

బాపట్ల జిల్లా పరిధిలోని బాపట్ల, చీరాల మండల ప్రాంతాలకు చెందిన మల్లె, కనకాంబరాల పూలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. అక్కడ వందల ఎకరాల్లో పూల సాగు జరుగుతోంది. ఆ నేల ఆ పూల పెరుగుదలకు అనుకూలం. అందుకే ఆ ప్రాంతంలో వాటిని సాగుచేయటం సంప్రదాయంగా వస్తోంది. సాధారణంగా మల్లె, కనకాంబరాల మొక్కలు పదేళ్ల పాటు పువ్వులు పూస్తాయి. వీటి దిగుబడి వేసవిలో అధికంగా, శీతాకాలంలో ఒక మోస్తరుగా ఉంటుంది. వీటి డిమాండ్ కాలాలపై ఆధారపడి ఉంటుంది. వేసవిలో పూలు ఎక్కువగా అందుబాటులో ఉంటాయి కాబట్టి ధర తక్కువ ఉంటుంది. హోల్‌సేల్‌లో ఒక క్వింటాల్ పూల ధర 40 వేల రూపాయల దాకా ఉంటుంది. వర్షాకాలంలో ఈ ధర గణనీయంగా పెరుగుతుంది. శ్రావణ మాసం వచ్చేసరికి క్వింటాల్ రూ.75 వేల వరకూ చేరుతుంది.




స్థానికంగా ఉపాధి...

ఒకసారి మొక్క బలంగా నాటుకున్న తర్వాత చీడ పీడలు రాకుండా మందులకు అయ్యే ఖర్చు మాత్రమే ఉంటుంది. దీనితో రైతుకు ఎక్కువ ఆదాయమే వస్తుంది. "ఈ పంట సాగు విషయంలో మాకు పెద్ద సమస్యలు ఉండవు. కానీ కొన్నిసార్లు ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఏర్పడతాయి. ఉదాహరణకు ఎక్కువ వానలు పడినప్పుడు పూలను కోయటానికి వీలు కాదు. పండగలు, శ్రావణ మాసం లాంటి సమయాల్లో ఎక్కువ డిమాండ్ ఉంటుంది. కానీ అప్పుడు తగినన్ని పూలు అందుబాటులో ఉండవు. ఎక్కువ పూలు అందుబాటులోకి వచ్చే సమయానికి ధర పడిపోతుంది. అయితే ఏడాది మొత్తం నగటు ధర తీసుకుంటే లాభదాయకంగానే ఉంటుంది" అంటున్నారు ఈ పంటను సాగుచేస్తున్న కోట వెంకటలక్ష్మి. అయితే ఈ పూల సాగుదారులకు ప్రత్యేకంగా ప్రభుత్వ పథకాలేవీ లేవు. "మాకు ప్రత్యేక పథకాలు కల్పిస్తే అనేకమంది ఈ పూలను పండించటానికి ముందుకు వస్తారు. అప్పుడు ఇతర రాష్ట్రాలకు కూడా పూల ఎగుమతి పెంచవచ్చు" అని ఆమె చెబుతున్నారు. ఇక... సాధారణంగా పూలు కోసే పని స్థానిక మహిళలే చేస్తూ ఉంటారు. చూడటానికి ఈ పని తేలికగానే కనిపిస్తుంది. కానీ రోజంతా వంగి పూలు కోయటం వెనుక చాలా శ్రమ ఉంటుందంటారు వ్యవసాయ కూలీలు. "పూల దండలు కట్టడం



ఒక కళ. అది చాలామందికి సహజంగానే వస్తుంది. అది పెద్ద శ్రమ అనిపించదు. కానీ ప్రతిరోజూ వేల పువ్వులను కోయటం అంత సులువు కాదు. కానీ ఇల్లు గడవాలంటే తప్పదు మరి" అంటున్నారు మరో సాగుదారైన చందన.

\- తాళ్లూరి ప్రదీప్, చీరాల







సెప్టెంబర్‌లో సెట్స్‌పైకి



ప్రభాస్ కథానాయకుడిగా సందీప్ రెడ్డి వంగా తెరకెక్కించనున్న చిత్రం 'స్పిరిట్'. త్రిప్తీ దిమ్రీ కథానాయిక. సెప్టెంబరు చివరి వారం నుంచి 'స్పిరిట్' రెగ్యులర్ షూట్‌ను ప్రారంభించనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. భారతీయ సినీ చరిత్రలోనే ఈ చిత్రం ఓ మైలురాయిగా నిలుస్తుందని చెప్పారు. ఈ సినిమాను భూషణ్‌కుమార్, ప్రణయ్ రెడ్డి వంగా నిర్మిస్తున్నారు. ఇందులో శక్తిమంతమైన పోలీస్ అధికారి పాత్రలో ప్రభాస్ కనిపించనున్నారు.

అందరికీ కనెక్ట్ అయ్యే పాత్ర



'గబ్బర్‌సింగ్', 'రేసుగుర్రం', 'ఎవడు', 'వాల్తేరు వీరయ్య' వంటి చిత్రాలతో తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు శ్రుతి హాసన్. ఆమె కీలక పాత్రలో నటించిన చిత్రం 'కూలీ'. రజనీకాంత్, నాగార్జున, ఆమిర్‌ఖాన్ ప్రధాన పాత్రధారులుగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వం వహించారు. ఆగస్టు 14న ఈ సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా శ్రుతీహాసన్ మీడియాతో చిత్ర విశేషాలను పంచుకున్నారు. "ఓ ఆల్బమ్ కోసం లోకేశ్‌ను కలసినప్పుడు 'కూలీ'లో నా పాత్ర గురించి చెప్పారు. వినగానే నచ్చేసింది. అందరూ కనెక్ట్ అయ్యే పాత్ర ఇది. మంచి భావోద్వేగాలతో నిండిన ఈ రోల్ నా కెరీర్‌లోనే ప్రత్యేకమైనది. రజనీ సార్‌తో కలసి నటించడం అదృష్టంగా భావిస్తున్నాను. ఆయన పోషించిన దేవ పాత్ర సినిమాకు ప్రత్యేకాకర్షణగా నిలుస్తుంది. నాగార్జున విలన్ పాత్రలో అద్భుతంగా నటించారు. లోకేశ్ విజన్, టేకింగ్ ఈ సినిమాను మరోస్థాయికి తీసుకెళ్లింది. 'కూలీ' ప్రేక్షకులను కచ్చితంగా అలరిస్తుంది" అని చెప్పారు.

నటుడిగా 50 ఏళ్లు



హీరోగా, విలన్‌గా, డబ్బింగ్ ఆర్టిస్టుగా దక్షిణాది సినీ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న విలక్షణ నటుడు సాయి కుమార్. ఆయన పేరు వింటే ఎన్నో అద్భుతమైన డైలాగులు కళ్ల ముందు మెదులుతాయి. నేడు(జూలై 27) ఆయన 65వ పుట్టిన రోజు. అంతేకాదు ఈ ఏడాదితో సాయి కుమార్ నట జీవితానికి 50 ఏళ్లు నిండాయి. ఇన్నేళ్ల ప్రస్థానంలో ఎన్నో గొప్ప చిత్రాలతో మెప్పించిన సాయి కుమార్ 1975 జనవరి 9న 'దేవుడు చేసిన పెళ్లి' చిత్రంతో నటుడిగా ఆరంగేట్రం చేశారు. సంక్రాంతికి విడుదలైన ఈ చిత్రం అప్పట్లో సంచలనం సృష్టించింది. ఈ ఏడాది ఆయన నటించిన 'సంక్రాంతికి వస్తున్నాం', 'కోర్ట్' చిత్రాలు మంచి విజయాన్ని సాధించాయి. కొత్తతరం ఆర్టిస్టులు వస్తున్నా, గట్టి పోటీ ఉన్నా సాయి కుమార్ ఇప్పటికీ చేతి నిండా ప్రాజెక్టులతో బిజీగా ఉంటూ.. ప్రతీ సినిమాతో ప్రేక్షకుల్ని మెప్పిస్తున్నారు. ప్రస్తుతం ఆయన సాయిధరమ్ తేజ్ 'సంబరాల ఏటిగట్టు', నాగ శౌర్య 'బ్యాడ్ బాయ్ కార్తిక్', కిరణ్ అబ్బవరం 'కే ర్యాంప్', అల్లరి నరేశ్ '12ఏ రైల్వే కాలనీ', 'ధర్మస్థల నియోజకవర్గం', 'రాజాధి రాజా', కోన వెంకట్‌తో ఓ సినిమా, ఎస్వీ కృష్ణారెడ్డితో మరో చిత్రం ఇలా..ఫుల్ బిజీగా ఉన్నారు. కన్నడ, తమిళ చిత్రాలలోనూ నటిస్తున్నారు.

విడుదలే పెద్ద విజయం



నిహాల్ కోదాటి, సూర్య శ్రీనివాస్ హీరోలుగా అక్కి. విశ్వనాథ రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న స్పై డ్రామా 'చైనా పీస్'. మూన్ లైట్ డ్రీమ్స్ సంస్థ నిర్మిస్తోంది. శనివారం నిర్వహించిన కార్యక్రమంలో కథానాయకుడు సందీప్ కిషన్ ఈ చిత్రం టీజర్‌ని లాంచ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'ఒక సినిమాను నిర్మించి రిలీజ్ చేయడమే పెద్ద సక్సెస్, ప్రేక్షకులకు సినిమా నచ్చితే బోనస్‌గా భావించాలి. ఇది ఒక స్పై ఫిల్మే కాదు..స్పై కామెడీ కథ కూడా. టీజర్ చాలా బాగుంది. సినిమా కూడా బాగుంటుందని అనుకుంటున్నా' అని అన్నారు. చిత్ర దర్శకుడు విశ్వనాథ రెడ్డి మాట్లాడుతూ 'ఒక దేశభక్తి సినిమా తీస్తూ 'చైనా పీస్' అనే పేరు పెట్టడం సాహసమే. అన్ని విభాగాల్లోనూ జాగ్రత్తలు తీసుకొని చాలా చక్కగా ఈ సినిమాని తీర్చిదిద్దాం' అని చెప్పారు. కార్యక్రమంలో హీరోలు నిహాల్, సూర్య శ్రీనివాస్, నటులు కమల్ కామరాజు, హర్షిత తదితరులు పాల్గొన్నారు.

యూత్‌కి కనెక్ట్ అవుతుంది



డార్లింగ్ కృష్ణ, మనీషా జంటగా శశాంక్ దర్శకత్వంలో రూపొందుతున్న బహు భాషా చిత్రం 'బ్రాట్'. డాల్ఫిన్ ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్‌పై మంజునాథ్ కంద్కూర్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్‌కి మంచి స్పందన లభించింది. తాజాగా ఈ సినిమా నుంచి 'యుద్ధమే రాని...' అంటూ సాగే పాటను సీనియర్ నటుడు నరేశ్ వీకే విడుదల చేశారు. ఈ పాటను సనారె రాయగా, అర్జున్ జన్య సంగీతం సమకూర్చారు. సిద్ శ్రీరామ్ ఆలపించారు. ఈ కార్యక్రమంలో నరేశ్ వీకే మాట్లాడుతూ 'మంజునాథ్ చాలా రోజుల తరవాత అద్భుతమైన సినిమా 'బ్రాట్'తో వస్తున్నారు. శశాంక్ చాలా నైపుణ్యమున్న దర్శకుడు. మనీషా అద్భుతమైన నటి. యువతకు ఈ చిత్రం బాగా కనెక్ట్ అవుతుంది' అని అన్నారు. చిత్ర దర్శకుడు శశాంక్ మాట్లాడుతూ 'అందరినీ మెప్పించే కథ ఇది' అని అన్నారు.

చిత్రజ్యోతి

SINCE 1965



మీ అండ ఉంటే.. ఆపేవారే లేరు

- విజయ్ దేవరకొండ

విజయ్ దేవరకొండ కథానాయకుడిగా 'జెర్సీ' ఫేమ్ గౌతమ్ తిన్ననూరి తెరకెక్కించిన చిత్రం 'కింగ్‌డమ్'. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మించారు. ఈ నెల 31న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా శనివారం తిరుపతిలో నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ కార్యక్రమంలో విజయ్ దేవరకొండ రాయలసీమ యాసలో మాట్లాడి అభిమానులను అలరించారు. ఆయన మాట్లాడుతూ "ప్రతీ సినిమాకు ప్రాణం పెట్టి పనిచేసినట్టే ఈ ప్రాజెక్ట్‌కూ పనిచేశా. గౌతమ్ తిన్ననూరి, నాగవంశీ, అనిరుధ్, భాగ్యశ్రీ బోర్సే చాలా కష్టపడ్డారు. ఇక మిగిలింది ఒక్కటే ఆ వెంకన్న స్వామి దయ, మీ ఆశీస్సులు. అవి నాతో ఉంటే, ఎవరూ మనల్ని ఆపలేరు" అని అన్నారు. నాగవంశీ మాట్లాడుతూ "ఐదేళ్లు కష్టపడి గౌతమ్ తిన్ననూరి ఈ కథను రాశారు. ఓ సరికొత్త యాక్షన్ గ్యాంగ్‌స్టర్ సినిమా చూస్తారు. 'అర్జున్ రెడ్డి'లో విజయ్‌ను ఎలా చూశారో, ఇందులో రెండున్నర గంటలపాటూ అలానే చూస్తారు. ఇండస్ట్రీ పరిస్థితి బాగాలేదు. ఈ సినిమాను మంచి హిట్ చేసి పరిశ్రమకు ఊపునివ్వండి" అని చెప్పారు. భాగ్యశ్రీ బోర్సే మాట్లాడుతూ "ఇదో అద్భుతమైన సినిమా. ఇందులో నేను పోషించిన పాత్ర చాలా కీలకంగా ఉండనుంది" అని తెలిపారు.

'అతడు' సీక్వెల్‌కు సిద్ధం

- మురళీ మోహన్



"జయభేరి' బేనర్‌లో మేం తీసిన చిత్రాలు మొత్తం ఒకెత్తు..'అతడు' ఒక్కటీ ఒకెత్తు. అప్పట్లో అధునాతన సాంకేతికతతో ఈ మూవీని నిర్మించాం. అద్భుతమైన డైలాగ్స్‌తో త్రివిక్రమ్ అందరినీ మెప్పించారు. అందుకే త్రివిక్రమ్ మాటల మాంత్రికుడు అయ్యారు' అని అన్నారు సీనియర్ నటుడు, నిర్మాత మురళీమోహన్. హీరో మహేశ్‌బాబు, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో మురళీ మోహన్ నిర్మించిన 'అతడు' సినిమా 2005 ఆగస్టు 10న విడుదలై ఘన విజయం సాధించింది. ఈ చిత్రాన్ని ఆగస్టు 9న మహేశ్‌బాబు పుట్టిన రోజు సందర్భంగా రీ రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌లో మురళీ మోహన్ మాట్లాడుతూ 'ఈ మూవీ కోసం మహేశ్ బాబు చాలా సహకరించారు. ఈ రీ రిలీజ్ ద్వారా వచ్చిన డబ్బులను మహేశ్‌బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలకు ఉపయోగిస్తాం. మహేశ్ బాబు, త్రివిక్రమ్ డేట్స్ ఇస్తే 'అతడు' సీక్వెల్‌ను మా బేనర్ నిర్మిస్తుంది' అని అన్నారు. జయభేరి ప్రతినిధి ప్రియాంక దుగ్గిరాల మాట్లాడుతూ 'ఈ సినిమాను ఇప్పుడున్న టెక్నాలజీతో 8కె, 4కెలోకి మార్చాం' అని చెప్పారు.

ప్రేక్షకులను మెప్పించే కథలతో



విభిన్నమైన కథలతో పలు విజయవంతమైన చిత్రాలను అందించిన నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ. తన సొంత బేనర్ భీమవరం టాకీస్ పతాకంపై నిర్మిస్తున్న కొత్త చిత్రాల విశేషాలను ఆయన మీడియాతో పంచుకున్నారు. 'మా బేనర్‌పై విభిన్నమైన కథాంశాలతో పలు చిత్రాలను రూపొందిస్తున్నాం. సస్పెన్స్ థ్రిల్లర్, అవుట్ అండ్ అవుట్ కామెడీ, లవ్ స్టోరీ... ఇలా ప్రేక్షకులను మెప్పించే విభిన్న కథాంశాలతో మొత్తం పదిహేను వరకూ స్క్రిప్టులు సిద్ధం చేశాం. ఈ చిత్రాలను ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఒకేసారి సెట్స్‌పైకి తీసుకువెళతాము. నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో వెల్లడిస్తాం' అని రామసత్యనారాయణ తెలిపారు.





తన్వి, వెన్నెలకు కాంస్యాలు

ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్



సోలో (ఇండోనేసియా): తెలుగు షట్లర్ వెన్నెల కలగొట్ల, తన్వీ శర్మ ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌ను కాంస్య పతకాలతో ముగించారు. శనివారం జరిగిన సెమీఫైనల్లో వెన్నెల 15-21, 18-21తో లూ సియా (చైనా) చేతిలో పోరాడి ఓడింది. మరో సెమీస్‌లో రెండో సీడ్ తన్వీ శర్మ 13-21, 14-21తో ఎనిమిదో సీడ్ యిన్ యీ కింగ్ (చైనా) చేతిలో పరాజయం చవిచూసింది. కాగా, ఒకే టోర్నీలో ఇలా మహిళల సింగిల్స్‌లో రెండు పతకాలు లభించడం భారత్‌కు ఇదే తొలిసారి కావడం విశేషం.

సెప్టెంబరు 9 నుంచి ఆసియా కప్

14, 21న ఇండో-పాక్ మ్యాచ్‌లు



టోర్నీ వేదిక యూఏఈ

గ్రూప్ ఎ: భారత్, పాకిస్థాన్, ఒమన్, యూఏఈ.
గ్రూప్ బి: శ్రీలంక, బంగ్లాదేశ్, అఫ్ఘానిస్థాన్, హాంకాంగ్.

కరాచీ/న్యూఢిల్లీ: పురుషుల ఆసియా కప్ టీ20 టోర్నమెంట్ సెప్టెంబరు 9 నుంచి 28 వరకు యూఏఈ వేదికగా జరగనుంది. ఈ విషయాన్ని ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) చైర్మన్ మొహిసిన్ నఖ్వీ శనివారం వెల్లడించాడు. ప్రధాన ప్రత్యర్థులు భారత్, పాకిస్థాన్ జట్లు ఒకే గ్రూపు నుంచి తలపడనున్నాయి. ఈ రెండు జట్ల మధ్య సెప్టెంబరు 14న దుబాయ్ అంతర్జాతీయ స్టేడియంలో మ్యాచ్ జరగనుంది. ఆపై సూపర్ ఫోర్‌లో భాగంగా సెప్టెంబరు 21న భారత్-పాక్ మరోసారి ఢీకొంటాయి. ఇక రెండు జట్లు కనుక ఫైనల్‌కు చేరితే ముచ్చటగా మూడోసారి తలపడతాయి. ఎనిమిది జట్లను రెండు గ్రూపులుగా విడదీశారు. ప్రతి గ్రూపులో తొలి రెండు స్థానాలలో నిలిచిన జట్లు సూపర్-4కి చేరతాయి. సూపర్-4లో ప్రతి జట్టు మిగిలిన మూడు జట్లతో తలపడుతుంది. సూపర్-4 నుంచి రెండు జట్లు ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. సెప్టెంబరు 10న యూఏఈతో జరిగే మ్యాచ్‌తో టోర్నీని టీమిండియా ఆరంభిస్తుంది. 19న ఒమన్‌తో తలపడుతుంది. భారత్ మ్యాచ్‌లన్నీ దుబాయ్‌లో జరిగే అవకాశముంది.



శ్రీజ.. రన్నరప్‌తో సరి

లాగోస్ (నైజీరియా): తెలుగమ్మాయి ఆకుల శ్రీజ డబ్ల్యూటీటీ కంటెండర్ లాగోస్ టేబుల్ టెన్నిస్ ఈవెంట్‌లో రన్నరప్‌గా నిలిచింది. సింగిల్స్ ఫైనల్లో హషిమొటో (జపాన్) 4-1తో శ్రీజను ఓడించింది. కాగా, పురుషుల డబుల్స్ టైటిల్‌ను భారత జోడీ సాతియన్ గుణశేఖరన్/ఆకాశ్ పాల్ దక్కించు కుంది. ఫైనల్లో సాతియన్ ద్వయం 3-1తో ఫ్రాన్స్ జంట లియో డి/జులెస్‌పై నెగ్గింది.

సాత్విక్ జోడీ పరాజయం

చాంగ్జౌ: సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ శెట్టి జోడీకి చైనా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో చుక్కెదురైంది. ఈ భారత డబుల్స్ టాప్ జంట సెమీఫైనల్లో పరాజయం పాలైంది. శనివారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో సాత్విక్ ద్వయం 13-21, 17-21తో రెండోసీడ్ జంట ఆరోన్ చియా/సో వూయి యిక్ (మలేసియా) చేతిలో చిత్తయింది. ఈ జోడీ ఓటమితో టోర్నీలో భారత్ కథ పూర్తిగా ముగిసింది.

కివీస్‌దే 'ముక్కోణ'ం

హరారే: టీ20 ముక్కోణపు సిరీస్ టైటిల్‌ను న్యూజిలాండ్ సొంతం చేసుకొంది. చివరి ఓవర్‌లో దక్షిణాఫ్రికా విజయానికి 7 పరుగులు అవసరమవగా.. దూకుడు మీదున్న బ్రెవిస్ (31)ను అవుట్ చేసిన హెన్రీ (2/19) మూడు పరుగుల తేడాతో కివీస్‌ను గెలిపించాడు. ఫైనల్లో తొలుత కివీస్ 20 ఓవర్లలో 180/5 స్కోరు చేసింది. రచిన్ (47), కాన్వే (47), సీఫెర్ట్ (30) రాణించారు. ఛేదనలో దక్షిణాఫ్రికా ఓవర్లన్నీ ఆడి 177/6 స్కోరుకే పరిమితమైంది. ఓపెనర్లు ప్రిటోరియస్ (51), హెండ్రిక్స్ (37) తొలి వికెట్‌కు 92 పరుగుల ధనాధన్ భాగస్వామ్యంతో గెలుపునకు బాటలు వేశారు. డెత్ ఓవర్లలో బ్రెవిస్ వేగంగా ఆడడంతో సౌతాఫ్రికా నెగ్గుతుందనిపించింది. కానీ, ఆఖర్లో హెన్రీ మాయాజాలంతో.. దక్షిణాఫికా గెలుపు వాకిట బోల్తా పడింది.

నిలబెడతారా!

రాహుల్, గిల్ అజేయ అర్ధసెంచరీలు ● పోరాడుతున్న టీమిండియా

● రెండో ఇన్నింగ్స్ 174/2 ● ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 669

● బెన్ స్టోక్స్ సెంచరీ ● నాలుగో టెస్టు



కేఎల్ రాహుల్ (87 బ్యాటింగ్)

గిల్ (78 బ్యాటింగ్)

మాంచెస్టర్: నాలుగో టెస్టులో ఇంగ్లండ్‌కు దక్కిన ఆధిక్యం 311. అటు రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన భారత్ సున్నాకే రెండు వికెట్లు కోల్పోవడంతో ఆఖరి సెషన్ వరకైనా నిలుస్తుందా? అనిపించింది. కానీ ఓపెనర్ కేఎల్ రాహుల్ (210 బంతుల్లో 8 ఫోర్లతో 87 బ్యాటింగ్), కెప్టెన్ గిల్ (167 బంతుల్లో 10 ఫోర్లతో 78 బ్యాటింగ్) మాత్రం పట్టువదలని పోరాటంతో అబ్బుర పరిచారు. రెండు సెషన్లపాటు ఓపిగ్గా క్రీజులో నిలిచి భారత్ డ్రాపై ఆశలను సజీవంగా నిలిపారు. దీంతో శనివారం నాలుగో రోజు ఆట ముగిసేసరికి భారత్ 63 ఓవర్లలో 174/2 స్కోరు చేసింది. ఇంకా జట్టు 137 రన్స్ వెనుకబడి ఉండగా.. చేతిలో ఎనిమిది వికెట్లున్నాయి. గెలుపు అసాధ్యమే కనుక చివరి రోజు మూడు సెషన్లపాటు ఆతిథ్య జట్టు బౌలర్లను భారత్ సమర్థవంతంగా ఎదుర్కొంటుందా? అనేది ఆసక్తికరంగా మారింది. అటు పంత్ బ్యాటింగ్‌పైనా స్పష్టత రావాల్సి ఉంది. అంతకుముందు బెన్ స్టోక్స్ (141) శతక సహాయంతో ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 669 పరుగులు చేసింది. కార్స్ (47) రాణించాడు. జడేజాకు నాలుగు.. సుందర్, బుమ్రాలకు రెండేసి వికెట్లు దక్కాయి.

అద్భుత భాగస్వామ్యం: 544/7 ఓవర్‌నైట్ స్కోరుతో నాలుగో రోజును ఆరంభించిన ఇంగ్లండ్ దాదాపు సెషన్ పూర్తిగా ఆడి మిగిలిన మూడు వికెట్లను కోల్పోయింది. కానీ ఆలోపే కెప్టెన్ స్టోక్స్ శతకంతో పాటు కార్స్ ధాటికి మరో 125 పరుగులు జత చేరాయి. ఈ జోడీ మధ్య తొమ్మిదో వికెట్‌కు 95 పరుగులు జత చేరడం విశేషం. దీంతో స్కోరు 600 దాటడంతో పాటు ఆధిక్యం 311కి చేరి భారత్ ముందు కఠిన సవాల్‌ను ఉంచింది. పేసర్లు బుమ్రా, సిరాజ్ ఈసారి కాస్త మెరుగ్గానే బౌలింగ్ చేసినా ఇంగ్లండ్ జోరును కట్టడి చేయలేకపోయారు. డాసన్ (26) నిష్క్రమించాక కార్స్ అండతో స్టోక్స్ స్వేచ్ఛగా బ్యాట్ ఝుళిపించాడు. సిరాజ్ ఓవర్‌లో ఫోర్‌తో అతడు రెండేళ్ల తర్వాత శతకం అందుకున్నాడు. స్పిన్నర్లు సుందర్, జడేజా ఓవర్లలో ఒక్కో ఫోర్, సిక్సర్‌తో ధాటిని కనబర్చాడు. అటు కార్స్ కూడా వేగంగా ఆడి తన వంతు సహకారం అందించాడు. చివరకు జడేజా తన వరుస ఓవర్లలో స్టోక్స్, కార్స్‌లను అవుట్ చేసి ఇంగ్లండ్ అద్భుత ఇన్నింగ్స్‌ను ముగించాడు.



స్టోక్స్ (141)

0/2 నుంచి కోలుకుని..: లంచ్ విరామానికి 15 నిమిషాల ముందు భారత్ రెండో ఇన్నింగ్స్ ఆరంభించింది. కానీ తొలి ఓవర్‌లోనే పేసర్ వోక్స్ వరుస బంతుల్లో ఓపెనర్ జైస్వాల్, సుదర్శన్‌లను డకౌట్ చేసి గట్టి షాక్ ఇచ్చాడు. అప్పటికి జట్టు పరుగుల ఖాతా కూడా తెరువలేదు. కానీ ఆ తర్వాత ఓపెనర్ రాహుల్, కెప్టెన్ గిల్ నిలకడైన ఆటతీరుతో అండగా నిలిచారు. దీంతో వేగంగా వికెట్లు తీద్దామనుకున్న ఇంగ్లండ్ బౌలర్ల ఆశలు ఆవిరయ్యాయి. స్టోక్స్ బౌలింగ్‌కు దూరంగా ఉండడం కూడా లాభించింది. కానీ లంచ్ బ్రేక్ తర్వాత ఆరంభంలో పేసర్లు వోక్స్, ఆర్చర్ తమ పదునైన బంతులతో వణికించారు. ముఖ్యంగా ఆర్చర్‌ను ఎదుర్కొనేందుకు గిల్ ఇబ్బందిపడ్డాడు. అతడి ఇన్‌స్వింగర్‌కు అంపైర్ కాల్‌తో బతికిపోయాడు. కానీ ఆ తర్వాత నిలదొక్కుకుని చక్కటి డ్రైవ్ షాట్లతో ఆకట్టుకున్నాడు. 46 పరుగుల వద్ద స్లిప్‌లో డాసన్ క్యాచ్ వదిలేయడం గిల్‌కు కలిసివచ్చింది. దీంతో అతను హాఫ్ సెంచరీ పూర్తి చేసుకోగా.. మరో ఎండ్‌లో రాహుల్ అబేధ్య డిఫెన్స్‌తో సహకరించాడు. రెండో సెషన్‌లో జట్టు 85 పరుగులు చేసింది. ఇక ఆఖరి సెషన్‌లో గిల్ కాస్త నెమ్మదించినా, రాహుల్ సాధికారికంగా ఆడి అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆర్చర్‌ను లక్ష్యంగా చేసుకుని తను బౌండరీలు రాబట్టాడు. చివరకు తమ వికెట్లను కాపాడుకుంటూ రోజును ముగించారు.

1

ఇంగ్లండ్‌లో టెస్టు సిరీస్‌లో ఎక్కువ పరుగులు (697*) సాధించిన ఆసియా బ్యాటర్‌గా గిల్. మహ్మద్ యూసుఫ్ (2006లో 631)ను అధిగమించాడు.

● ఓ ఇన్నింగ్స్‌లో వందకు పైగా పరుగులు సమర్పించుకోవడం బుమ్రాకిదే తొలిసారి.

● టెస్టుల్లో ఓ జట్టు సున్నాకే రెండు వికెట్లు కోల్పోయినా మూడో వికెట్‌కు అధిక భాగస్వామ్యం (174*) నమోదు చేసిన జోడీగా గిల్-రాహుల్.

● ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానంలో అత్యధిక స్కోరు (669) సాధించిన జట్టుగా ఇంగ్లండ్.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 358; ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: క్రాలే (సి) రాహుల్ (బి) జడేజా 84, డకెట్ (సి/సబ్) జురెల్ (బి) అన్షుల్ 94, పోప్ (సి) రాహుల్ (బి) సుందర్ 71, రూట్ (స్టంప్ సబ్) జురెల్ (బి) జడేజా 150, బ్రూక్ (స్టంప్ సబ్) జురెల్ (బి) సుందర్ 3, స్టోక్స్ (సి) సుదర్శన్ (బి) జడేజా 141, స్మిత్ (సి సబ్) జురెల్ (బి) బుమ్రా 9, డాసన్ (బి) బుమ్రా 26, వోక్స్ (బి) సిరాజ్ 4, కార్స్ (సి) సిరాజ్ (బి) జడేజా 47, ఆర్చర్ (నాటౌట్) 2, **ఎక్స్‌ట్రాలు: 38; మొత్తం: 157.1 ఓవర్లలో 669 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-166, 2-197, 3-341, 4-349, 5-499, 6-515, 7-528, 8-563, 9-658, 10-669; **బౌలింగ్:** బుమ్రా 33-5-112-2, అన్షుల్ 18-1-89-1, సిరాజ్ 30-4-140-1, శార్దూల్ 11-0-55-0, జడేజా 37.1-0-143-4, సుందర్ 28-4-107-2.

భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) రూట్ (బి) వోక్స్ 0, రాహుల్ (బ్యాటింగ్) 87, సుదర్శన్ (సి) బ్రూక్ (బి) వోక్స్ 0, గిల్ (బ్యాటింగ్) 78, **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 63 ఓవర్లలో 174/2; వికెట్ల పతనం:** 1-0, 2-0; **బౌలింగ్:** వోక్స్ 15-3-48-2, ఆర్చర్ 11-2-40-0, కార్స్ 10-2-29-0, డాసన్ 22-8-36-0, రూట్ 5-1-17-0.



హోరాహోరీ

హంపి - దివ్య తొలి గేమ్ డ్రా

మహిళల చెస్ ప్రపంచ కప్ ఫైనల్

బటూమి (జార్జియా): మహిళల ప్రపంచ చెస్ ఫైనల్ తొలి గేమ్ ఊహించినట్టుగానే హోరాహోరీగా సాగింది. వెటరన్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి-యువ సంచలనం దివ్యా దేశ్‌ముఖ్ నడుమ శనివారం మూడు గంటలపాటు జరిగిన క్లాసికల్ మొదటి గేమ్ 41 ఎత్తుల తర్వాత డ్రాగా ముగిసింది. ఫలితంగా హంపి, దివ్య చెరో అర పాయింట్‌తో సమంగా నిలిచారు. ఆదివారం రెండో గేమ్ జరగనుంది. ఈ గేమ్‌లో ఫలితం వస్తే సరి..లేదంటే విజేతను నిర్ణయించేందుకు సోమవారం టైబ్రేకర్ నిర్వహిస్తారు. ఇక మూడో స్థానం కోసం తలపడుతున్న చైనా గ్రాండ్‌మాస్టర్లు లీ టింగ్జీ-టాన్ జోంగ్‌యి కూడా తొలి గేమ్‌ను డ్రాగా ముగించి చెరో అర పాయింటు పంచుకున్నారు. వీరిద్దరి రెండో గేమ్‌కూడా ఆదివారం జరుగుతుంది. రెండుసార్లు వరల్డ్ ర్యాపిడ్ చాంపియన్ హంపి నల్లపావులతో డ్రా చేసుకోవడంతో రెండో గేమ్‌లో ఆమె తెల్లపావులతో ఆడనుంది. ఇది..38 ఏళ్ల తెలుగు గ్రాండ్‌మాస్టర్‌కు అనుకూలించనుంది. ఇక..హంపితో మొదటి గేమ్‌లో తెల్లపావులతో క్వీన్స్ గాంబిట్ ఓపెనింగ్‌తో దివ్య పోటీని ప్రారంభించింది. వినూత్నమైన ఎత్తులతో ఆరంభంలో పైచేయి సాధించింది. అయితే క్వీన్, రూక్‌తో హంపి ఎదురు దాడికి దిగింది. తొలి గంటలో..ఎత్తులు వేసేందుకు 19 ఏళ్ల ఇంటర్నేషనల్ మాస్టర్ దివ్య సుదీర్ఘ సమయం తీసుకుంది. దాంతో సమయభావంతో ఆమె ఒత్తిడికి లోనైంది. మరోవైపు హంపి ప్రశాంతంగా..వ్యూహాత్మక ఎత్తులతో పట్టుబిగించింది. ఇద్దరూ ఎత్తులకు పైఎత్తులు వేయడంతో మిడిల్ గేమ్‌కొచ్చే సరికి పోరు రసవత్తరంగా మారింది. ఇక..ఎండ్ గేమ్‌లో అటు హంపి, ఇటు దివ్యకు గెలుపు అవకాశాలు కనిపించాయి. కానీ ఎవరూ రిస్క్ తీసుకొనేందుకు ప్రయత్నించలేదు. దాంతో ఇద్దరూ డ్రాగా ముగించేందుకు మొగ్గు చూపారు.

టిమ్ డేవిడ్ మెరుపు శతకం

టీ20 సిరీస్ ఆసీస్ వశం



బస్సెటెర్రీ (సెయింట్ కిట్స్): ఆస్ట్రేలియా తరపున టిమ్ డేవిడ్ (37 బంతుల్లో 6 ఫోర్లు, 11 సిక్సలతో 102 నాటౌట్) వేగవంతమైన శతకం నమోదు చేశాడు. దీంతో వెస్టిండీస్‌తో ఐదు టీ20ల సిరీస్‌ను ఆసీస్ మరో రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే 3-0తో సొంతం చేసుకొంది. శుక్రవారం జరిగిన మూడో టీ20లో కంగారూలు 6 వికెట్ల తేడాతో విండీస్‌ను చిత్తు చేశారు. తొలుత విండీస్ 20 ఓవర్లలో 214/4 స్కోరు చేసింది. కెప్టెన్ షాయ్ హోప్ (102 నాటౌట్) అజేయ సెంచరీతో, బ్రెండన్ కింగ్ (62) అర్ధ శతకంతో రాణించారు. కాగా, ఛేదనలో టిమ్ మెరుపు ఇన్నింగ్స్‌తో ఆసీస్ 16.1 ఓవర్లలోనే 4 వికెట్లకు 215 పరుగులు చేసి గెలిచింది. టిమ్ డేవిడ్‌కిది పొట్టి ఫార్మాట్‌లో తొలి సెంచరీ కావడం విశేషం.

ఎరువులు, పురుగు మందుల వ్యాపారాల్లో జీఎస్‌టీ ఎలా?

ఇదీ GST



రాంబాబు గొండాల

మన దేశంలో ఇతర వ్యాపారాలతో పోల్చితే ఎరువులు, పురుగు మందుల వ్యాపారం కొంత భిన్నమైంది. మిగతా వ్యాపారాల్లో వినియోగదారులు అన్ని రకాల వారు ఉండగా ఈ వ్యాపారంలో అంతిమ వినియోగదారులు రైతులు మాత్రమే. అంతేకాకుండా ఇది సీజనల్ వ్యాపారం. అంటే సంవత్సరం మొత్తం నడవదు. ఎక్కువగా అరువు మీద వ్యాపారం నడుస్తుంది. అంటే రైతులు తాము కొన్న ఎరువులు లేదా పురుగు మందులకు సంబంధించిన డబ్బులు పంట వచ్చిన తర్వాత ఇస్తుంటారు. ఇలాంటి సందర్భాల్లో ఈ వ్యాపారానికి సంబంధించి జీఎస్‌టీ గురించిన జాగ్రత్తలు ఏమిటి? పద్దు పుస్తకాలు ఎలా నిర్వహించాలి? మొదలైన విషయాలు మీకోసం..

ఒకప్పుడు జిల్లా, మండల కేంద్రాల్లోనే ఈ దుకాణాలు ఉండగా ఇప్పుడు చిన్న గ్రామాల్లో కూడా ఉంటున్నాయి. రైతులు.. ముఖ్యంగా చిన్న,సన్నకారు రైతులు సీజన్ ప్రారంభంలో అరువు మీద ఎరువులు తెచ్చుకుని పంట వచ్చిన తర్వాత దుకాణదారులకు చెల్లిస్తారు. అంటే దుకాణదారులకు ఆ పైకం ఆలస్యంగా అందుతుంది. కాబట్టి ఈ దుకాణదారులు కూడా హోల్‌సేల్ వ్యాపారులకు, అలాగే హోల్‌సేల్ వ్యాపారులు కంపెనీలకు ఆలస్యంగా డబ్బులు చెల్లిస్తుంటారు. ఇంకా వివరంగా చెప్పాలంటే, కంపెనీలు సీజన్ ప్రారంభంలో ఎక్కువ సరుకును హోల్‌సేల్ వ్యాపారులకు పంపిస్తారు. సదరు సరుకును అమ్ముకోవటానికి హోల్‌సేల్ వ్యాపారులకు సాధ్యమైనంత మేర గడువు ఇస్తుంది. అంటే ఈ సరుకుకు సంబంధించిన మొత్తాన్ని ఆలస్యంగా చెల్లించే వెసులుబాటు ఈ వ్యాపారులకు ఉంటుంది. కాబట్టి వీరు కూడా ఇదే పద్ధతిలో రిటైల్ వ్యాపారులకు సరుకును ఇస్తుంటారు.

ఈ వ్యాపారంలో ఉన్న మరొక ముఖ్య విషయం ఏమిటంటే కంపెనీలు ఎక్కువగా సరుకును హోల్‌సేల్ వ్యాపారులకు పంపిస్తుందని చెప్పుకున్నాం కదా. మరి అంత సరుకు అమ్ముడు పోకపోతే ఏమి చేయాలి? అందుకే అమ్ముడుపోని సరుకుని కొంత కాలం తర్వాత వెనక్కు తీసుకునే వెసులుబాటు కల్పిస్తారు. ఇదే పద్ధతిలో హోల్‌సేల్, రిటైల్ వ్యాపారుల మధ్య కూడా ఉంటుంది. అంటే, మిగతా వ్యాపారులతో పోలిస్తే ఇక్కడ రెండు రకాల సమస్యలు ఉన్నాయి. ఒకటి సరుకు వెనక్కి పంపించటం, అలాగే కొనుగోలుకు సంబంధించిన సొమ్ము ఆలస్యంగా చెల్లించటం.

మరి ఈ విధానంలో జీఎస్‌టీకి సంబంధించి సమస్యలు ఏమిటంటే, ఒక వ్యాపారి తాను పొందిన సరుకు మీద ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) పొందినప్పుడు ఇన్వాయిస్ తేదీ నుంచి 180 రోజుల లోపు అమ్మకందారునికి ఆ సరుకు తాలూకు మొత్తం పన్నుతో సహా కలిపి చెల్లించాలి. అలా చెల్లించని పక్షంలో తీసుకున్న ఐటీసీ చెల్లుబాటు కాదు. కాబట్టి దాన్ని రివర్స్ చేసి తిరిగి ఎప్పుడైతే ఆ మొత్తం చెల్లిస్తాడో అప్పుడు ఆ క్రెడిట్ తిరిగి తీసుకోవాలి. ముందు చెప్పినట్లుగా ఈ వ్యాపారంలో ఎక్కువ సందర్భాల్లో 6 నెలలకు మించి గడువు ఇస్తుంటారు.

అలాంటప్పుడు సంబంధిత నిబంధనల ప్రకారం ఐటీసీ మొత్తం రివర్స్ చేయాల్సి ఉంటుంది. అంతేకాకుండా ఇన్వాయిస్ తేదీ నుంచి రివర్స్ చేయాల్సిన తేదీ వరకు తీసుకున్న ఐటీసీ మొత్తం వడ్డీ చెల్లించాలి. ఉదాహరణకు సరుకు తీసుకున్న ఇన్వాయిస్ తేదీ జనవరి 1 అనుకుంటే గరిష్ఠంగా జూన్ 29 లేదా 30 వరకు ఈ 180 రోజుల గడువు పూర్తవుతుంది. ఇన్వాయిస్ విలువ మొత్తం మీద రూ.లక్ష. దానిమీద ఐటీసీ రూ.18,000 అనుకుంటే మొత్తం రూ.1,18,000 ఈ తేదీ లోపులో చెల్లించి ఉండాలి. లేని పక్షంలో ఐటీసీ కింద తీసుకున్న రూ.18,000 దాంతో పాటుగా జనవరి 1 నుంచి వడ్డీ (18 శాతం) చొప్పున చెల్లించాలి. ఒకవేళ 180 రోజుల లోపు కొంత మొత్తం చెల్లించి ఉంటే, చెల్లించని భాగానికి సంబంధించిన ఐటీసీపై లెక్క ప్రకారం రివర్స్ చేయాల్సి ఉంటుంది వడ్డీతో సహా.

ఇక సరుకు వెనక్కి పంపేటప్పుడు అంటే ఒక హోల్‌సేల్ వ్యాపారి నుంచి పొందిన సరుకును రిటైల్ వ్యాపారి వెనక్కు పంపుతుంటే కొన్ని సందర్భాల్లో రిటైల్ వ్యాపారి డెబిట్ నోట్ జారీ చేస్తుంటాడు. ఇది తప్పు. క్రెడిట్ నోట్ లేదా డెబిట్ నోట్‌ను వాస్తవంగా సరుకు ఎవరైతే పంపారో వారే ఇవ్వాలి. అంటే ఈ సందర్భంలో సరుకు పంపింది హోల్‌సేల్ వ్యాపారి కాబట్టి ఇలా వెనక్కు వచ్చే సరుకు మేరకు ఒక క్రెడిట్ నోట్ రిటైల్ వ్యాపారికి తనే జారీ చేయాలి. క్రెడిట్ నోట్‌లో ఉన్న మొత్తం ఆ హోల్‌సేల్ వ్యాపారి తదుపరి రిటర్న్‌లో తగ్గించుకోవచ్చు. ఇలా చేయాలంటే రెండు నిబంధనలు ఉన్నాయి.

మొదటిది.. సదరు రిటైల్ వ్యాపారి తాను వెనక్కు పంపే సరుకుకు సంబంధించిన ఐటీసీ రివర్స్ చేయాలి. అలాగే హోల్‌సేల్ వ్యాపారి తగ్గింపు చేసుకోవటం అనేది ఇన్వాయిస్ ఇచ్చిన తదుపరి ఆర్థిక సంవత్సరం నవంబరు 30 లోపులోనే చేసుకోవాలి. ఉదాహరణకు 2024 జనవరి 1న ఇన్వాయిస్ జారీ చేసి ఉంటే గరిష్ఠంగా 2024 నవంబరు 30 లోపు మాత్రమే క్రెడిట్ నోట్ మీద తగ్గింపు సాధ్యమవుతుంది.

ఇందులో ఇంకొక పద్ధతి ఏమిటంటే సరుకు వెనక్కు పంపే వ్యక్తి అంటే రిటైల్ వ్యాపారి తాను వెనక్కు పంపే సరుకును అమ్మకం కింద చూపిస్తూ హోల్‌సేల్ వ్యాపారి పేరు మీద ఒక ఇన్వాయిస్ జారీ చేయవచ్చు. అప్పుడు ఆ ఇన్వాయిస్‌కు సంబంధించిన ట్యాక్స్ రిటైల్ వ్యాపారి తాను రిటర్న్‌లో చూపిస్తూ ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉండగా.. హోల్‌సేల్ వ్యాపారి ఆ మొత్తానికి సంబంధించిన ఐటీసీ తీసుకోవచ్చు. అంటే ఇక్కడ రిటైల్ వ్యాపారి అమ్మకందారుడు, హోల్‌సేల్ వ్యాపారి కొనుగోలుదారుడిగా భావించాలి. సంబంధిత నియమ నిబంధనలను ఇద్దరూ పాటించాలి. అలాగే ఇవే నిబంధనలు హోల్‌సేల్ వ్యాపారి నుంచి కొనుగోలు చేసేటప్పుడు, తిరిగి వెనక్కు పంపేటప్పుడు వర్తిస్తాయి.

ఇంకొక సాధారణ విషయం, సాధారణంగా రిటైల్ వ్యాపారులు.. రైతుల నుంచి సరుకుకు సంబంధించి ఆలస్యాన్ని బట్టి వడ్డీ వసూలు చేస్తుంటారు. ఇలాంటప్పుడు ఆ వడ్డీ మీద కూడా పన్ను చెల్లించాలి. అంటే ఆ సరుకుకు ఎంత శాతం పన్ను వర్తిస్తుందో అంత శాతం ఈ వడ్డీ మీద కూడా చెల్లించాలి. ఈ నిబంధన కూడా కేవలం రిటైల్ వ్యాపారులకే కాకుండా అమ్మిన సరుకుకు సంబంధించి వడ్డీ, పెనాల్టీ ఎవరైతే వసూలు చేస్తారో వారందరికి వర్తిస్తుంది.

ముందుగా చెప్పినట్లు ఈ వ్యాపారంలో ఉండే వారు జీఎస్‌టీ మీద సరైన అవగాహన పెంపొందించుకోవాలి. ముఖ్యంగా హోల్‌సేల్ వ్యాపారులు.. మండల, గ్రామీణ స్థాయిలో ఉండే వ్యాపారులకు సరైన అవగాహన కల్పిస్తే ఇద్దరికీ ఇబ్బంది లేకుండా ఉంటుంది.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

బిజినెస్ ప్లస్



దేశంలో వడ్డీ రేట్లు పడిపోతున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కీలక రెపో వడ్డీ రేటు ఒక శాతం తగ్గించింది. దీంతో బ్యాంకులు ఫిక్స్‌డ్ డిపాజిట్ల (ఎఫ్‌డీ)పై వడ్డీ రేట్లు కుదిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో సీనియర్ సిటిజన్ల పరిస్థితి ఏంటి? స్థిర ఆదాయం కోసం వారు వేటిని ఆశ్రయిస్తే మంచిది. ఆ వివరాలు మీకోసం..

స్థిర ఆదాయానికి భరోసా..

సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్

జూన్ నెల రిటైల్ ద్రవ్యోల్బణం ఆరేళ్ల కనిష్ఠ స్థాయికి పడిపోయింది. దీంతో వచ్చే నెలలో జరిగే ద్రవ్య పరపతి విధాన సమీక్ష (ఎంపీసీ) భేటీలో ఆర్‌బీఐ కీలక రెపో వడ్డీ రేటును మరింత తగ్గించే సూచనలు కనిపిస్తున్నాయి. అదే జరిగితే బ్యాంకులు ఎఫ్‌డీలపై వడ్డీ రేట్లు మరింత తగ్గించడం ఖాయం. ఇప్పటికే స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు తప్ప ఏ బ్యాంక్ కూడా సీనియర్ సిటిజన్లతో పాటు ఎవరికీ వారి ఎఫ్‌డీలపై 8 శాతానికి మించి వడ్డీ చెల్లించడం లేదు.

ఏమిటి మార్గం?

వడ్డీ రేట్లు తగ్గుతున్న ఈ పరిస్థితుల్లో సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ (ఎస్‌సీఎస్‌ఎస్) ఆకర్షణీయంగా కనిపిస్తోంది. ఈ పథకం కింద చేసిన డిపాజిట్లపై 8.2 శాతం వడ్డీని ఆఫర్ చేస్తున్నారు. పోస్టాఫీసుల్లో పొదుపు ఖాతా ఉన్న వారికి ఈ ఎస్‌సీఎస్‌ఎస్ అందుబాటులో ఉంటుంది. లేదంటే కొత్తగా ఖాతా తెరవవచ్చు. అయితే ఈ వడ్డీ రేటును ప్రభుత్వం అక్టోబరు 1 నుంచి సవరించే అవకాశం ఉంది. అయినా బ్యాంక్ ఎఫ్‌డీలతో పోలిస్తే ఎస్‌సీఎస్‌ఎస్ సురక్షితమైన, స్థిర ఆదాయ పెట్టుబడి అని చెప్పవచ్చు.

అర్హతలు

ఎస్‌సీఎస్‌ఎస్ అందరికీ వర్తించదు. 60 సంవత్సరాలు నిండిన భారత పౌరులకు మాత్రమే వర్తిస్తుంది. ప్రత్యేక లేదా సాధారణ వీఆర్‌ఎస్ తీసుకున్న వ్యక్తులు, రిటైర్ అయిన సైనిక సిబ్బంది వయస్సు 60 ఏళ్ల కంటే తక్కువ ఉన్నా.. ఈ పథకానికి అర్హులే.

పెట్టుబడుల పరిమితి

ఈ పథకంలో ఏటా కనీసం రూ.1,000, గరిష్ఠంగా రూ.30 లక్షల వరకు మదుపు చేయవచ్చు. అదే పదవీ విరమణ చేసిన వారయితే తమ రిటైర్మెంట్ మొత్తం లేదా రూ.30 లక్షలు.. ఇందులో ఏది తక్కువైతే దాన్ని పెట్టుబడిగా ఆమోదిస్తారు. రిటైర్మెంట్ ప్రయోజనాలు అందిన నెల రోజుల్లోపే ఈ పెట్టుబడి పూర్తి చేయాలి.

పన్ను ప్రయోజనాలు

ఎస్‌సీఎస్‌ఎస్ డిపాజిట్లపై ఆదాయ పన్ను (ఐటీ) చట్టం కింద పన్ను ప్రయోజనాలు కూడా లభిస్తాయి. ఈ పథకంలో ఏటా చేసే డిపాజిట్లలో రూ.1.5 లక్షల వరకు సెక్షన్ 80సీ కింద ఆదాయ మినహాయింపు లభిస్తుంది. వడ్డీ ఆదాయానికి మాత్రం ఎలాంటి పన్ను మినహాయింపు ఉండదు. అయితే సెక్షన్ 80 టీటీబీ కింద సీనియర్ సిటిజన్లు వడ్డీ ఆదాయంలోనూ రూ.50,000 వరకు పన్ను మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు.

వడ్డీ చెల్లింపు

ఎస్‌సీఎస్‌ఎస్ డిపాజిట్లపై వడ్డీని మూడు నెలలకు ఒకసారి చొప్పున చెల్లిస్తారు. దీనివల్ల సీనియర్ సిటిజన్లకు మార్కెట్ ఆటుపోట్లతో సంబంధం లేకుండా స్థిరమైన ఆదాయం అందుతుంది.

భద్రత

ఎస్‌సీఎస్‌ఎస్.. బ్యాంక్ ఎఫ్‌డీల కంటే సురక్షితమైనది. ఎందుకంటే ఈ పథకం అసలు, వడ్డీ చెల్లింపులకు కేంద్ర ప్రభుత్వ హామీ ఉంటుంది. అందుకే జీవిత చరమాంకంలో ఉన్న పండుటాకులకు, ఇది అత్యంత భద్రతతో కూడిన పెట్టుబడిగా చెబుతారు.

అకౌంట్ క్లోజింగ్

ఈ పథకం కాలపరిమితి ఐదేళ్లు. కావాలంటే మరో మూడేళ్లు పొడిగించుకోవచ్చు. పాస్‌బుక్, అప్లికేషన్ ఫారం పూర్తి చేసి పోస్టాఫీస్‌లో ఇస్తే.. అప్పటి వరకు మన ఖాతాలో జమ అయిన మొత్తాన్ని ఖాతాదారుడికి చెల్లిస్తారు.

ముందే మరణిస్తే?

ఒకవేళ ఖాతాదారుడు మెచ్యూరిటీకి ముందే మరణిస్తే.. చనిపోయిన తేదీ నుంచి పోస్టాఫీస్ పొదుపు ఖాతాపై చెల్లించే వడ్డీ రేటు చెల్లిస్తారు. చనిపోయిన వ్యక్తి ఎస్‌సీఎస్‌ఎస్ ఖాతా తెరిచేటప్పుడే జీవిత భాగస్వామిని జాయింట్ హోల్డర్ లేదా నామినీగా పేర్కొంటే పథకం మెచ్యూరిటీ వరకు అదే వడ్డీ రేటు కొనసాగుతుంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	99,930 ▼	91,600 ▼	1,26,000 ▼
విజయవాడ	1,01,250 ▼	96,000 ▼	1,16,500 ▼
విశాఖపట్నం	99,930 ▼	91,600 ▼	1,26,000 ▼
రాజమండ్రి	99,930 ▼	91,600 ▼	1,18,000 ▼
ప్రొద్దుటూరు	98,600 ▼	90,710 ▼	1,15,800 ▼
ముంబై	98,390 ▼	90,120 ▼	1,14,340 ▼

పబ్లిక్ ఇష్యూకు నెఫ్రోప్లస్

హైదరాబాద్ కేంద్రంగా నెఫ్రోప్లస్ పేరుతో డయాలసిస్ సేవలందిస్తోన్న నెఫ్రోకేర్ హెల్త్ సర్వీసెస్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కి వస్తోంది. ఐపీఓలో భాగంగా రూ.353.4 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ప్రమోటర్లు, వాటాదారులకు చెందిన 1.27 కోట్ల ఈక్విటీ షేర్లను ఓఎఫ్ఎస్ పద్ధతిన విక్రయించనుంది. మొత్తంగా ఐపీఓ ద్వారా రూ.2,000 కోట్లకు పైగా సమీకరించనున్నట్లు తెలిసింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



27వ తేదీ			
హైదరాబాద్	425	విజయవాడ	475
వరంగల్	427	గోదావరి	455
చిత్తూరు	503	విశాఖపట్నం	465
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	115	విజయవాడ	114
వరంగల్	115	గుంటూరు	119
కరీంనగర్	115	ఒంగోలు	122
మహబూబ్‌నగర్	115	చిత్తూరు	113
కర్నూలు	115	నెల్లూరు	118
విశాఖపట్నం	97	అనంతపురం	118
గోదావరి	114		

జస్టిస్ వర్మ అభిశంసనపై కేంద్రం 'నియంత్రణ'!

ధన్‌ఖడ్ స్వతంత్రంగా వ్యవహరించడమే నేరమైంది: సింఘ్వీ

న్యూఢిల్లీ, జూలై 26: ఉపరాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ ఆకస్మిక రాజీనామాకు గల కారణాలపై వివాదం కొనసాగుతూనే ఉంది. రాజ్యసభ చైర్మన్ హోదాలో ధన్‌ఖడ్ స్వతంత్రంగా వ్యవహరించడమే ఆయన చేసిన పెద్ద నేరంగా కనిపిస్తోందని కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ సింఘ్వీ వ్యాఖ్యానించారు. జస్టిస్ వర్మ అభిశంసన తీర్మానం విషయంలో రాజ్యసభ చైర్మన్‌గా ధన్‌ఖడ్ వ్యవహరించిన తీరు కేంద్రంలోని పెద్దలకు కొరుకుడు పడలేదని, అందుకే ఆయనను రాజీనామా చేసేలా వ్యవహరించారని ఆరోపించారు. జస్టిస్ వర్మ అభిశంసనపై నియంత్రణను కేంద్రం తన చేతిలోకి తెచ్చుకోవాలని భావించిందన్నారు. దీనికి ధన్‌ఖడ్ ఒప్పుకోకపోవడం, స్వతంత్రంగా వ్యవహరించడంతో.. "ముందు లోక్‌సభలోనే మా తీర్మానం. రాజ్యసభలో కాదు. నీతో పనిలేదు పో." అన్నట్టుగా కేంద్రం వ్యవహరించిందని సింఘ్వీ వ్యాఖ్యానించారు.

బిహార్‌లో జర్నలిస్టుల పెన్షన్ 15 వేలకు పెంపు

పట్నా, జూలై 26: అసెంబ్లీ ఎన్నికలకు ముందు బిహార్ ప్రభుత్వం జర్నలిస్టులకు శుభవార్త తెలిపింది. వారికి అందిస్తున్న నెలవారీ పింఛనును రూ.9వేల మేర పెంచుతున్నట్లు ప్రకటించింది. 'బిహార్ పత్రికార్ సమ్మాన్' పింఛన్ పథకం కింద ఇప్పటివరకు రూ.6 వేలు పొందుతున్న జర్నలిస్టులకు ఇకపై రూ.15 వేల పింఛను లభించనుంది. పింఛను తీసుకుంటున్న జర్నలిస్టు మరణించిన సందర్భంలో జీవిత భాగస్వామికి లేదా ఆ జర్నలిస్టుపై ఆధారపడిన వ్యక్తికి ఇప్పటివరకు ఇస్తున్న రూ.3 వేల పెన్షన్ కూడా రూ.10వేలకు పెంచుతున్నట్లు సీఎం నితీశ్ ప్రకటించారు.

ఝార్ఖండ్‌లో ఎన్‌కౌంటర్..ముగ్గురు నక్సలైట్ల మృతి

గుమ్లా, జూలై 26: ఝార్ఖండ్‌లోని గుమ్లా జిల్లాలో భద్రతా బలగాలతో జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు నక్సలైట్లు మరణించారు. వారిని సీపీఎం(మావోయిస్టులు) నుంచి విడిపోయిన ఝార్ఖండ్ జన ముక్తి పరిషత్ (జేజేఎంపీ) సభ్యులుగా పోలీసులు గుర్తించారు. ఘాగ్రా పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ ఇంట్లో నక్సలైట్లు తలదాచుకున్నట్లు తమకు ఇంటెలిజెన్స్ సమాచారం అందిందని గుమ్లా ఎస్పీ హారిస్ తెలిపారు. ఝార్ఖండ్ జాగ్వర్ బలగాలు, గుమ్లా పోలీసుల సిబ్బంది సంయుక్తంగా ఈ ఆపరేషన్ చేపట్టాయన్నారు. బలగాల రాకను గుర్తించిన నక్సలైట్లు.. కాల్పులు జరిపి తప్పించుకునే ప్రయత్నం చేశారన్నారు. ఈ క్రమంలో ముగ్గురు నక్సలైట్లు మృతి చెందగా, మరో ఇద్దరు పరారయ్యారని చెప్పారు.

రిటైర్మెంట్ తర్వాత ప్రభుత్వ పదవులు చేపట్టను

- మధ్యవర్తిత్వం చేస్తా.. సీజేఐ గవాయ్ స్పష్టీకరణ

అమరావతి (మహారాష్ట్ర), జూలై 26: పదవీ విరమణ తర్వాత తాను ఎలాంటి ప్రభుత్వ పదవులు చేపట్టబోనని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బీ.ఆర్.గవాయ్ చెప్పారు. సలహా సంప్రదింపులు, మధ్యవర్తిత్వం వంటి సేవలు అందిస్తానని తెలిపారు. శనివారం అమరావతి జిల్లా, సెషన్స్ కోర్టు ఆవరణలో టి.ఆర్.గిల్డా స్మారక ఈ-గ్రంథాలయాన్ని ప్రారంభించిన సందర్భంగా జరిగిన సభలో ఆయన ప్రసంగిస్తూ ఈ విషయాన్ని వెల్లడించారు. నవంబరు 23న ఆయన పదవీ విరమణ చేయనున్నారు. నవంబరు 24 తర్వాత ఎలాంటి ప్రభుత్వ పదవిని అంగీకరించబోనని తెలిపారు.

తుపాకులతో బెదిరించి భారత పౌరులను బంగ్లాదేశ్‌లోకి తరలిస్తున్నారు: అసదుద్దీన్

న్యూఢిల్లీ, జూలై 26: బెంగాలీ మాట్లాడే ముస్లింలను అక్రమ వలసదారులని ముద్ర వేసి అరెస్ట్ చేయడం, బలవంతంగా సరిహద్దు దాటించడం తగదని ఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ విమర్శించారు. బలహీనులతో కేంద్రం కఠినంగా వ్యవహరిస్తోందని తుపాకులతో బెదిరించి భారత పౌరులను బంగ్లాదేశ్‌లోకి తరలిస్తున్నారని ఎక్స్ వేదికగా ఆయన ఆరోపించారు. కేంద్రం అక్రమవలసదారులుగా ముద్ర వేస్తున్న వారంతా నిరుపేదలు, మురికివాడల్లో ఉండేవారు, ఇళ్లల్లో పనిచేసేవారు, చెత్త ఏరుకునేవారని ఒవైసీ చెప్పారు. రోహింగ్యాలను, బంగ్లాదేశీలను గుర్తించి సరిహద్దు దాటించాలంటూ గురుగ్రామ్ కలెక్టర్ జారీ చేసిన అధికారిక ఉత్తర్వును ఒవైసీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. పూణేలోని బుధవార్‌పేట్‌లో ఐదుగురు బంగ్లాదేశీ మహిళలను పోలీసులు అరెస్ట్ చేసిన నేపథ్యంలో ఒవైసీ ప్రకటనకు ప్రాధాన్యం ఏర్పడింది.

పాఠశాలల్లో భద్రతా తనిఖీలు తప్పనిసరి: కేంద్రం

న్యూఢిల్లీ, జూలై 26: పాఠశాలల్లో భద్రత, సౌకర్యాలపై తప్పనిసరిగా తనిఖీలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం శనివారం అన్ని రాష్ట్రాలను ఆదేశించింది. ఈ విషయంలో వెంటనే చర్యలు చేపట్టాలని సూచించింది. రాజస్థాన్‌లోని ఝులావర్‌లో శుక్రవారం ఓ పాఠశాల భవనం కుప్పకూలి ఏడుగురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటన నేపథ్యంలో కేంద్ర విద్యా శాఖ.. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు మార్గదర్శకాలు జారీ చేసింది. అన్ని పాఠశాల భవనాల స్థితిగతులు, సామర్థ్యాన్ని పరిశీలించాలని పేర్కొంది. అగ్ని ప్రమాదాల నివారణకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారు? ఏదైనా ప్రమాదం సంభవిస్తే బయటకెళ్లేందుకు అత్యవసర మార్గాలున్నాయా లేవా? అనేది తనిఖీ చేయాలని ఆదేశించింది.

గాజాలో ఇజ్రాయెల్ అమానుషాన్ని అడ్డుకోండి

- కేంద్రానికి భారత ముస్లిం సంస్థలు, మేధావుల వినతి

న్యూఢిల్లీ, జూలై 26: గాజాలో ఇజ్రాయెల్ అమానుష చర్యలను అడ్డుకోవాలని భారత్‌లోని ముస్లిం సంస్థలు, ముస్లిం మేధావులు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అనాదిగా పీడితుల పక్షాన నిలిచే దేశ వారసత్వాన్ని కొనసాగించాలని సూచించారు. భారత్‌లోని 20 కోట్ల మంది ముస్లింల తరఫున పాలస్తీనా ప్రజలకు తాము మద్దతుగా నిలుస్తామంటూ ఓ ప్రకటన విడుదల చేశారు.

ఐరోపాను వలసలు చంపేస్తున్నాయి: ట్రంప్

వాషింగ్టన్, జూలై 26: ఐరోపాను వలసలు చంపేస్తున్నాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యానించారు. ఐరోపా దేశాలన్నీ సంయుక్తంగా దీనిపై ఒక నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఐరోపా పర్యటనకు బయలుదేరిన ట్రంప్ శనివారం స్కాట్లాండ్‌లో విమానం దిగిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ 'ఐరోపాలోని అనేక దేశాలు భయంకరమైన చొరబాట్లను ఆపాల్సి ఉంది. లేకుంటే మీకు ఇక ఐరోపా ఉండదు' అన్నారు. 'గత నెలలో ఒక్కరు కూడా మా దేశంలోకి చొరబడకుండా చూశాం. అక్కడికి వచ్చిన అనేకమంది చొరబాటుదార్లను పట్టుకొని వెనక్కి పంపించేశాం' అన్నారు. ఐక్యరాజ్యసమితి అంచనా మేరకు 2020లో ఐరోపాలో 8.7 కోట్ల మంది అంతర్జాతీయ వలసదారులున్నారు.

మళ్లీ ముంచిన గూగుల్ మ్యాప్స్

- ముంబైలో నీటి ప్రవాహంలోకి దూసుకెళ్లిన కారు
- క్షేమంగా బయటపడ్డ డ్రైవర్



ముంబై, జూలై 26: గూగుల్ మ్యాప్స్‌ను నమ్ముకుని మరో కారు డ్రైవర్ నీట మునిగారు. ముంబైలో గూగుల్ మ్యాప్స్ చూపిన తప్పుదారిలో కారు నడుపుకొంటూ వెళ్లిన ఓ మహిళ చివరకు సముద్రం బ్యాక్ వాటర్ ప్రవహించే బేలో పడిపోయారు. అక్కడ ఉన్న జెట్టీ సెక్యూరిటీ సిబ్బంది తక్షణం స్పందించడంతో ఆమె క్షేమంగా బయటపడ్డారు. శుక్రవారం నవీ ముంబైలోని బేలాపూర్ మీదుగా ఉల్వే వెళ్లడానికి ఆమె గూగుల్ మ్యాప్స్‌ను అనుసరించినపుడు ఈ ఘటన జరిగింది. బేలాపూర్ వద్ద బే బ్రిడ్జిపై నుంచి చూపించాల్సిన దారిని గూగుల్ మ్యాప్స్ బ్రిడ్జి కింద నుంచి చూపింది. ఆ దారి ధ్రువతార జెట్టీ వద్దకు వెళ్తుంది. ఇది తెలియని ఆమె ముందుకే డ్రైవ్ చేసుకుంటూ వెళ్లారు. కొద్ది సేపటికే జెట్టీ నుంచి నీటిలో పడిపోయారు. ఇది చూసిన మెరైన్ సెక్యూరిటీ అధికారులు వెంటనే స్పందించారు. నీటిపై తేలుతున్న ఆమెను నిమిషాల వ్యవధిలోనే రక్షించారు. ఆమె కారును కూడా బయటకు తీశారు. గాయాలేవీ లేకుండానే ప్రమాదం నుంచి ఆ మహిళ బయటపడ్డారు.

మానసిక సమస్యలతో.. విద్యార్థుల ఆత్మహత్యలు!



- ఆందోళన వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, జూలై 26: విద్యార్థుల ఆత్మహత్యలపై శుక్రవారం సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. భావిపౌరుల మరణాలు వ్యవస్థాపక వైఫల్యాలుగా జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం అభివర్ణించింది. ఆత్మహత్యల నిరోధానికి పలు మార్గదర్శకాలను జారీ చేసింది. ఎన్‌సీఆర్‌బీ 2022లో ప్రచురించిన 'యాక్సిడెంటల్ డెత్స్ అండ్ సూసైడ్స్ ఇన్ ఇండియా' నివేదికను ఉటంకిస్తూ.. చాలా దారుణమైన పరిస్థితులను గమనిస్తున్నామని వ్యాఖ్యానించింది. "మానసిక ఒత్తిడి, విద్యాభారం, సామాజిక వివక్ష, విద్యాసంస్థల తీరు వంటి కారణాలతో విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఇది వ్యవస్థాపక వైఫల్యాన్ని సూచిస్తోంది" అని ధర్మాసనం ఆవేదన వ్యక్తం చేసింది. విశాఖపట్నంలో నీట్ అభ్యర్థి అయిన ఓ 17 ఏళ్ల యువతి ఆత్మహత్య కేసును సీబీఐకి బదలాయించాలన్న అభ్యర్థనను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తోసిపుచ్చింది. దీనిపై దాఖలైన అప్పీల్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం విచారించిన సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. విద్యార్థుల్లో మానసిక ఆరోగ్య సమస్యలు తీవ్రమవుతున్నాయని.. కోటా, జైపూర్, సీకార్, విశాఖపట్నం, హైదరాబాద్, ఢిల్లీ లాంటి నగరాల్లో ఇవి మరీ తీవ్రస్థాయిలో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఆత్మహత్యల నివారణకు పలు సూచనలు చేసింది. ఆయా అంశాలను 90 రోజుల్లో అమలు చేసేలా అఫిడవిట్ సమర్పించాలని ఆదేశాలు జారీ చేసింది.


సుప్రీంకోర్టు సూచనలు

- ప్రతి విద్యాసంస్థలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా కౌన్సెలర్లను నియమించుకోవాలి
- టెలీ-మానస్ టోల్‌ఫ్రీ సహా.. ఆత్మహత్యల నివారణకు హాస్టళ్లు, తరగతి గదుల వద్ద హెల్ప్‌లైన్ నంబర్లను ప్రదర్శించాలి
- బోధన, బోధనేతర సిబ్బందికి కౌన్సెలింగ్‌లో శిక్షణనివ్వాలి. ఏటా రెండుసార్లు ఈ శిక్షణ ఉండాలి
- విద్యార్థుల మానసిక స్థితిని ఎప్పటికప్పుడు గమనించాలి. ఆత్మహత్య సంకేతాల(సూసైడల్ ఇంటెన్షన్)ను గుర్తించాలి
- ర్యాగింగ్, లైంగిక వేధింపులపై తక్షణ చర్యలు తీసుకునేలా విద్యాసంస్థల్లో అంతర్గత కమిటీలు ఉండాలి
- గురుకులాలు, హాస్టళ్ల వద్ద డ్రగ్స్ వినియోగం, వేధింపులపై నిఘా పెట్టాలి.

అంగుళం తేడానూ పట్టేసే నిసార్

భూమిపై అడవులు, పంటలు, మంచు అన్నీ జల్లెడ పట్టేసే ఉపగ్రహం.. 12 రోజులకోసారి భూమంతా స్కాన్

- భూకంపాలు, కొండ చరియలు విరిగిపడే ముప్పును ముందే గుర్తించే అవకాశం
- నాసా, ఇస్రో ఉమ్మడి ప్రాజెక్టు ప్రత్యేకతలు
- 30న శ్రీహరికోట నుంచి నింగిలోకి



న్యూఢిల్లీ, జూలై 26: భూమి అణువణువును 12 రోజులకోసారి స్కాన్ చేసేస్తుంది. అడవులు, మైదానాలు, కొండలు, పర్వతాలు, పంటలు, జల వనరులు, మంచు ప్రాంతాలు.. ఇలా అన్నింటినీ జల్లెడ పడుతుంది. భూమి పొరల్లో ఒక్క అంగుళం మార్పు వచ్చినా గుర్తించేస్తుంది. కొండచరియలు విరిగిపడటాన్ని, భూకంపాలను, అగ్నిపర్వతాలు బద్దలవడాన్ని ముందే గుర్తించేందుకు అవకాశం ఇస్తుంది. ఇది అమెరికా, భారత అంతరిక్ష పరిశోధన సంస్థలు నాసా, ఇస్రో సంయుక్తంగా చేపట్టిన 'నిసార్ (నాసా ఇస్రో సింథటిక్ అపార్చర్ రాడార్)' ఉపగ్రహం ప్రత్యేకత ఇది. ఒక ట్రక్కు పరిమాణంలో, 2,393 కిలోల బరువున్న నిసార్ ఉపగ్రహాన్ని ఈ నెల 30న సాయంత్రం 5.40 గంటలకు శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి జీఎస్ఎల్‌వీ ఎఫ్16 రాకెట్ ద్వారా అంతరిక్షంలోకి పంపనున్నారు. ఈ ఉపగ్రహం భూమికి 743 కిలోమీటర్ల ఎత్తున సూర్యానువర్తన కక్ష్యలో పరిభ్రమిస్తూ పరిశీలిస్తుంది. దీనిలో నాసాకు చెందిన ఎల్-బ్యాండ్, ఇస్రోకు చెందిన ఎస్-బ్యాండ్ రాడార్లు, రెండింటి డేటాను సమ్మిళితం చేసే డ్యూయల్ ఫ్రీక్వెన్సీ సింథటిక్ అపార్చర్ రాడార్ (సార్), 12 మీటర్ల వ్యాసం ఉండే జల్లెడ వంటి ప్రత్యేక రాడార్ యాంటెన్నా ఉంటాయి. ఇలాంటి ఉపగ్రహం ప్రపంచంలో ఇదే మొదటిది కావడం గమనార్హం.

భారత్‌కు వాటా సగం.. ఖర్చు స్వల్పం

నిసార్ ప్రాజెక్టులో నాసా, ఇస్రోలకు చెరో సగం సమాన వాటా ఉన్నాయి. ఇందుకు అనుగుణంగా శాటిలైట్ డిజైన్, తయారీ, పరికరాలు, గ్రౌండ్ స్టేషన్లు, రాకెట్, ప్రయోగం బాధ్యతలను ఇరు దేశాల మధ్య విభజించుకున్నాయి. ప్రాజెక్టుకు మొత్తం రూ.11,200 కోట్లు (1.3 బిలియన్ డాలర్లు) వ్యయం అవుతుండగా.. అందులో ఇస్రోకు అవుతున్నది సుమారు రూ. వెయ్యి నుంచి 1,200 కోట్లేనని అంచనా. ఇస్రో రాకెట్ ప్రయోగాలు, నిర్వహణ ఖర్చులు చాలా తక్కువ కావడంతో మన దేశం భరించాల్సిన వ్యయం స్వల్పంగా ఉందని.. ప్రాజెక్టులో వాటా మాత్రం సగం ఉంటుందని నిపుణులు వివరిస్తున్నారు.

నిసార్ ప్రత్యేకతలన్నో..

- భూమి పైపొరలో ఒక్క సెంటీమీటరు మార్పులు వచ్చినా గుర్తిస్తుంది. దీనితో భూకంపాలు, అగ్నిపర్వతాల పేలుళ్లు, కొండ చరియలు విరిగిపడటం, పర్వత ప్రాంతాల్లో మంచు చరియలు విరిగిపడే పరిస్థితులను ముందే గుర్తించవచ్చు.
- భూమిపై, సముద్రాల్లో మంచు పరిస్థితిని, ఎంతెంత మందంతో ఉంది? కరిగి నీరుగా మారే తీరును కచ్చితత్వంతో గుర్తిస్తుంది. పర్యావరణ ప్రభావాలను గుర్తించడానికి తోడ్పడుతుంది.
- భూమిపై అడవులు, పంటల విస్తీర్ణం, అభివృద్ధి, పచ్చదనంలో తేడాలను.. నేల తేమను, నీటి వనరులను గుర్తిస్తుంది. వాటిలో ఎప్పటికప్పుడు వచ్చే తేడాలను గమనిస్తుంది. తగిన చర్యలు తీసుకునేందుకు వీలు కల్పిస్తుంది.
- తుపానులు, వరదలు, సునామీలు, కార్చిచ్చులు వంటివాటి రియల్ టైమ్ డేటా (ఆ సమయంలో నెలకొన్న పరిస్థితి)ని అందించి.. సహాయక చర్యలకు తోడ్పడుతుంది.
- భూమి పరిశీలనకు సంబంధించి నిసార్ ఉపగ్రహం నుంచి రోజుకు 4,300 గిగాబైట్ల (సుమారు వెయ్యి నుంచి 1,500 సినిమాల అంత) డేటా అందుతుందని నాసా తెలిపింది. ఈ డేటాను ప్రభుత్వంతో పాటు ప్రైవేటు సంస్థలు కూడా వినియోగించుకోవడానికి అందుబాటులో ఉంచనున్నట్టు వెల్లడించింది. ఇప్పటికే 80 సంస్థలు నిసార్ డేటా కోసం ఒప్పందం చేసుకున్నాయని వివరించింది.

లోకం తీరు



సిద్దరామయ్య, శివకుమార్ ప్రత్యేకాధికారుల మధ్య గొడవ!

బెంగళూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో 'సీఎం మార్పు' అంశంపై చర్చ కొనసాగుతూనే ఉన్న వేళ మరో వివాదం చర్చనీయాంశంగా మారింది. సీఎం సిద్దరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ప్రత్యేక అధికారుల (ఎస్‌డీవో) మధ్య తీవ్రస్థాయిలో గొడవ జరిగింది. ఇందుకు ఈనెల 22న ఢిల్లీలోని కర్ణాటక భవన్ వేదికైంది. సీఎం ఎస్‌డీవో మోహన్‌కుమార్ సిబ్బంది ఎదుటే తనను బూటుతో కొడతానని బెదిరించారని డీసీఎం ఎస్‌డీవో ఆంజనేయ ఆరోపించారు. ఆయన తన విధులకు ఆటంకం కలిగిస్తున్నారని, అన్ని విషయాల్లో కలగజేసుకుంటున్నారని పేర్కొన్నారు. తన గౌరవానికి భంగం కలిగిందని పేర్కొంటూ ఆయన సీఎస్ శాలిని రజనీశ్ ఫిర్యాదు చేశారు. కుమార్ గతంలో కూడా పలువురు సీనియర్ అధికారులతో దురుసుగా ప్రవర్తించిన చరిత్ర ఉందని పేర్కొన్నారు. ఆంజనేయ ఫిర్యాదుపై విచారణకు సీఎస్ రెసిడెంట్ కమిషనర్ ఇంకాంగ్లో జమీర్‌ను ఆదేశించారు.

అహ్మదాబాద్ బాధిత కుటుంబాలకు తాత్కాలిక పరిహారం చెల్లింపు

న్యూఢిల్లీ, జూలై 26: అహ్మదాబాద్ విమాన ప్రమాద బాధితుల కుటుంబాలకు ఎయిర్ ఇండియా తాత్కాలిక పరిహారం చెల్లించింది. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాల తక్షణ ఆర్థిక అవసరాల నిమిత్తం రూ.25 లక్షల తాత్కాలిక పరిహారాన్ని అందజేసినట్లు శనివారం ఎయిరిండియా ఓ ప్రకటనలో తెలిపింది. గత నెల 12న జరిగిన విమాన ప్రమాదంలో మొత్తం 260 మంది ప్రాణాలు కోల్పోయారు. వారిలో 166 మంది బాధిత కుటుంబాలకు తాత్కాలిక పరిహారం చెల్లించామని, మిగతా వారికి త్వరలో చెల్లింపులు జరుపుతామని పేర్కొంది. అహ్మదాబాద్ విమాన ప్రమాద బాధిత కుటుంబాలకు రూ. కోటి చెల్లిస్తామని ఎయిరిండియా ప్రకటించిన సంగతి తెలిసిందే.

ప్రియుడి కోసం భర్తకు 2సార్లు విషం పెట్టి హత్య

ఫిరోజాబాద్, జూలై 26: ప్రియుడితో కలిసి కట్టుకున్న భర్తను చంపాలనుకుందా భార్య! భోజనంలో విషం పెడితే.. తిని అస్వస్థతకు గురై ఆస్పత్రిలో ఆ భర్త కోలుకుంటే రెండోసారి విషం పెట్టి చంపేసింది. యూపీలో ఫిరోజాబాద్ సమీపంలోని ఉలావు అనే గ్రామంలో ఈ ఘోరం జరిగింది. హతుడి పేరు సునీల్. అతడి భార్య గ్రామంలోనే మరో యువకుడితో చనువుగా ఉంటోంది. మే 13న భోజనం చేశాక సునీల్ తీవ్ర అస్వస్థతకు గురవడంతో కుటుంబసభ్యులు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స చేసిన వైద్యులు మర్నాడు అతడిని డిశ్చార్జి చేశారు. కొన్నిరోజుల తర్వాత సునీల్ భార్య అతడికి పెరుగులో విషం కలిపి భోజనం పెట్టింది. ఈసారి తిన్నాక అతడు ప్రాణాలు విడిచాడు. సునీల్ మృతిపై అనుమానంతో అతడి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల దర్యాప్తులో.. సునీల్‌ను చంపేందుకు అతడి భార్య ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెట్టి విషాన్ని తెప్పించుకుందని తేలింది. దీంతో, సునీల్ భార్యను, ఆమె ప్రియుడిని పోలీసులు అరెస్టు చేసి కటకటాల్లోకి నెట్టారు.

మహారాష్ట్రలో హెచ్‌ఐవీ బాధితురాలిపై రేప్

లాతూర్, జూలై 26: మహారాష్ట్రలోని లాతూర్‌లో హెచ్‌ఐవీ బాధితుల సంరక్షణ కేంద్రంలో తల దాచుకున్న బాలిక(16)పై అందులోని ఓ ఉద్యోగి పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఇటీవల అనారోగ్యంతో పడిపోతే సంరక్షణ కేంద్రం నిర్వాహకులు ఆస్పత్రికి తరలించి, వైద్య పరీక్షలు నిర్వహించగా, ఆమె 4 నెలల గర్భవతి అని నిర్ధారించిన వైద్యులు.. తన సమ్మతి తీసుకోకుండానే గర్భస్రావం చేశారు. దీనిపై ఆ బాలిక సంరక్షణ కేంద్రం ఫిర్యాదుల పెట్టెలో చేసిన ఫిర్యాదు ప్రతినీ కేంద్రం యాజమాన్య ప్రతినిధులు చింపేశారు. అయితే, బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంస్థ వ్యవస్థాపకులు రవి బాపట్లె, సూపరింటెండెంట్ రచ్నా బాపట్లె, ఉద్యోగులు అమిత్ మహాముని, పూజలను శనివారం పోలీసులు అరెస్టు చేశారు.

బిహార్‌లో అంబులెన్స్‌లో యువతిపై అత్యాచారం

పట్నా, జూలై 26: బిహార్‌లో అంబులెన్స్‌లో ఓ మహిళపై సామూహిక అత్యాచారం జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. గయా జిల్లాలోని బోధ్ గయాలో ఈ నెల 24న నిర్వహించిన హోంగార్డ్ నియామక పరీక్షకు 26 ఏళ్ల మహిళ హాజరైంది. దేహదారుఢ్య పరీక్ష నిర్వహిస్తుండగా ఆమె స్పృహ తప్పి పడిపోయింది. ఆమెను ఆస్పత్రికి తరలించేందుకు అధికారులు అంబులెన్స్‌ను ఏర్పాటు చేశారు. అయితే అపస్మారక స్థితిలో ఉన్న తనపై అంబులెన్స్‌లో కొందరు అత్యాచారానికి పాల్పడినట్టు ఆమె ఆరోపించింది. పోలీసులు అంబులెన్స్ డ్రైవర్ వినయ్, టెక్నీషియన్ అజిత్‌లను అరెస్ట్ చేశారు.

ఆర్మీలో సరికొత్త దళం.. 'రుద్ర'

భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని 'ఆల్ ఆర్మ్స్ బ్రిగేడ్' ఏర్పాటు

- ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది వెల్లడి
- సైనికుల కుటుంబాలకు న్యాయ సహాయానికి కేంద్రం కొత్త పథకం
- కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా అమరులకు రాష్ట్రపతి, ప్రధాని నివాళి

న్యూఢిల్లీ, జూలై 26: కాలానుగుణంగా మారుతున్న యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో భవిష్యత్తులో సరిహద్దుల వద్ద శత్రుమూకల ఆటకట్టించేలా భారత ఆర్మీలో ఓ శక్తిమంతమైన దళం ఏర్పాటైంది. ఈ దళం పేరు 'రుద్ర'. ఇందులో పదాతి దళం, యుద్ధ వాహనాలు, సాయుధ యూనిట్లు, డ్రోన్లు, ఫిరంగి దళం, ప్రత్యేక శిక్షణ పొందిన సైనికులు... ఇలా విభిన్న రకమైన దళాలు ఒక గ్రూప్‌గా ఉంటాయని ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది శనివారం వెల్లడించారు. కార్గిల్ విజయ్ దివస్(జూలై 26)ను పురస్కరించుకొని ఆయన ఈ ప్రకటన చేశారు. భారత సైన్యం ప్రస్తుత సవాళ్లను ఎదుర్కోవడంతో పాటు భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఈ 'ఆల్ ఆర్మ్స్ బ్రిగేడ్'ను రూపొందించినట్లు ఆయన వివరించారు. దీంతో పాటు, సరిహద్దుల్లో మెరుపు ఆపరేషన్ల కోసం 'భైరవ్' పేరుతో లైట్ కమాండో బెటాలియన్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు ద్వివేది తెలిపారు. కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా ఆయన అమరవీరులకు నివాళులర్పించారు. కార్గిల్ అమర వీరులకు నివాళి అర్పించేందుకు 'ఈ-శ్రద్ధాంజలి' పేరుతో కొత్తగా యాప్‌ను విడుదల చేశారు. ఈ యాప్‌లో కార్గిల్ యుద్ధం, సైనికుల వీర గాథలు ఉంటాయన్నారు. కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకొని శనివారం రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్.. కార్గిల్ అమర వీరులకు నివాళులర్పించారు. సైనికులకు శుభాకాంక్షలు తెలిపారు. "భారత సైనికుల అసాధారణమైన శౌర్యానికి కార్గిల్ విజయం ప్రతీక" అని ముర్ము అన్నారు. సైనికుల త్యాగాలు భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని మోదీ కొనియాడారు.

సిందూర్ తర్వాతనే రూపకల్పన

భారతీయ సైనికుల కుటుంబాలకు చెందిన న్యాయ వివాదాల్లో సాయం కోసం కేంద్రం కొత్తగా 'నల్సా వీర్ పరివార్ సహాయతా యోజన'ను తీసుకువచ్చింది. ఈ పథకం కింద కేంద్రప్రభుత్వం సైనికుల కుటుంబాలకు న్యాయ సాయం అందించనుంది. సైనికులు సరిహద్దులో విధులు నిర్వహించడం, తరచూ ఇళ్లకు వెళ్లడానికి వీలు కాని నేపథ్యంలో కేంద్రం ఈ కొత్త పథకాన్ని తీసుకువచ్చింది. కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా దీన్ని ప్రకటించారు. శనివారం శ్రీనగర్‌లో జరిగిన ఓ సదస్సులో సుప్రీంకోర్టు న్యాయమూర్తి, నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ(నల్సా) ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ సూర్యకాంత్ ఈ పథకాన్ని ప్రారంభించారు.



లద్దాఖ్‌లోని కార్గిల్ యుద్ధ స్మారకం వద్ద ఉపేంద్రకు రాఖీ కడుతున్న ఓ విద్యార్థిని

ప్రత్యేక పాఠ్యాంశంగా ఆపరేషన్ సిందూర్

ఆపరేషన్ సిందూర్‌ను ప్రత్యేక పాఠ్యాంశంగా పెట్టాలని ఎన్‌సీఈఆర్‌టీ యోచిస్తోంది. పాఠ్యపుస్తకాల్లో భాగంగా కాకుండా విడిగా 8 నుంచి 10 పేజీలతో రెండు మాడ్యూల్స్‌లో విద్యార్థులకు అందించనుంది. మూడు నుంచి ఎనిమిదో తరగతి వరకు ఒకటి, 9 నుంచి 12వ తరగతి వరకు మరొక మాడ్యూల్‌ను అందిస్తారు. అత్యంత విజయవంతంగా నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌ను ప్రత్యేక పాఠ్యాంశంగా పెట్టడం ద్వారా విద్యార్థులకు భారత సైనిక శక్తి గురించి పూర్తి స్థాయిలో తెలిసి వస్తుందని ఎన్‌సీఈఆర్‌టీ భావిస్తోంది. దీంతో పాటు శుభాంశు శుక్లా రోదసి యాత్ర, చంద్రయాన్-3, ఆదిత్య ఎల్-వన్, కోవిడ్-19, జీ-20 సదస్సు, డిజిటల్ ఇండియా తదితర అంశాలను కూడా ప్రత్యేక పాఠ్యాంశాలుగా పెట్టాలని యోచిస్తోంది.

బానిసల్లా జిల్లా జడ్జిలు

- తీర్పులో మధ్యప్రదేశ్ హైకోర్టు జడ్జి జస్టిస్ శ్రీధరన్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, జూలై 26: జిల్లా జడ్జీలకు స్వేచ్ఛ లేదని, వారు హైకోర్టు న్యాయమూర్తులను చూసి భయపడుతున్నారని మధ్యప్రదేశ్ హైకోర్టు జడ్జి జస్టిస్ శ్రీధరన్ తన తీర్పులో తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. శాఖాపరమైన చర్యలు తీసుకుంటారేమోనన్న భయంతో అర్హమైన కేసుల్లోనూ బెయిల్ ఇవ్వలేకపోతున్నారని పేర్కొన్నారు. హైకోర్టు న్యాయమూర్తులు 'ఫ్యూడల్ లార్డ్‌'లుగా వ్యవహరిస్తూ జిల్లా స్థాయి జడ్జీలను 'బానిసలు'గా చూస్తున్నారని ఆక్షేపించారు. మధ్యప్రదేశ్‌లోని ఎస్సీ/ఎస్టీ ప్రత్యేక కోర్టు జడ్జిని ఉద్యోగం నుంచి తొలగించడాన్ని కొట్టివేస్తూ జస్టిస్ శ్రీధరన్ ఈ వ్యాఖ్యలు చేశారు. తగిన ఆధారాల్లేకుండానే జడ్జిని ఉద్యోగం నుంచి తొలగించారంటూ తప్పుపట్టారు. హైకోర్టు జడ్జిలు 'సవర్ణులు'గా భావిస్తూ, జిల్లా స్థాయి న్యాయాధికారులను 'శూద్రులు'గా చూస్తున్నారు" అని ఉపమానంగా చూపించారు.

నాసాలో 4 వేల మందికి వీఆర్ఎస్!

- ప్రభుత్వ వ్యయం తగ్గింపు కోసం ట్రంప్ యంత్రాంగం చర్యల ఫలితం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న శాస్త్రవేత్తలు



వాషింగ్టన్, జూలై 26: సూర్యుడికి అతి దగ్గరగా వెళ్లి పరిశోధనలు చేస్తున్న పార్కర్ సోలార్ ప్రోబ్ నుంచి 25వేల కోట్ల కిలోమీటర్లు ప్రయాణించి సౌర కుటుంబం అంచులనూ దాటి ముందుకెళ్తున్న వోయేజర్-1 వ్యోమనౌక దాకా అద్భుత పరిశోధనలకు నాసా (అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ) పెట్టింది పేరు. అలాంటి నాసా ఇప్పుడు వట్టిపోతోందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రభుత్వ వ్యయం తగ్గించడం కోసం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ యంత్రాంగం చేపట్టిన చర్యలు నాసాపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. బడ్జెట్‌లో నాసాకు 24 శాతం నిధులు తగ్గించడం, దానికితోడు సైంటిఫిక్ రీసెర్చ్ విభాగానికి నిధులు సగానికి సగం కోసేయడం నేపథ్యంలో.. కొందరు ఉద్యోగులను స్వచ్ఛంద పదవీ విరమణ కోసం ఒత్తిడి చేయడం మొదలైంది. 'వాలంటరీ ఎర్లీ రిటైర్మెంట్ అథారిటీ' కింద 870 మంది. 'వాలంటరీ సెపరేషన్ ఇన్సెంటివ్ ప్రోగ్రామ్' కింద 3 వేల మందికిపైగా నాసా ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నట్టు నాసా న్యూస్ విభాగం చీఫ్ చెరిల్ వార్నర్ తాజాగా వెల్లడించారు. ట్రంప్ అధికారంలోకి వచ్చిన జనవరి నుంచి జూన్ చివరి వరకు సుమారు 500 మంది ఉద్యోగులు నాసాను వీడారని తెలిపారు. వచ్చే ఏడాది జనవరి నాటికి నాసా ఉద్యోగుల సంఖ్య 20శాతం మేర తగ్గి 14 వేల లోపునకు తగ్గిపోతుందని అంచనా వేశారు. ట్రంప్ యంత్రాంగం చర్యలతో నాసా శాస్త్రవేత్తలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2003లో కొలంబియా స్పేస్ షటిల్ పేలిపోయిన ఘటనను గుర్తుచేస్తూ.. వ్యయం తగ్గింపుతో భద్రతా ప్రమాణాలపై రాజీ పడాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. ప్రభుత్వ చర్యలతో పరిశోధనలకు విఘాతం కలగడం నుంచి వ్యోమగాముల భద్రత ప్రమాదంలో పడటం వరకు జరగబోయే పరిణామాలను ప్రస్తావిస్తూ రూపొందించిన 'వోయేజర్ డిక్లరేషన్'పై 362 మంది నాసా ప్రస్తుత, పూర్వ శాస్త్రవేత్తలు సంతకాలు చేసి.. నాసా చీఫ్‌కు పంపారు.

మాల్దీవుల స్వాతంత్ర్య వేడుకలకు గౌరవ అతిథిగా మోదీ

మాలె, జూలై 26: మాల్దీవుల ప్రజల ఆకాంక్షలకు భారత్ అండగా ఉంటుందని ప్రధాని మోదీ చెప్పారు. ఆ దేశ స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చిన ఆయన శనివారం ఆ దేశ ఉపాధ్యక్షుడు హుసేన్ మహమద్ లతీఫ్ సహా పలువురు నేతలను కలుసుకొన్నారు. 60వ స్వాతంత్ర్య దిన వేడుకలు జరుపుకొంటున్నందుకు శుభాకాంక్షలు తెలిపారు. అవసరమైన సమయంలో తమ దేశానికి భారత్ అండగా నిలుస్తున్నందుకు ప్రధానికి లతీఫ్ కృతజ్ఞతలు తెలిపారని విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ ఒక సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. కాగా మాల్దీవుల స్వాతంత్ర్య వేడుకలు జరిగిన రిపబ్లిక్ స్క్వేర్‌లో ప్రధానికి ఆ దేశ అధ్యక్షుడు మహమద్ ముయిజ్జు, కీలక మంత్రులు సాదర స్వాగతం పలికారు. 50 నిమిషాలపాటు సాగిన స్వాతంత్ర్య వేడుకలను అధ్యక్షుడి పక్కనే కూర్చుని ప్రధాని వీక్షించారు. కాగా శుక్రవారం ముయిజ్జు, మోదీ మధ్య చర్చల ఫలితంగా మాల్దీవులు ఏటా చెల్లించాల్సిన రుణ మొత్తం 51 మిలియన్ డాలర్లకు బదులుగా 29 మిలియన్ డాలర్లకు అంటే 40 శాతం తగ్గించేందుకు భారత్ అంగీకరించింది. దీంతో ఆ దేశం ఆర్థిక సమస్యల నుంచి బయటపడేందుకు వీలవుతుంది.

ప్రపంచ వ్యాప్త మార్పులకు అనుగుణంగా శిక్షణ ఇవ్వాలి

» ఎంసీహెచ్‌ఆర్‌డీ అధికారులతో భట్టి విక్రమార్క



హైదరాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా వస్తున్న సాంకేతిక పరిజ్ఞానం, ఇతర మార్పులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులకు శిక్షణ ఇవ్వాలని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం(ఎంసీహెచ్‌ఆర్‌డీ) అధికారులకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సూచించారు. ఎంసీహెచ్ ఆర్‌డీ పాలక వర్గ క్యాబినెట్ సబ్‌కమిటీ సమావేశం శనివారం చైర్మన్ మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన ఎంసీహెచ్‌ఆర్‌డీలో జరిగింది. ఈ సబ్‌కమిటీలో సభ్యులైన మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎంసీహెచ్‌ఆర్‌డీ డైరెక్టర్ జనరల్ శాంతికుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. ఎంసీహెచ్‌ఆర్‌డీని దేశంలోనే అత్యుత్తమ శిక్షణ సంస్థగా నిలపాలని, దీనికి ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందన్నారు. స్వయం సహాయక సంఘాల నాయకురాళ్లకు జిల్లా స్థాయిలో, మండల స్థాయిలో రెండు రోజుల పాటు శిక్షణ ఇచ్చి వారు ఆర్థికంగా ఉన్నత స్థానానికి ఎదిగేందుకు సహకరించాలని మంత్రులు చెప్పారు.

ఇందిరమ్మ లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇళ్లు

» వచ్చేనెల 15లోగా కేటాయించాలి: మంత్రి పొంగులేటి



హైదరాబాద్/ వరంగల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఇంటి స్థలం లేని ఇందిరమ్మ లబ్ధిదారులకు అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లను కేటాయించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో ఉమ్మడి వరంగల్ జిల్లా సమగ్రాభివృద్ధిపై మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులతో శనివారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో భాగంగా ఇంటి స్థలాలు లేని అర్హులైన లబ్ధిదారులను గుర్తించి, ఆగస్టు 15లోగా అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లను వారికి కేటాయించాలని సూచించారు. అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లను పూర్తి చేసుకోవడానికి ప్రభుత్వమే రూ.5 లక్షల వరకు ఆర్థిక సాయాన్ని అందిస్తుందని మంత్రి వెల్లడించారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లకు ఎప్పుడు దరఖాస్తు చేసుకున్నారన్నది ముఖ్యం కాదని, తాజా దరఖాస్తులను పరిశీలించాలని కలెక్టర్లకు సూచించారు.

ఎరువుల సరఫరాపై కేంద్రానికి తుమ్మల లేఖ



హైదరాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు రావాల్సిన ఎరువులు సరఫరా చేయాలని కోరుతూ కేంద్రమంత్రి జేపీ నడ్డాకు మంత్రి తుమ్మల నాగేశ్వర రావు లేఖ రాశారు. రాష్ట్రానికి రావాల్సిన ఎరువులు త్వరితగతిన పంపించాల్సిందిగా కోరారు. ఆగస్టు నెలవారీ కేటాయింపులతోపాటు ఇప్పటి వరకు ఏర్పడ్డ 1.93 లక్షల మెట్రిక్ టన్నుల లోటు, జూలైలో ఇంకా సరఫరా కావాల్సిన 0.44 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువుల్ని ఆగస్టు నెల కేటాయింపులతో కలిపి సరఫరా చేయాల్సిందిగా కోరారు. ఎరువుల సరఫరాపై మంత్రి తుమ్మల సచివాలయంలో వ్యవసాయ శాఖ అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి వార్షిక కేటాయింపుల్లో భాగంగా 2025 ఖరీఫ్ సీజన్‌కు 9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించిందన్నారు. కేటాయించిన మొత్తం నెలవారి ప్రణాళికప్రకారం రాష్ట్రానికి పంపిణీ చేయాల్సి ఉండగా.. తక్కువే సరఫరా చేసిందని అధికారులు మంత్రికి వివరించారు.

కాళేశ్వరం బాధ్యుల నుంచి అందిన సంజాయిషీలు

» అధ్యయనం చేశాక చర్యలు తీసుకోనున్న ప్రభుత్వం

హైదరాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారంలో షోకాజు నోటీసులు అందుకున్న అధికారుల్లో ఒకరిద్దరు తప్ప.. అందరూ తమ సంజాయిషీలను ప్రభుత్వానికి సమర్పించారు. వారు చెప్పిన కారణాలపై అధ్యయనం చేశాక, తదుపరి చర్యలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిపెట్టనుంది. కాళేశ్వరం బ్యారేజీల వైఫల్యానికి కారకులైన 17 మందిపై నేరపూరిత కేసు పెట్టాలని, 33 మందిపై శాఖపరమైన చర్యలు(ఆర్టికల్ ఆఫ్ చార్జెస్), పదవీ విరమణ చేసిన 7 మందికి పెన్షన్‌లో కోత విధించాలని విజిలెన్స్ కమిషన్ ప్రభుత్వానికి సిఫారసు చేసిన విషయం విదితమే.

సింగూరు కాలువల టెండర్లు రద్దు!

హైదరాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): బాగారెడ్డి సింగూరు ప్రాజెక్టుకు చెందిన కాలువల కోసం ఈపీసీ (ఇంజనీరింగ్ అండ్ ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్) విధానంలో పిలిచిన టెండర్లను రద్దు చేయడానికి హైపవర్ కమిటీ నిర్ణయం తీసుకుంది. శనివారం సచివాలయంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఆధ్యక్షతన హైపవర్ కమిటీ సమావేశం సచివాలయంలో జరిగింది. సింగూరు ప్రాజెక్టుకు చెందిన ఎడమ కాలువ 0.00 కి.మీ. నుంచి 48 కి.మీ. దాకా పనులతో పాటు కుడికాలువ డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థ, క్షేత్రస్థాయి కాలువల పనులను ఈపీసీ ప్రాతిపదికన 24 మాసాల్లో పూర్తి చేసేందుకు గాను 2006లో మహాలక్ష్మి ఇన్‌ఫ్రాకు కట్టబెట్టారు. అయితే, పనులు దక్కించుకున్నా నిర్ణీత వ్యవధిలోగా పూర్తిచేకపోవడంతో టెండర్లు రద్దు చేయాలని ఇటీవలే ప్రభుత్వం నిర్ణయించింది. తాజాగా ఏజెన్సీ కూడా అంగీకరించడంతో పెండింగ్‌లో ఉన్న రూ.2.63 కోట్ల బిల్లుల చెల్లింపులు, ఆడిట్ పేరాలు పరిశీలించి, టెండర్‌ను రద్దు చేయాలని హైపవర్ కమిటీ అధికారులను ఆదేశించింది.

ఆస్పత్రుల బాట పట్టిన హెచ్‌వోడీలు

» కుత్బుల్లాపూర్ బోధనాస్పత్రిని తనిఖీ చేసిన డీఎంఈ

వైద్య ఆరోగ్యశాఖలోని కీలక విభాగాధిపతులంతా ఆస్పత్రుల బాటపట్టారు. రాష్ట్రంలో సీజనల్ వ్యాధుల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో డెంగీ, ఇతర కేసుల పెరుగుదల, చికిత్స తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో పర్యటించి, సమీక్షించి నివేదిక ఇవ్వాలని వైద్యశాఖను సర్కారు ఆదేశించింది. ఒక్కో హెచ్‌వోడీకి సగటున మూడు నుంచి నాలుగు జిల్లాల్లో పర్యటించాలని హెల్త్ సెక్రటరీ సర్క్యులర్ జారీ చేశారు. శనివారం వైద్యవిద్య సంచాలకులు డాక్టర్ నరేంద్రకుమార్ కుత్బుల్లాపూర్ బోధనాస్పత్రిని సందర్శించారు. అలాగే కుషాయిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు గ్లెనియా ప్రైవేటు ఆస్పత్రిని తనిఖీ చేశారు.

వైద్య విద్య కోర్సుల ప్రవేశాల్లో బీసీలకు న్యాయం చేయాలి: నిరంజన్

వైద్య విద్య(మెడికల్, డెంటల్) పీజీ కోర్సుల్లో బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని సరి చేసేందుకు చర్యలు తీసుకోవాలని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ సీఎం రేవంత్‌రెడ్డికి రాసిన లేఖలో కోరారు. ప్రతిభ గల రిజర్వుడ్ అభ్యర్థి(ఎంఆర్‌సీ) ఖాళీ చేసిన సీటును అదే క్యాటగిరికి చెందిన మరో అభ్యర్థితో భర్తీ చేయకపోవడంతో బీసీ విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నట్టు పేర్కొన్నారు. ఖాళీ చేసిన సీటును అదే రిజర్వ్‌డ్ క్యాటగిరికి చెందిన అభ్యర్థులకు కాకుండా ఓపెన్ క్యాటగిరి అభ్యర్థులకు కేటాయించడంతో బీసీలకు దక్కే అవకాశాలు తగ్గిపోతున్నట్టు నిరంజన్ ఆ లేఖలో వివరించారు.

కేటీఆర్ పద్ధతి మారకపోతే చట్ట ప్రకారం చర్యలు

» పోలీస్ అధికారుల సంఘం

పోలీసులపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన దురుసు వ్యాఖ్యలను పోలీస్ అధికారుల సంఘం తీవ్రంగా ఖండించింది. చట్ట ప్రకారం కేసులు నమోదు చేసే పోలీసుల్ని దూషించడం ఏం సంస్కృతి అని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై. గోపిరెడ్డి ప్రశ్నించారు. పోలీసులనుద్దేశించి కేటీఆర్ చేసిన వ్యాఖ్యల్ని ఆయన తప్పుబట్టారు. పరుష పదజాలం పునరావృతమైతే కేటీఆర్‌పై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఒక ప్రకటనలో ఆయన హెచ్చరించారు.


మరింత కొత్తగా సీఎంఆర్‌ఎఫ్

» దరఖాస్తుదారు వాట్సా‌ప్‌కే చెక్కు వివరాలు

» సీఎం రేవంత్ సందేశంతో ప్రత్యేకంగా డిజైన్

» 19 నెలల్లో 3.23లక్షల మందికి సాయం

హైదరాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) పథకాన్ని అక్రమాలకు, అవినీతికి ఆస్కారం లేకుండా ప్రభుత్వం పటిష్ఠంగా అమలు చేస్తోంది. ఇప్పటికే పథకాన్ని పారదర్శకంగా అమలు చేసేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు విధానాన్ని ప్రవేశపెట్టిన ప్రభుత్వం.. తాజాగా మరో కొత్త విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. సీఎంఆర్‌ఎఫ్ సాయం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే సమయంలో పొందుపర్చిన ఫోన్ నంబరుకు చెక్కు వివరాలతో పాటు సీఎం రేవంత్ సందేశాన్ని జతచేసి పంపుతున్నారు. అలాగే చెక్కు విడుదలైన తేదీతో పాటు దరఖాస్తు చేసిన ప్రజాప్రతినిధి కార్యాలయానికి ఎప్పుడు చేరుతుందనే వివరాలను కూడా మెసేజ్ రూపంలో లబ్ధిదారులకు అందిస్తున్నారు. ఇటీవల రాష్ట్రంలోని కొంతమంది ప్రజాప్రతినిధులు వారి పరిధిలో అందించే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులపై ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ సందేశాన్ని తొలగించి లబ్ధిదారులకు అందిస్తున్నట్టు ప్రచారం జరిగింది. ఒకటి, రెండు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో సీఎం సందేశం లేకుండా ఇచ్చిన చెక్కులు కూడా బహిర్గతమయ్యాయి. ఈ క్రమంలోనే అధికారులు సీఎంఆర్‌ఎఫ్ దరఖాస్తు ప్రక్రియను ఆన్‌లైన్ చేసినట్టుగానే.. లబ్ధిదారులకు అందించే చెక్కుల వివరాలను కూడా వారి వాట్సా‌ప్‌కే పంపుతున్నారు. అలాగే చికిత్సకు ముందు ఆస్పత్రులకు ఇచ్చే లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌వోసీ) పత్రాలపైనా ప్రత్యేకంగా 'క్యూఆర్ కోడ్'లను ముద్రిస్తున్నారు. ఆ కోడ్‌ను స్కాన్ చేయగానే ఆ లెటర్ ఎవరికి ఇచ్చారు, ఆ పేషంట్ పేరు, మంజూరు చేసిన నగదు వివరాలన్నీ కనబడుతున్నాయి. మరోవైపు.. సీఎంఆర్‌ఎఫ్ సాయంలో ప్రభుత్వం రికార్డు నెలకొల్పింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన 19 నెలల కాలంలోనే సీఎంఆర్‌ఎఫ్ కింద రూ.1,399.21 కోట్ల నిధులను విడుదల చేసింది. 2023 డిసెంబరు 7 నుంచి 2025 జూలై 26నాటికి దాదాపు 3,23,739 మంది నిరుపేద, పేద, మధ్య తరగతి కుటుంబాలకు సర్కారు వివిధ రూపాల్లో సాయం అందించింది. చికిత్సకు ముందు అందించే లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌ఓసీ)ల ద్వారా 27,872 మందికి రూ.413.25 కోట్లు, అలాగే చికిత్స అనంతరం దరఖాస్తు చేసుకున్న 3,01,867 మందికి రూ.985.96 కోట్ల చొప్పున నిధులను విడుదల చేసింది.



ఓ లబ్ధిదారుని వాట్సాప్‌కు వచ్చిన సీఎం సందేశం

అన్నీ స్విగ్గీ పాలిటిక్స్!

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పటివరకు శాసనసభ నుంచి ఎవరినీ సస్పెండ్ చేయలేదని రేవంత్ చెప్పారు. శనివారం హైదరాబాద్‌లోని తాజ్‌కృష్ణ హోటల్‌లో క్యాపిటల్ ఫౌండేషన్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన 'జైపాల్‌రెడ్డి మెమోరియల్ అవార్డుల' ప్రదానోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. అవార్డులను అందజేసి, మాట్లాడారు. దేశ రాజకీయాల్లో జైపాల్‌రెడ్డి నిలువెత్తు శిఖరమని కొనియాడారు. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా దేశ రాజకీయాల్లో బలమైన ముద్ర వేసిన వ్యక్తి జైపాల్ రెడ్డి అని, చివరి శ్వాస వరకు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. "జైపాల్‌రెడ్డి పెట్రోలియం శాఖ నిర్వహిస్తున్న సమయంలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారు. సమాచార మంత్రిగా ఉన్న సమయంలో ప్రసార భారతి చట్టాన్ని దేశానికి అందించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాల పాత్ర, మీడియా పాత్ర ఉండాలని ఆయన విశ్వసించారు. పరిపాలనలో తీసుకురావాల్సిన మార్పులపై ఎక్కువగా ఆలోచించేవారు. రాజకీయాలలో ధన ప్రవాహం తగ్గించాలని ప్రయత్నించారు. తెలంగాణ ఏర్పాటులో జైపాల్ రెడ్డిది కీలక పాత్ర. పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేత సుష్మా స్వరాజ్‌ను ఒప్పించి తెలంగాణ బిల్లుకు ఆమోదం లభించేలా ప్రత్యేక పాత్ర పోషించారు. జైపాల్‌రెడ్డి చొరవతోనే తెలంగాణ ఏర్పాటు చేశామని సోనియా గాంధీ ఒక సందర్భంలో నాతో చెప్పారు" అని రేవంత్ వెల్లడించారు. మన తెలంగాణ నేతలెవరూ ఈ విషయం చెప్పకపోయినా, పక్కరాష్ట్రం నేత ఉండవల్లి అరుణ్‌కుమార్ పలుమార్లు ప్రస్తావించారని గుర్తుచేశారు. తెలుగు రాజకీయాల్లో పీవీ నర్సింహారావు తర్వాత మళ్లీ అంత గొప్ప రాజకీయాలు చేసింది జైపాల్‌రెడ్డి అని కొనియాడారు. పని చేసుకుపోవడమే తప్ప, గొప్పలు చెప్పుకొనే తత్వం జైపాల్‌రెడ్డిది కాదన్నారు. ఇప్పుడు ఉద్యమం చేశామని చెప్పుకొంటూ తిరుగుతున్న వారు ధర్నాచౌక్ ఎత్తివేసి ప్రజలు నిరసన వ్యక్తం చేయడానికి అవకాశం లేకుండా చేశారని విమర్శించారు. తమ ప్రభుత్వం రాగానే ధర్నాచౌక్‌ను పునరుద్ధరించామని చెప్పారు. ఎవరైనా నిరభ్యంతరంగా నిరసన తెలపవచ్చని, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తుందని పేర్కొన్నారు.



కార్గిల్ యుద్ధవీరులలో ఒకరైన కల్నల్ జాయ్‌దాస్ గుప్తాను సత్కరిస్తున్న సీఎం రేవంత్

కాగా, ఈ రోజుల్లో రాజకీయ పార్టీలన్నీ ప్రజాస్వామ్యాన్ని విచ్ఛిన్నం చేసేలా నడుచుకుంటున్నాయని ఒడిశాకు చెందిన బీజేడీ రాజ్యసభ సభ్యుడు సస్మిత్ పాత్ర పేర్కొన్నారు. పార్లమెంట్‌లో కూడా భావప్రకటనా స్వేచ్ఛను హరిస్తున్నారని, సభ్యులతో చర్చించకుండానే బిల్లులని పాస్ చేస్తున్నారని ఆరోపించారు.

అధ్యాపకులు నిత్య విద్యార్థులు..

అధ్యాపకులు నిత్య విద్యార్థులని, వారు ప్రజాస్వామ్య విలువలను కాపాడేలా విద్యార్థులకు బోధించాలని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. రంగారెడ్డి జిల్లా మొగిలిగిద్ద గ్రామానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ సామ రవీందర్‌రెడ్డి రచించిన ఇండియన్ ఎకనామిక్ పుస్తకాన్ని సీఎం ఆవిష్కరించారు. విద్యార్థులకు ఉపయోగపడేలా పుస్తకం రాశారని రవీందర్‌రెడ్డిని అభినందించారు.

ఆరోగ్య శ్రీలో 10.7 లక్షల మందికి వైద్యం: దామోదర రాజనర్సింహ

తాము వచ్చాక 10.70 లక్షల మందికి ఆరోగ్యశ్రీ సేవలందించామని మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడించారు. ప్రభుత్వానికి సహకరిస్తూ రోగులకు మెరుగైన వైద్యం అందిస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల యాజమాన్యాలకు కృతజ్ఞతలు తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరోగ్యశ్రీ ఇన్సూరెన్స్ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని దామోదర గుర్తు చేశారు. అలాగే సుమారు పదేళ్ల తర్వాత ఆరోగ్యశ్రీ ప్యాకేజీల ధరలను సగటున 22 శాతం మేర పెంచామని తెలిపారు. నెట్‌వర్క్ హాస్పిటళ్లకు రూ.1,590 కోట్లకు పైగా ఆరోగ్యశ్రీ బిల్లులు చెల్లించామని స్పష్టం చేశారు. షుగర్ పేషెంట్లకు ఇచ్చే మందులు, ఇన్సులిన్ లేవని సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

టీచర్ల పదోన్నతులకు పచ్చజెండా

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆమోదం

రేపు షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం

ప్రమోషన్లు పొందనున్న 4 వేల మంది

హైదరాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉపాధ్యాయుల పదోన్నతులకు సర్కారు ఆమోదం తెలిపింది. ఈ ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా ప్రారంభించి, పూర్తిచేయాలని సీఎం రేవంత్ రెడ్డి శనివారం విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. పాఠశాల విద్యాశాఖలో తొమ్మిదేళ్ల తర్వాత పదోన్నతులు, ఆరేళ్ల తర్వాత బదిలీలను గత ఏడాది నిర్వహించారు. దాదాపు 20 వేల మందికి పదోన్నతులు కల్పించారు. అయితే గత ఏడాది కాలంలో ఖాళీ అయిన స్థానాలను పదోన్నతులతో భర్తీ చేయాల్సి ఉంది. అంతకంటే ముందు బదిలీలు చేపట్టాల్సి ఉంది. ఈ ప్రక్రియ అంతా వేసవి సెలవుల్లో జరగాల్సి ఉండగా.. జాప్యమైంది. ఇప్పటికే విద్యాసంవత్సరం ప్రారంభమైనందున ప్రభుత్వం బదిలీల అంశాన్ని వాయిదా వేసి పదోన్నతులకు అనుమతించింది. పదోన్నతుల షెడ్యూల్ సోమవారం విడుదలయ్యే అవకాశముంది. రాష్ట్రవ్యాప్తంగా 850 మంది ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు పొందనున్నారు. వీరిలో మల్టీజోన్-1లో దాదాపు 500మంది ఉండగా, మల్టీజోన్-2లో 350 మంది వరకు ఉంటారు. అలాగే దాదాపు 3వేల మంది వరకు ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎస్‌జీటీలు, స్కూల్ అసిస్టెంట్లు, భాషా పండితులు పదోన్నతులు పొందనున్నారు. ఏడాది కాలంగా ఎదురుచూస్తున్న పదోన్నతులపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడాన్ని ఉపాధ్యాయ సంఘాలు స్వాగతించాయి. ఈ మేరకు టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు చావ రవి, వెంకట్.. సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియను కూడా చేపట్టాలని సీఎంను కోరారు.

ఆరోగ్యశ్రీ పరిధిలోకి కొత్తగా 30లక్షల మంది

నూతన రేషన్ కార్డులతో పెరగనున్న సంఖ్య

ఆరోగ్యశ్రీతో కార్డుల అనుసంధాన ప్రక్రియ

ట్రస్టు కార్యాలయంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు

పౌరసరఫరాలశాఖతో సమన్వయం

హైదరాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా 30 లక్షల మంది రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాబోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు జారీ చేయడంతో వీరంతా ఆ పథకం కిందికి రానున్నారు. కొత్తగా రేషన్ కార్డు తీసుకుంటున్న వారిలో అర్హులైన లబ్ధిదారులను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకొచ్చేందుకు వైద్యశాఖ కసరత్తు చేస్తోంది. అందుకోసం రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్టు కార్యాలయంలో ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేసింది. ఈసెల్ ద్వారా పౌరసరఫరాల శాఖతో సమన్వయం చేసుకుని కొత్తగా రేషన్ కార్డులు మంజూరు అయిన వారి వివరాలతోపాటు.. పాత రేషన్ కార్డులో కొత్తగా చేరిన కుటుంబ సభ్యుల వివరాలను ఆరోగ్యశ్రీలో నమోదు చేస్తారు. రాష్ట్రంలో కొత్తగా 5.61లక్షల మందికి రేషన్ కార్డులు జారీ చేయగా.. వీటి ద్వారా 27.87 లక్షల మంది సభ్యులుగా చేరారు. ఇవిగాక ఇప్పటికే ఉన్న రేషన్ కార్డులలో అదనపు కుటుంబ సభ్యుల నమోదుతో ఆ సంఖ్య సుమారుగా 30 లక్షలకు చేరుకోనుంది. ఆరోగ్యశ్రీతో కొత్త రేషన్ కార్డుల అనుసంధానానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ఉన్నతాధికారులను ఆదేశించారు. ముఖ్యంగా పేదలు ఎటువంటి ఇబ్బంది పడకుండా, తమ జేబుల నుంచి ఖర్చు లేకుండా ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యసేవలు అందాలంటే రేషన్ కార్డుకు, ఆరోగ్యశ్రీకి అనుసంధానం అయి ఉండాలని ఆయన సూచించినట్లు సమాచారం. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు ఉన్న నేపథ్యంలో రేషన్ కార్డుల పంపిణీ, ఆరోగ్య శ్రీ అనుసంధాన ప్రక్రియను కూడా వీలైనంత వేగంగా పూర్తి చేయాలని ఇటీవల ముఖ్యమంత్రి కూడా అధికారులను ఆదేశించారు. వాస్తవానికి ఆరోగ్యశ్రీకి, రేషన్‌కార్డుకు ఎటువంటి లింకు లేకుండా చూడాలని తొలుత ప్రభుత్వం భావించింది. అయితే సాంకేతిక కారణాలతో పాటు పరిస్థితుల ప్రభావం దృష్ట్యా రెండింటికి అనుసంధానం చేయడం తప్పడంలేదని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

3.14 కోట్లకు పెరగనున్న లబ్ధిదారులు

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 90.10 లక్షల కుటుంబాలు ఆరోగ్య శ్రీ పరిధిలోకి వస్తుండగా, 2.84 కోట్ల మంది అర్హులుగా ఉన్నారు. తాజా కొత్త రేషన్ కార్డుల లబ్ధిదారుల కుటుంబాలతో కలిపి ఆరోగ్యశ్రీ కార్డుల సంఖ్య సుమారు 95-96 లక్షలకు పెరగనుంది. అలాగే లబ్ధిదారుల సంఖ్య సుమారు 3.14 కోట్లకు చేరనుంది. దీంతో పాటు కేంద్రం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ కూడా తెలంగాణలో అమలవుతున్నది. గతంలోనే ఆరోగ్య శ్రీ, ఆయుష్మాన్ భారత్ పథకాలను కలిపి అమలు చేస్తున్నారు. దీంతో వైద్య చికిత్సల సంఖ్య 1835కు చేరింది. అలాగే రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిధిలోకి 1042 ప్రభుత్వ, 461 ప్రైవేటు ఆస్పత్రులు వచ్చాయి.

క్యాబినెట్ తరువాతే.. 'స్థానికం'పై స్పష్టత!

» గవర్నర్ దగ్గర ఆర్డినెన్స్.. కేంద్రానికి పంపిన బిల్లులు పెండింగ్‌లోనే

» వీటిపై మంత్రివర్గంలో కీలక చర్చ..

హైదరాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల ఖరారు.. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ మధ్య పడిన పీటముడిపై క్యాబినెట్ తరు వాత ఒక స్పష్టత వచ్చే అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వం పంచాయతీరాజ్ చట్టం-2018 సెక్షన్ 285(ఏ)ను సవరిస్తూ ఆర్డినెన్స్‌ను గవర్నర్‌కు పంపింది. దానికి ఇంకా ఆమోదం రాలేదు. మరోవైపు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతానికి పెంచేందుకు అసెంబ్లీలో ఆమోదించి రెండు బిల్లులను పార్లమెంటు ఉభయసభల్లో ఆమోదించడంతో పాటు వాటిని రాజ్యాంగంలోని షెడ్యూల్ 9లో చేర్చాలని కోరుతూ కేంద్రానికి పంపింది. ఇది ఇప్పట్లో తేలే అవకాశాల్లేవు. అదే సమయంలో రిజర్వేషన్ల ఖరారుపై హైకోర్టు సూచించిన గడువు శుక్రవారంతో పూర్తయింది. ఈ నేపథ్యంలో స్థానిక ఎన్నికలు-బీసీ రిజర్వేషన్లపై ఏ రకంగా ముందుకు వెళ్లాలన్న దానిపై ప్రభుత్వం సోమవారం నిర్వహించే మంత్రివర్గంలో చర్చించనుంది. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని హైకోర్టు ఒక గడువు విధించింది. జూలై 25 నాటికి స్థానిక ఎన్నికల నిర్వహణకు రిజర్వేషన్లను ఖరారు చేయాలని, సెప్టెంబరు 30లోపు ఎన్నికల ప్రక్రియను పూర్తిచేయాలని సూచించింది. అయితే జూలై 25 నాటికి రిజర్వేషన్లు ఖరారు కాలేదు. ఇదే అంశంపై కోర్టులో గతంలో పిటిషన్ వేసిన వారు మరోసారి కోర్టుకు వెళ్లి.. హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు అమలు కాలేదని తెలిపే అవకాశం ఉంది. అదే జరిగితే కోర్టు కూడా దాని మీద ఈసారి కచ్చితమైన ఆదేశాలిచ్చే అవకాశాలున్నాయి. కాగా రాష్ట్రంలో ఏడాదిన్నరకు పైగా స్థానిక ఎన్నికలు జరగకపోవడంతో కేంద్రం నుంచి పంచాయతీలకు రావాల్సిన నిధులు ఆగిపోయాయి. ఈ క్రమంలో స్థానిక ఎన్నికలు, మరోవైపు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చాకే ఎన్నికలు పెట్టాలన్న డిమాండ్లు కొలిక్కిరావాలంటే పై రెండింటిలో ఏదో ఒకటి జరగాల్సి ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

వెయ్యి స్కూళ్లలో 'ప్రీప్రైమరీ' తరగతులు

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటించగా, మరో 790 బడుల జాబితాను శనివారం ప్రకటించిన విద్యాశాఖ.. ప్రీ ప్రైమరీ పాఠశాల నిర్వహణకు ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రీ ప్రైమరీ విద్యార్థుల కోసం ఇప్పుడున్న పాఠశాలల్లో ప్రత్యేక గది కేటాయించాలని ప్రధానోపాధ్యాయులను కోరింది. వచ్చే ఏడాది (2026-27)లో ఒకటో తరగతిలో ప్రవేశం పొందేవారికి ఇప్పుడు ప్రీప్రైమరీ విద్యార్థిగా ప్రవేశాలివ్వాలని తెలిపింది కొత్తగా అందుబాటులోకి రానున్న తరగతుల నిర్వహణకు ప్రతి పాఠశాలకు ఇద్దరు సిబ్బంది (ఒక ఇన్‌స్ట్రక్టర్, ఆయా) చొప్పున విద్యాశాఖ రాష్ట్ర వ్యాప్తంగా 2,000 మందిని నియమించనున్నది.. జిల్లా స్థాయిలో కలెక్టర్ నేతృత్వంలో ఇంటర్ చదివిన స్థానిక యువతీ యువకులను ఈ ఉద్యోగాలకు నియమిస్తారు. ప్రతి విద్యార్థికి పౌష్టికాహారం అందించడమే లక్ష్యమన్న విద్యాశాఖ.. ప్రీ ప్రైమరీ విద్యార్థులకూ మధ్యాహ్న భోజన పథకం వర్తింపచేయాలని కోరింది. అలాగే అంగన్‌వాడీల ఆధ్వర్యంలో చిన్నారులకు స్నాక్స్ కూడా ఇవ్వడంతో పాటు వారికి కేటాయించే తరగతి గదిలో చిన్నారులకు ఆసక్తి కలిగేలా ఆట వస్తువులు, బొమ్మలు అందుబాటులో ఉంచాలని సూచించింది. చిన్నారులు నిద్ర పోవడానికి తరగతి గదిలో ఒక చోటు ఏర్పాటు చేయాలని మార్గదర్శకాల్లో కోరింది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఏపీ డీఎస్పీల మృతి

» ఏఎస్పీ, కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు

» సడన్ బ్రేక్ వేసిన ముందు వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పిన కారు

» రోడ్డు క్రాసింగ్‌లో డివైడర్‌ను ఢీకొట్టి... అవతలివైపు దూసుకెళ్లి పడిన వైనం

» దాన్ని ఢీకొట్టిన కాంక్రీటు మిక్సర్ లారీ

» అమరావతి నుంచి హైదరాబాద్ వస్తుండగా చౌటుప్పల్ వద్ద ప్రమాదం

చౌటుప్పల్ రూరల్/మన్సూరాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లాలో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. చౌటుప్పల్ మండలం ఖైతాపురం స్టేజి వద్ద జరిగిన ఈ దుర్ఘటనలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇద్దరు డీఎస్పీలు మరణించగా, మరో ఏఎస్పీ, కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడ్డారు. స్పెషల్ సెక్యూరిటీ గ్రూప్ (ఎస్ఎస్‌జీ) డీఎస్పీ జల్లు శాంతారావు (56), ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ (ఐఎస్‌డబ్ల్యూ) డీఎస్పీ మాకా చక్రధర్‌రావు (52), ఐఎస్‌డబ్ల్యూ ఏఎస్పీ కేడీఎం దుర్గాప్రసాద్.. విధుల్లో భాగంగా శుక్రవారం రాత్రి 9.30 గంటల ప్రాంతంలో అమరావతి కార్యాలయం నుంచి డ్రైవర్‌గా ఓ కానిస్టేబుల్‌ను తీసుకుని కారులో హైదరాబాద్‌లోని కార్యాలయానికి బయలుదేరారు. నార్కట్‌పల్లి వద్దకు రాగానే వారు ప్రయాణిస్తున్న కారుకు మరమ్మతు వచ్చింది. దీంతో హైదరాబాద్ నుంచి మరో స్కార్పియో వాహనం తెప్పించుకొని డ్రైవర్‌గా హెడ్‌కానిస్టేబుల్ రెడ్డిచర్ల నర్సింగరావును తీసుకుని బయలుదేరారు. తెల్లవారుజామున 4.45 నిమిషాలకు కారు ఖైతాపురం స్టేజి వద్దకు రాగానే ముందు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం సడన్ బ్రేక్ వేసింది. దాన్ని తప్పించబోయిన పోలీసుల కారు... క్రాసింగ్ వద్ద డివైడర్ ముందు భాగాన్ని బలంగా ఢీకొట్టి కొద్దిదూరం దూసుకెళ్లి విజయవాడ వైపు వెళ్లే రోడ్డులో పడిపోయింది. దాన్ని అదే సమయంలో హైదరాబాద్ నుంచి చౌటుప్పల్‌కు వస్తున్న కాంక్రీట్ మిక్సర్ లారీ ఢీకొట్టింది. కారు నుజ్జవగా మధ్య సీటులో కూర్చున్న డీఎస్పీలు చక్రధరరావు, శాంతారావుకు అక్కడికక్కడే మరణించారు. ముందు సీటులో కూర్చున్న ఏఎస్పీ దుర్గాప్రసాద్, డ్రైవర్ నర్సింగరావు సీటు బెల్ట్ పెట్టుకోవడం, బెలూన్లు తెరుచుకోవడంతో ప్రాణాలతో బయటపడ్డారు.




డీఎస్పీ చక్రధర్‌రావు, డీఎస్పీ శాంతారావు(ఫైల్)

గతంలో హైదరాబాద్‌లో పనిచేశారు!

ప్రమాదంలో మరణించిన డీఎస్పీ శాంతారావుది ఏపీలోని శ్రీకాకుళం జిల్లా పోలాకి మండలం డోలా గ్రామం. మరో డీఎస్పీ చక్రధర్‌రావుది పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు. ఆంధ్రప్రదేశ్ విభజనకు ముందు హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో పనిచేశారు. వీరిద్దరి కుటుంబాలు హైదరాబాద్‌లోనే నివాసం ఉంటున్నాయి. శాంతారావుకు భార్య శ్రీలక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. చక్రధరరావుకు భార్య శ్రీదేవి, ఇద్దరు కుమార్తెలు హాసిని ప్రియ, డింపుల్ ఉన్నారు. ప్రియ తొమ్మిదో తరగతి, డింపుల్ ఒకటో తరగతి చదువుతున్నారు.

హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో

ఖైతాపురం క్రాసింగ్ అత్యంత ప్రమాదకరంగా ఉంటుంది. హెచ్చరిక బోర్డులు, లైట్లు లేకపోవడంతోనే ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు డివైడర్ పక్క నుంచి వాహనం వెళ్తే అంతే సంగతులు. డివైడర్‌ను ఢీకొట్టిన తర్వాత పోలీసుల వాహనం 50 మీటర్ల దూరం దూసుకెళ్లినట్లు తెలుస్తోంది. ఆ సమయంలో వాహనం 70 కిలోమీటర్ల వేగంతో ఉన్నట్లు సమాచారం. సీటు బెల్టు పెట్టుకోకపోవడం కూడా ఇద్దరు డీఎస్పీల మృతికి కారణంగా తెలుస్తోంది.

సంతాన సాఫల్యం మాటున.. గలీజ్ దందా

వీర్యకణాలు, అండాలతో వ్యాపారం.. దంపతులను మోసం చేస్తున్న కేంద్రాలు

- దంపతులకు బదులుగా.. దాతల వీర్యకణాలు, అండాల వినియోగం
- గుట్టుచప్పుడు కాకుండా కొనసాగిస్తున్న దందా
- ఏజెంట్ల ద్వారా దాతల ఎంపిక
- దాతల అండాల ఉత్పత్తికి హార్మోన్ ఇంజెక్షన్లు

మహారాష్ట్రకు చెందిన ఓ మహిళతో అండం ఇవ్వడానికి నగరంలోని ఓ సంతాన సాఫల్య కేంద్రం ఒప్పించింది. భారీగా డబ్బులిస్తామని ఆశ చూపడంతో ఆ మహిళ ఒప్పుకొంది. అయితే.. ఎక్కువ అండాలు విడుదలయ్యేందుకు పలుమార్లు హార్మోన్ ఇంజెక్షన్లు ఇచ్చారు. కొన్నాళ్ల తర్వాత ఆ మహిళ ఆరోగ్యం దెబ్బతినడంతో.. ఉప్పల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందారు.

బంజారాహిల్స్‌లోని ఓ సంతాన సాఫల్య కేంద్ర నిర్వాహకులు ఓ దంపతుల వద్ద భారీ మొత్తంలో డబ్బులు తీసుకున్నారు. ఆ దంపతులకు సంతానం కల్గించడంలో విఫలం కావడంతో వారి ఫిర్యాదు మేరకు వైద్యాధికారులు విచారణ జరిపారు. అవాక్కయ్యే విషయం బయటపడింది. ఆ సెంటర్ నిర్వాహకురాలు కాలేజీ విద్యార్థినుల నుంచి అండాలు సేకరిస్తున్నట్లు తేలింది. అక్కడ ఏకంగా జెనిటిక్ ల్యాబ్‌ను అనుమతి లేకుండా ఏర్పాటు చేసి.. వ్యాపారం చేస్తున్నట్లు తేలింది. దీంతో అధికారులు ఆ సమయంలో ఆ సెంటర్‌ను సీజ్‌చేశారు.

హైదరాబాద్ సిటీ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పిల్లలు పుట్టకపోతే.. చాలా మంది దంపతులు సంతాన సాఫల్య కేంద్రాలకు పరుగులు పెడుతున్నారు. దీంతో ఈ కేంద్రాలకు బిడ్డల కోసం వచ్చే దంపతుల సంఖ్య భారీగా ఉంటోంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో రోజుకు కనీసం 200 మంది వరకు దంపతులు పిల్లల కోసం సంతాన సాఫల్య కేంద్రాలను ఆశ్రయిస్తున్నారని అంచనా. ఈ సెంటర్లకు వచ్చే కొందరు మగవారిలో వీర్యకణాల సంఖ్య(కౌంట్) తగ్గడం.. ఆడవారిలో అండాల ఉత్పత్తి కాకపోవడం ప్రధాన సమస్యలని వైద్యులు చెబుతున్నారు. ఇలాంటి దంపతుల బలహీనతలను అసరా చేసుకుంటున్న కొన్ని సంతాన సాఫల్య కేంద్రాలు.. ఫర్టిలిటీని వ్యాపారంగా మలచుకుంటున్నాయి.

దాతల నుంచి సేకరణ..

కొన్ని కేంద్రాలు ఐయూఐ, ఐవీఎఫ్ పేరుతో దందా చేస్తున్నాయి. సంతాన సాఫల్య కేంద్రాలు మహిళల అండాలు, పురుషుల వీర్యకణాల దానంతో చాటుమాటుగా వ్యాపారం చేస్తున్నాయి. యువత నుంచి వీర్యకణాలు, అండాలు సేకరించి.. వాటి సాయంతో దంపతులకు సంతానం కలిగేలా చేసి, సొమ్ము చేసుకుంటున్నాయి. సంతానం కోసం వచ్చిన దంపతుల వద్ద నుంచి వీర్యకణాలు, అండాలను సేకరించి ఐయూఐ, ఐవీఎఫ్ ద్వారా సంతానం పొందే అవకాశం కల్పిస్తామని తొలుత నమ్మబలుకుతాయి. ఒకటి, రెండుసార్లు ప్రయత్నం చేస్తాయి. మూడోసారి మాత్రం వారికి తెలియకుండా.. దాత నుంచి సేకరించిన వీర్యకణాలు, అండాలను ప్రవేశపెట్టి సంతానం కలిగిస్తుంటాయి. డీఎన్ఏ పరీక్ష చేస్తే కానీ అసలు గుట్టు రట్టు కాదు.



సికింద్రాబాద్‌లో సృష్టి సంతాన సాఫల్య కేంద్రంపై ఇలాంటి కేసే ఇప్పుడు నమోదైంది. ఈ కేంద్రం ద్వారా సంతానం పొందిన దంపతులకు పుట్టిన బిడ్డ తమది కాదనే అనుమానంతో డీఎన్ఏ పరీక్ష చేయించడంతో అసలు విషయం బయటపడింది.

టార్గెట్ యువత?

చాలా మంది ఆర్థిక అవసరాల కోసం వీర్యం, అండాలు దానం చేయడానికి ముందుకు వస్తుంటారు. ఇందుకోసం సంతాన సాఫల్య కేంద్రాలు ఏజెంట్లను నియమించుకుంటాయి. మంచి శరీరపుష్టి ఉండి.. క్రీడాకారుల్లా కనిపించే యువకులను వీర్య దానానికి.. మేలిమిరంగు శరీరచ్ఛాయతో.. చక్కటి ముక్కు, చెవులు, ఆకర్షణీయమైన కళ్లు, ఎత్తు ఉండే యువతులను అండ దానానికి ఎంచుకుంటాయి. పేదరికంలో ఉండే యువతకు గాలం వేసి.. తమ పని కానిస్తుంటాయి. ఫర్టిలిటీ కేంద్రాల నిర్వాహకులు వీరి నుంచి ఎక్కువ అండాలు, వీర్యకణాలు ఉత్పత్తి అయ్యేలా హార్మోన్ ఇంజెక్షన్లు ఇస్తుంటారు. ఉదాహరణకు.. యువతుల్లో నెలకు ఒకటి లేదా చాలా అరుదైన సందర్భాల్లో రెండు అండాలు మాత్రమే విడుదలవుతాయి. కానీ, సంతాన సాఫల్య కేంద్రాల నిర్వాహకులు హార్మోన్ ఇంజెక్షన్లు ఇవ్వడం వల్ల ఒకటి కంటే ఎక్కువ అండాలు విడుదలవుతాయి. ఇలా ఇంజెక్షన్లు తీసుకోవడం వల్ల అండ దాతలు భవిష్యత్‌లో సంతానానికి దూరం అయ్యే ప్రమాదాలుంటాయని గైనకాలజిస్టులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హార్మోన్ ఇంజెక్షన్లను అతిగా తీసుకోవడం వల్ల కలిగే దుష్ప్రభావాలతో హైపర్ సిమ్యులేషన్ సిండ్రోమ్, ఇన్ఫెక్షన్లు, ఇతర రుగ్మతల బారిన పడే అవకాశాలున్నాయని హెచ్చరిస్తున్నారు.

రికార్డులు ఉండవు..

సంతానం సాఫల్య కేంద్రాలు తప్పనిసరిగా వైద్య ఆరోగ్య శాఖ వద్ద రిజిస్ట్రర్ చేసుకుని ఉండాలి. నియమనిబంధనలను తూచ తప్పకుండా పాటించాలి. మార్గదర్శకాలకు లోబడి వ్యవహరించాలి. కానీ, క్షేత్రస్థాయిలో చాలా కేంద్రాలు ఈ నియమాలను తుంగలో తొక్కుతున్నాయి. సంతాన సాఫల్య కేంద్రాలు, స్కానింగ్ సెంటర్లలో అసలు రికార్డులనే నిర్వహించడం లేదు. అనుమతి పత్రాలు అస్సలు కనిపించవు. నిపుణులైన వైద్యుల జాడే కానరాదు. స్కానింగ్ యంత్రాలకు మెషీన్ నంబర్లు ఉండవు. అయితే.. వీటిని నియంత్రించాల్సిన వైద్యాధికారులు.. అప్పుడప్పుడూ నామమాత్రంగా తనిఖీలు నిర్వర్తిస్తూ.. స్కానింగ్ మెషీన్లను సీజ్ చేస్తూ.. చేతులు దులుపుకొంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఐయూఐ, ఐవీఎఫ్ కీలకం

పిల్లల కోసం వచ్చే దంపతులకు సంతాన సాఫల్య కేంద్రాల్లో రెండు పద్ధతులను అవలంభిస్తున్నారు. అవి.. ఇంట్రా యుటిరైన్ ఇన్‌సెమినేషన్ (ఐయూఐ), ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్(ఐవీఎఫ్). గర్భాశయ ముఖద్వారం వద్ద పొర మందంగా ఉండడం, భర్త వీర్యకణాల్లో చురుకుదనం లేకపోతే ఇదే విధానాన్ని అనుసరిస్తామని వైద్యులు పేర్కొన్నారు. ఐవీఎఫ్, ఐయూఐ ద్వారా అండాలను అవసరమైన వీర్యకణాలతో సంయోగం చేసి.. మహిళ గర్భంలో ప్రవేశపెడతారు. ఇలా చేయడం వల్ల చాలా మంది దంపలతుకు సంతానం కలుగుతుందని వైద్యులు వివరించారు. ఒక్కసారికే గర్భం దాల్చే అవకాశాలు తక్కువ అని.. ఈ ప్రక్రియను నాలుగైదుసార్లు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

లక్షల రూపాయల్లో ఫీజు

"సంతానం లేని దంపతులకు పిల్లలు కలిగించే పూచీ మాది" అని చెప్పుకొనే సాఫల్య కేంద్రాలు రూ.5 లక్షలకు మించి ఫీజులు వసూలు చేస్తుంటాయనే ఆరోపణలున్నాయి. మరికొన్ని కేంద్రాలైతే.. లక్షలు వసూలు చేసి, చేతులెత్తేస్తుంటాయి. ఇంకొన్ని ఏకంగా అనైతిక వ్యాపారానికి పాల్పడుతుంటాయి. వీరిని ఆశ్రయించే దంపతులకు తొలుత సైక్లింగ్ పేరుతో ఇంజెక్షన్లు ఇచ్చి, ప్రయత్నాలు చేస్తారు. ఆ తర్వాత ఐవీఎఫ్, ఐయూఐ పద్ధతులను అమలు చేస్తారు. చాలా కేసుల్లో దాతల నుంచి సేకరించిన వీర్యకణాలను, అండాలను రహస్యంగా వినియోగిస్తారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అనుమతి ఉన్న సంతాన సాఫల్య కేంద్రాలు 50-60 వరకు ఉండగా.. అనధికారికంగా 200కు మించి కొనసాగుతున్నట్లు అంచనా. సంతాన సాఫల్యం కోసం పరీక్షలు చేసే జెనెటిక్ కేంద్రాలు, జెనెటిక్ ల్యాబ్‌లు కూడా స్కానింగ్ కేంద్రాల్లో అనుమతి లేకుండా కొనసాగుతున్నాయి. ఇలాంటి కేంద్రాలను వైద్యాధికారులు పట్టించుకోరనే ఆరోపణలున్నాయి.

ఫర్టిలిటీ సెంటర్‌లో ఘరానా మోసం

(మొదటిపేజీ తరువాయి)

ఎందుకు వచ్చిందో అర్థం కాని ఆ దంపతులు.. అనుమానంతో సృష్టి సంతాన సాఫల్య కేంద్రం నిర్వాహకులను నిలదీశారు. వారు పొంతన లేని సమాధానాలు ఇవ్వడంతో.. బాధిత దంపతులు గోపాలపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ బాబుకు డీఎన్ఏ పరీక్షలు నిర్వహించగా.. వీర్యదాత ద్వారా ఆ బిడ్డ జన్మించినట్లు తేలింది. దాంతో పోలీసులు సదరు ఫర్టిలిటీ కేంద్రంపై కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. ఉత్తర మండలం డీసీపీ రష్మీ పెరుమాల్ నేతృత్వంలోని గోపాలపురం పోలీసుల బృందం.. వైద్యాధికారులు, సికింద్రాబాద్ ఆర్డీవో, మారేడుపల్లి తహసీల్దార్ శనివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి వరకు సృష్టి టెస్ట్‌ట్యూబ్ సెంటర్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ఏడేళ్ల క్రితమే ఈ కేంద్రాన్ని సీజ్ చేసిన విషయం వెలుగులోకి వచ్చింది. అయితే.. నిర్వాహకులు గుట్టుచప్పుడు కాకుండా.. రహస్యంగా దందాను నిర్వహిస్తున్నట్లు పోలీసులు నిగ్గుతేల్చారు. ఫర్టిలిటీ సెంటర్ డాక్టర్ నమ్రత తమ కేంద్రంపై కేసు నమోదవ్వగానే విజయవాడలోని తల్లిదండ్రుల వద్దకు వెళ్లిపోయారు. దీంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు విజయవాడలోని గురునానక్ కాలనీకి చేరుకుని, పటమట పోలీసుల సహకారంతో నమ్రతను అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత ఆమెను హైదరాబాద్‌కు తీసుకువచ్చారు. ఆమెకు నెల్లూరు, విజయవాడ, విశాఖపట్టణాల్లో కూడా ఫర్టిలిటీ సెంటర్లు ఉన్నట్లు గుర్తించి, అక్కడి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో.. అక్కడా తనిఖీలు నిర్వహించారు. విశాఖలోని జిల్లాపరిషత్ జంక్షన్‌లో ఉన్న సృష్టి టెస్ట్‌ట్యూబ్ సెంటర్‌పైనా హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు జరిపారు. ఈ దాడుల్లో కీలక ఆధారాలను సేకరించినట్లు తెలిసింది. సెంటర్ ఇన్‌చార్జి సీహెచ్ కల్యాణితోపాటు.. మరికొందరిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఇక్కడి సెంటర్‌ను 2018లో ఏర్పాటు చేయగా.. 2023 నుంచి రెన్యూవల్ చేసుకోలేదని విశాఖ వైద్యాధికారులు వెల్లడించారు. సికింద్రాబాద్‌లోని సృష్టి టెస్ట్‌ట్యూబ్ సెంటర్‌లో ఖరీదైన వైద్యపరికరాలున్నట్లు వైద్యాధికారులు గుర్తించారు. మూడంతస్తుల భవనంలో ఒక అంతస్తులో డాక్టర్ నమ్రత ఇల్లు, మరో అంతస్తులో ఆమె కుమారుడి(లాయర్)కి సంబంధించిన కార్యాలయం, ఇంకో అంతస్తులో ఫర్టిలిటీ సెంటర్ కొనసాగుతున్నాయి. హైదరాబాద్‌తోపాటు.. పలు రాష్ట్రాల దంపతులకు ఇక్కడ వైద్యం చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

భారీగా వీర్యం నిల్వలు?

పోలీసులు సృష్టి సంతాన సాఫల్య కేంద్రం నుంచి కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఫ్రీజర్‌లో భారీ ఎత్తున వీర్యం నిల్వలున్నట్లు గుర్తించారు. ఆస్పత్రి కంప్యూటర్ హార్డ్‌డిస్క్‌ను సీజ్ చేసి, మరింత సమాచారాన్ని సేకరించడానికి అందులోని డాటాను విశ్లేషిస్తున్నారు. వీడియో రికార్డింగ్ మధ్య సోదాలు, తనిఖీలను కొనసాగించారు. ఈ క్రమంలో పలువురు సిబ్బంది వాంగ్మూలాలను సేకరించారు. తాము ఆ కేంద్రంలో వైద్యం చేయడం లేదని డాక్టర్ నమ్రత చెప్పగా.. లేదులేదు.. వైద్యం కొనసాగుతోందని సిబ్బంది వాంగ్మూలం ఇవ్వడం గమనార్హం..! అటు విశాఖపట్నం సెంటర్‌లో కూడా భారీగా వీర్యం నిల్వలు లభ్యమైనట్లు సమాచారం. కాగా.. పోలీసులు, వైద్యులు, రెవెన్యూ అధికారుల సంయుక్త తనిఖీల వివరాలను ఆదివారం వెల్లడిస్తామని డీసీపీ రష్మీ వెల్లడించారు. ఈ కేంద్రంలో అక్రమంగా ఐవీఎఫ్ నిర్వహిస్తున్నట్లు తెలుస్తోందని, జిల్లా వైద్యాధికారులు లోతైన దర్యాప్తు చేస్తున్నారని చెప్పారు. ప్రాథమిక విచారణ పూర్తయ్యాక.. మీడియాకు వివరాలు వెల్లడిస్తామని చెప్పారు.

సిగాచి బాధితులకు న్యాయం చేయాలి

- హైకోర్టులో పిల్

పటాన్‌చెరు రూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): పాశమైలారం పారిశ్రామిక వాడలోని సిగాచి పరిశ్రమలో గత నెల 30న జరిగిన పేలుడు ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు, గాయపడిన వారికి న్యాయం చేయాలని కోరుతూ సైంటిస్ట్ ఫర్ పీపుల్ సంస్థ వ్యవస్థాపకుడు కలపాల బాబూరావు హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఈ ప్రమాదంలో గల్లంతైన ఎనిమిది మందితో సహా మరణించిన 54మంది కార్మికుల కుటుంబాలకు, గాయపడిన 28 మంది కార్మికులకు సీఎం, పరిశ్రమ యాజమాన్యం ప్రకటించిన పూర్తి పరిహారాన్ని వెంటనే చెల్లించాలని అందులో కోరారు. పరిశ్రమ యాజమాన్యాన్ని వెంటనే అరెస్ట్ చేయాలని విజ్ఞప్తి చేశారు. 8 మంది కార్మికుల మృతదేహాలు లభ్యం కానప్పటికీ, వారిని మరణించిన వారిగానే ప్రకటించి పరిహారం అందించాలని కోరారు.

హైదరాబాద్‌లో ఎన్‌హెచ్‌ఆర్సీ బహిరంగ విచారణ

హైదరాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్సీ) హైదరాబాద్‌లో సోమ, మంగళవారం రెండు రోజుల పాటు బహిరంగ విచారణ నిర్వహించనుంది. రాష్ట్రంలో మానవ హక్కుల ఉల్లంఘనలకు సంబంధించి నమోదైన 109 కేసులపై అధికారులు ఈ సందర్భంగా విచారణ జరుపనున్నారు. జూబ్లీహిల్స్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో నిర్వహించే కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఆర్సీ చైర్మన్ జస్టిస్ వి.రామసుబ్రహ్మణ్యన్, కమిషన్ సభ్యులు జస్టిస్ బిద్యుత్ రంజన్ సారంగి, విజయ భారతి సయని, ప్రధాన కార్యదర్శి భరత్‌లాల్ సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొంటారు.

సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌గా శబరి ఎక్స్‌ప్రెస్

హైదరాబాద్ సిటీ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్-త్రివేండ్రం మధ్య నడిచే శబరి ఎక్స్‌ప్రెస్ వేగాన్ని పెంచి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌గా మార్చేందుకు రైల్వేబోర్డు ఆమోదం తెలిపింది. ఈ మార్పును సెప్టెంబరు 29వ తేదీ నుంచి అమలు చేయనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ప్రస్తుతం శబరి ఎక్స్‌ప్రెస్ 17229/17230 నంబర్లతో నడుస్తుండగా.. సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు కొత్తగా 20629/20630 నంబర్లను కేటాయించారు. ఈ రైలు వేగాన్ని పెంచడంతోపాటు దాని వేళల్లోనూ మార్పులు చేశారు. ప్రస్తుతం శబరి ఎక్స్‌ప్రెస్ సికింద్రాబాద్ నుంచి మధ్యాహ్నం 12.20 గంటలకు బయల్దేరుతుండగా.. సెప్టెంబరు 29నుంచి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 2.25 గంటలకు బయల్దేరనుంది.

ఎన్‌హెచ్ఎమ్ ఆఫీసు ఎదుట ఉద్యోగుల ధర్నా

హైదరాబాద్, జూలై 26(ఆంధ్రజ్యోతి): జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్ఎచ్ఎమ్)లో పనిచేస్తున్న నాలుగో తరగతి ఉద్యోగుల వేతనాన్ని రూ.15,600కు పెంచాలని ఎన్‌హెచ్ఎమ్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. కోఠీలోని ఎన్‌హెచ్ఎమ్ కమిషనర్ కార్యాలయం వద్ద సంఘం సభ్యులు శనివారం ధర్నా నిర్వహించారు. తమకు రూ.10,400 వేతనమే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు అధికారులు కాంట్రాక్టు ఉద్యోగులపై సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారని, కొంత మందికి ఎక్కువ జీతాలిస్తూ, మిగతా వారి పొట్టకొడుతున్నారని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నరసింహ ఆరోపించారు.

సమస్యలు పరిష్కరించకుంటే 15 నుంచి ఉద్యమమే

- సర్కారుకు ఉద్యోగుల జేఏసీ హెచ్చరిక

హైదరాబాద్, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే ఆగస్టు 15 నుంచి ఉద్యమ కార్యాచరణ చేపడతామని ఉద్యోగుల జేఏసీ హెచ్చరించింది. హైదరాబాద్‌లోని టీఎన్జీవో కార్యాలయంలో జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు విలేకరులతో మాట్లాడుతూ 2023 జూలై 1 నుంచి అమలు చేయాల్సిన నూతన వేతన సవరణ కోసం మాట్లాడకపోవడం, 57 డిమాండ్లపై నివేదికను బయట పెట్టకపోవడం అధికారుల నిర్లక్ష్యమేనన్నారు. సెప్టెంబరు 1న పెన్షన్ విద్రోహదినంగా పాటించనున్నట్లు ప్రకటించారు.

విలీనమా.. పస లేని ఆరోపణ

- బీఆర్ఎస్‌ను ఏ పార్టీలోనూ కలిపే ప్రసక్తే లేదు
- రేవంత్, రమేశ్ కలిసి వస్తే చర్చకు సిద్ధం
- సీఎం రమేశ్ వ్యాఖ్యలకు కేటీఆర్ కౌంటర్

హైదరాబాద్ సిటీ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రాజకీయంగా ఇరకాటంలో పడిన ప్రతిసారి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు 'బీఆర్ఎస్ విలీనం' అనే పసలేని అంశాన్ని తెరపైకి తెస్తాయని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్‌ను ఏ పార్టీలోనూ కలిపే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. బీజేపీ నేత, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ చేసిన వ్యాఖ్యలకు కేటీఆర్ ఈ మేరకు కౌంటర్ ఇచ్చారు. తాము ఇరకాటంలో పడిన ప్రతిసారి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు విలీనం అనే పనికిరాని, పసలేని చెత్త అంశాన్ని తెరపైకి తీసుకవస్తాయని కేటీఆర్ ఓ ప్రకటన చేశారు. బీఆర్ఎస్‌ను ఎప్పుడూ ఏ పార్టీలో విలీనం చేసే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. కుంభకోణాల నుంచి దృష్టి మరల్చేందుకు, తెలంగాణ ప్రజలను అయోమయానికి గురి చేసేందుకే ఈ విలీన ఆరోపణలు అన్నారు. నిబంధనలను అతిక్రమించడం, కాంట్రాక్టులను అనుకున్న వాళ్లకు కట్టబెట్టడం రేవంత్‌కు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్, సీఎం రమేశ్ కలిసివస్తే హెచ్‌సీయూ రూ.10 వేల కోట్ల కుంభకోణం, రూ.1660 కోట్ల రోడ్ కాంట్రాక్ట్ కుంభకోణంపై చర్చకు తాను సిద్ధమని కేటీఆర్ కౌంటరిచ్చారు. హెచ్‌సీయూ భూములు తాకట్టుపెట్టి రూ.10 వేల కోట్లు దోచుకునేందుకు సీఎం రేవంత్‌కు సహకరించినందుకు లేని ఫ్యూచర్ సిటీకి రహదారి నిర్మాణానికి రూ.1660 కోట్ల కాంట్రాక్టును సీఎం రమేశ్‌కు కట్టబెట్టారని కేటీఆర్ ఆరోపించారు. రేవంత్, రమేశ్ బాగోతం బయటపెట్టడంతో కుడితిలో పడిన ఎలుకల్లా ఇద్దరూ కొట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. దేశంలో ఎక్కడా లేని కుమ్మక్కు రాజకీయం తెలంగాణలో జరుగుతోందని కేటీఆర్ పేర్కొన్నారు.

కవితను జైలు నుంచి విడిపిస్తే.. బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేస్తామన్నది మరిచావా?

- ఈడీ, సీబీఐ తమ దాకా రాకుండా చూడమని కోరింది ఎవరు
- కమ్మవారు అవసరం లేదన్న మాట గుర్తు లేదా
- కేటీఆర్‌పై అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ సంచలన ఆరోపణలు
- తెలంగాణలో బీజేపీ, టీడీపీ పొత్తు పెట్టుకుంటే తప్పేంటని నిలదీత

అనకాపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్‌పై బీజేపీ నేత, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ సంచలన ఆరోపణలు చేశారు. బీఆర్ఎస్‌ను బీజేపీలో కలపడానికి సిద్ధంగా ఉన్నానని తనతో చెప్పిన మాటను మరిచిపోయావా? అంటూ కేటీఆర్‌ను ఆయన ప్రశ్నించారు. సీబీఐ, ఈడీ దాడులు తమ దాకా రాకుండా చూడాలని, కవితను జైలు నుంచి బయటకు తీసుకురావాలని కోరింది గుర్తు లేదా? అంటూ నిలదీశారు. ఆంధ్రాకు చెందిన బీజేపీ ఎంపీకి రూ.1660 కోట్ల పనులను నామినేషన్ పద్ధతిలో కట్టబెట్టారంటూ కేటీఆర్ పరోక్షంగా తనపై చేసిన ఆరోపణలకు సీఎం రమేశ్ స్పందించారు. అనకాపల్లిలో మాట్లాడిన సీఎం రమేశ్.. తమ 'రిత్విక్ సంస్థ' చట్ట బద్ధంగా, నిబంధనల మేరకు తెలంగాణలో పనులు దక్కించుకుందని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డికి తాను రుణాలు ఇప్పించినందుకే.. నామినేషన్ పద్ధతిలో పనులు ఇచ్చారన్న కేటీఆర్ వ్యాఖ్యలను తిప్పికొట్టారు. ప్రభుత్వం కాంట్రాక్టు పనులు అప్పగించే సమయంలో ఎటువంటి నిబంధనలు పాటిస్తుందో పదేళ్ల మంత్రిగా చేసిన కేటీఆర్‌కు తెలియదా? అని ప్రశ్నించారు. కాగా, కవిత జైల్లో ఉన్నప్పుడు ఢిల్లీలో తన ఇంటికి వచ్చిన కేటీఆర్ ఏం మాట్లాడారో గుర్తుచేసుకోవాలని సీఎం రమేశ్ ఈ సందర్భంగా అన్నారు. సీబీఐ, ఈడీ దాడులు తమ వరకు రాకుండా చూడాలని, కవితను బయటకు తీసురావాలని కోరలేదా? అని ప్రశ్నించారు. అంతేకాదు. ఈ పనిచేస్తే బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని కూడా వ్యాఖ్యానించారన్నారు. అలాగే, తుమ్మల నాగేశ్వరరావును ఎందుకు వదిలేసుకున్నారని అడిగితే కమ్మవారు అవసరం లేదని, రేవంత్ గెలిచిన తరువాత రెడ్లు ఆయన వెనుక వెళ్లిపోయారని చెప్పిన విషయాన్ని కేటీఆర్ గుర్తుచేసుకోవాలన్నారు. తెలంగాణలో టీడీపీ, బీజేపీ పొత్తు పెట్టుకుంటే తప్పేంటని రమేశ్ వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో సుమారు రూ.7 లక్షల కోట్లు కాంట్రాక్టులు ఇచ్చారని, అందులో తెలంగాణ, ఆంధ్రాకు చెందినవారు ఎవరు ఎన్ని పనులు పొందారో వివరాలు తన దగ్గర ఉన్నాయన్నారు. అన్ని విషయాలపైనా బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నానని కేటీఆర్‌కు సవాల్ విసిరారు. కేటీఆర్ గురించి మాట్లాడాలంటే చాలా విషయాలు ఉన్నాయని, కానీ సంస్కారం అడ్డొస్తోందన్నారు. కేటీఆర్ నోటికొచ్చినట్టు మాట్లాడితే సహించేది లేదని సీఎం రమేశ్ హెచ్చరించారు.



హైదరాబాద్‌లో ఏపీ సిట్ సోదాలు

- భారతీ సిమెంట్స్ ఆఫీసులోకి బృందం
- బాలాజీ గోవిందప్ప చాంబర్ పరిశీలన
- అక్కడి మీటింగ్ హాల్‌లోనే డిస్టిలరీల ప్రతినిధులతో సమావేశాలు
- సాంకేతిక ఆధారాలతో గుర్తించిన సిట్
- రాజ్ కసిరెడ్డి సాఫ్ట్‌వేర్ ఆఫీసు..
- చాణక్య 'టీ గ్రిల్' ఆవరణలో తనిఖీలు

అమరావతి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఏపీ మద్యం కుంభకోణం దర్యాప్తులో మరిన్ని ఆధారాల సేకరణ కోసం 'సిట్' హైదరాబాద్‌లో విస్తృత సోదాలు నిర్వహించింది. సహ నిందితులు, డిస్టిలరీల యజమానులతో భేటీలు జరిపిన ప్రాంతాలను గూగుల్ టేకౌట్ ద్వారా గుర్తించిన 'సిట్'... శనివారం ఆ ప్రదేశాలను ప్రత్యక్షంగా పరిశీలించింది. ఈ క్రమంలో జగన్ కుటుంబానికి చెందిన భారతీ సిమెంట్స్ కార్యాలయంలోనూ అడుగు పెట్టింది. మద్యం స్కామ్‌లో ఏ1గా ఉన్న రాజ్ కసిరెడ్డికి చెందిన రిసోర్స్ వన్ ఐటీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కార్యాలయంతోపాటు ఆయన అనుచరుడు చాణక్య(ఏ-8)కు చెందిన టీ గ్రిల్ రెస్టారెంట్ (నానక్‌రామ్ గూడ)లోనూ తనిఖీలు నిర్వహించింది.

అక్కడే బాలాజీ భేటీలు...

భారతీ సిమెంట్స్ శాశ్వత డైరెక్టర్ బాలాజీ గోవిందప్ప(ఏ-33) పలువురు డిస్టిలరీల యజమానులతో సమావేశమైన ప్రదేశాన్ని 'సిట్' ఇదివరకే సాంకేతికత ద్వారా గుర్తించింది. హైదరాబాద్ బంజారాహిల్స్ రోడ్ నంబర్ 10లో ఉన్న భారతీ సిమెంట్స్ కార్యాలయంలోని ఈ భేటీలు జరిగినట్లు తేలింది. బాలాజీ గోవిందప్ప చాంబర్‌ను పరిశీలించేందుకు వెళ్లిన సిట్ సిబ్బందిని... సంస్థ న్యాయవాదులు అడ్డుకున్నారు. బాలాజీ గోవిందప్ప చాంబర్‌లో మాత్రమే తాము తనిఖీ చేస్తామని సిట్ అధికారులు స్పష్టం చేశారు. అయినప్పటికీ న్యాయవాదులు వినలేదు. మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 7 గంటల దాకా ఈ హైడ్రామా కొనసాగింది. సిట్ అధికారులు బాలాజీ గోవిందప్ప చాంబర్‌ను పరిశీలించి, ఆయన సహాయకులను విచారించి కొన్ని వివరాలు తెలుసుకున్నారు. ఆయన మీటింగ్ హాల్‌ను కూడా పరిశీలించారు. అప్పటికే సేకరించిన సాంకేతిక ఆధారాలతో దీనిని నిర్ధారించుకున్నారు. పక్కనే బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 11లోని బాలాజీ గోవిందప్ప ఇంటికి చేరుకున్నారు. అక్కడ కూడా ఆయన డిస్టిలరీల ప్రతినిధులతో సమావేశమైనట్లు ఇదివరకే గుర్తించారు. అక్కడా సహ నిందితులతో జరిపిన సమావేశాలు, ఇతర అంశాలకు సంబంధించిన కొన్ని డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఇక... రాజ్ కసిరెడ్డి కార్యాలయంలో లభించిన కొన్ని ఫైళ్లు, బూనేటి చాణక్య రెస్టారెంట్‌లో పలుమార్లు సమావేశమైన వ్యక్తుల వివరాలు కూడా సేకరించినట్లు తెలిసింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar, Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.